అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
బుధవారం 20-9-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 210 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



టాటా..వీడుకోలు

గ్రూప్ ఫోటోతో పాత పార్లమెంట్ భవనానికి బైబై



నూతన పార్లమెంట్‌లో అడుగుపెట్టడానికి కొన్ని గంటల ముందు లోక్‌సభ, రాజ్యసభ సభ్యులంతా పాత భవనం లోపలి ప్రాంగణంలో సమావేశమయ్యారు. అందరూ కలిసి గ్రూప్ ఫోటో దిగారు. ఆ తరువాత లోక్‌సభ సభ్యులు, రాజ్యసభ సభ్యులు వేర్వేరుగా గ్రూఫ్ ఫోటోలకు పోజులిచ్చారు. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్కర్, ప్రధాని మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ నారాయణ్ సింగ్, మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్, హెచ్‌డి దేవెగౌడ మొదటి వరుసలో కూర్చున్నారు. మరో ఫోటోలో ఉపరాష్ట్రపతి, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మధ్యలో ప్రధాని మోడీ కూర్చుకున్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే, కేంద్ర మంత్రులు, లోక్‌సభలో ఎనిమిది, అంతకంటే ఎక్కువ మంది, రాజ్యసభలో ఐదు అంతకంటే, అంతకంటే ఎక్కువ మంది సభ్యుల బలం కలిగిన పార్టీల నాయకులు, సీనియర్ సభ్యులు, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, లోక్‌సభ, రాజ్యసభ సెక్రెటరీ జనరల్స్ ముందు వరుసలో కూర్చున్నారు.

అయితే ఈ కార్యక్రమంలో చిన్నపాటి అపశృతి చోటు చేసుకుంది. బీజేపీ రాజ్యసభ ఎంపీ నరహరి అమీన్ స్పృహ కోల్పోయారు. 68 ఏండ్ల నరహరి అమీన్ ఉన్నట్టుండి కుప్పకూలిపోయారు. దీంతో వెంటనే మిగతా సభ్యులంతా కలిపి ఆయనను పైకి లేపారు. మంచి నీళ్ల ఇచ్చారు. దీంతో 5 నిమిషాలపాటు ఆందోళనకర వాతావరణం నెలకొంది. అయితే ఆ తర్వాత నరహరి కోలుకున్నారు. దీంతో మళ్లీ తిరిగి ఫోటో సెషన్‌లో పాల్గొన్నారు.

రాజ్యాంగం పట్టుకొని కొత్త భవనంలోకి అధీర్ రంజన్ చౌదరి



పాత పార్లమెంట్‌లో ఫోటో సెషన్ ముగిసిన అనంతరం ప్రధాని నరేంద్ర మోడీతో సహా ఎంపీలంతా నూతన పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. ఎంపీలంతా పాత భవనం నుంచి కొత్త భవనకు వరకు పాదయాత్రగా వెళ్లారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, నితిన్ గడ్కరీ, ఇతర సభ్యులు కొత్త పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. అలాగే లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అయినా నాయకుడు అధీర్ రంజన్ చౌదరి, ఎంపీలు రాహుల్ గాంధీ, గౌరవ్ గొగోయ్ తదితరులు మధ్యాహ్నం లోక్‌సభ సమావేశాల నిమిత్తం పార్లమెంటు కొత్త భవనంలోకి ప్రవేశించారు. కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటు కొత్త భవనంలోకి ప్రవేశించినప్పుడు అధీర్ రంజన్ చౌదరి ...2లో

2029 నుంచి మహిళా రిజర్వేషన్లు?

అమలు 15 ఏండ్లే

ఏ చిన్న అవకాశం దొరికినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓట్ల రాజకీయానికి సిద్ధమైపోతోంది. ఇన్నాళ్లూ అటకెక్కించిన మహిళా బిల్లును ఎన్నికల ముందు పార్లమెంట్‌లో పెట్టింది. కారణాలేమైనప్పటికీ ప్రతిపక్షాలు సైతం బిల్లును స్వాగతిస్తుండటంతో ఆమోదం ఖాయంగా కనిపిస్తోంది. కానీ జనగణ, ఆ పైన నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తర్వాతే బిల్లు అమల్లోకి వస్తుందని బీజేపీ సర్కారు మెలిక పెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇందులో ఎన్నికల్లో బూస్టింగ్ అవుతుందనే ఉద్దేశమే తప్ప, బిల్లు అమలు పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదనే విమర్శలు తలెత్తుతున్నాయి.

లోక్‌సభ ముందుకు బిల్లు | **నేడు చర్చ**



న్యూఢిల్లీ : చట్ట సభల్లో మహిళలకు 33శాతం సీట్లు కేటాయించే రిజర్వేషన్ల బిల్లు ఎట్టకేలకు లోక్‌సభ ముందుకు వచ్చింది. అయితే, ఈ బిల్లు వల్ల తక్షణమే మహిళా లోకానికి జరిగే ప్రయోజనం ఏమీ లేదు. బిల్లులో పేర్కొన్న అంశాల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన సకాలంలో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పూర్తయి, ఎటువంటి న్యాయపరమైన వివాదాలు తలెత్తకుండా ఉంటే 2029 ఎన్నికల నాటికి రిజర్వేషన్లు అమలులోకి వచ్చే అవకాశం ఉంది. అప్పుడు కూడా దిగువ సభలకే రిజర్వేషన్లను పరిమితం చేశారు. రాష్ట్రాలలో శాసనసభకు, కేంద్రంలో లోక్‌సభకు మాత్రమే నూతన బిల్లు ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఈ బిల్లు అమలులోకి వచ్చిన తరువాత 33 శాతం రిజర్వేషన్లు 15 సంవత్సరాలు మాత్రమే అమలులో ఉంటాయి. ఆ తరువాత సమీక్షించి నిర్ణయం తీసుకుంటారు.

శాసనమండళ్లు, రాజ్యసభకు ఈ బిల్లు వర్తించదు. మరోవైపు ఒబిసిలను విస్మరించారంటూ ఇప్పటికే నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పార్లమెంటు నూతన భవనంలో మంగళవారం జరిగిన మొట్టమొదటి సమావేశంలోనే కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. నారి శక్తి వందన్ అభియాన్ పేరుతో రూపొందించిన ఈ బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. న్యాయశాఖ మంత్రి బిల్లును ప్రవేశపెట్టడానికి ముందు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ మాట్లాడుతూ ఈ బిల్లుతో కొత్త చరిత్రను రాస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 19 దేశ చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోతుందని అన్నారు. బిల్లుపై లోక్‌సభలో నేడు (బుధవారం) చర్చ, ఓటింగ్ జరగనుంది.

లోక్‌సభ ఆమోదం అనంతరం గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. మహిళాబిల్లు 2010లోనే రాజ్యసభలో ఆమోదం పొందింది. అయితే, తాజాగా క్యాబినెట్ ఆమోదం పొందిన బిల్లు 2010 నాటిది కాదని, కేంద్రం కొత్తగా రాజ్యాంగానికి సవరణ ప్రతిపాదించిందని, అందువల్ల రాజ్యసభ ఆమోదం కూడా తప్పనిసరి అని అధికారవర్గాలు తెలిపాయి. వాస్తవానికి 1996లో హెచ్‌డి దేవగౌడ నేతృత్వంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల బిల్లును తొలుత లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఆ తరువాత వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ...2లో

ఏకగ్రీవంగా ఆమోదం తెలపండి

మహిళా రిజర్వేషన్ బిల్లును సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించండి. 'ఎంతో ముఖ్యమైన బిల్లును తీసుకువస్తున్నాం. మహిళల నేతృత్వంలో అభివృద్ధి జరగడమే లక్ష్యం. ఇది మన ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది.'

\- ప్రధాని మోడీ

మరో జుమ్లా కాకూడదు

మహిళా రిజర్వేషన్ల బిల్లు 2024 ఎన్నికలకు ముందు ఓటర్లను మభ్యపెట్టడానికి ఉద్దేశించిన మరో మోడీ జుమ్లా కాకూడదు. ఈ మేరకు ' ఇది ఎప్పుడు ఆమోదం పొందినా తదుపరి జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన పూర్తయిన తరువాతే 2029నాటికి అమలులోకి వస్తాయి'. ' ఎట్టకేలకు మహిళా రిజర్వేషన్ల బిల్లు వచ్చింది. 2014 ఎన్నికల ప్రచార సమయంలో తాను ప్రధాని అయితే మొట్టమొదట ఈ బిల్లునే తీసుకువస్తానని హామీ ఇచ్చారు. అప్పటి నుండి ఇప్పటి వరకు 10 సంవత్సరాల సమయం గడిచింది. ఈ బిల్లుకోసం 25 సంవత్సరాల సుదీర్ఘ సమయం వేచి చూశాం'.2010లో రాజ్యసభ సభ్యునిగా బిల్లు ఆమోదం కోసం ఓటు వేశా.



\- సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఏచూరి

బీజేపీకి లాభం చేకూర్చడానికే ఎంఐఎం థర్డ్ ఫ్రంట్

రెండు ఫ్రంట్లకు సమానదూరమనే బీఆర్ఎస్ వైఖరి కూడా ఈ కోవలోనిదే..

- సెక్యులర్ శక్తులను ఏకం చేయడమే ప్రత్యామ్నాయం : సీపీఐ(ఎం)



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో మూడో ఫ్రంట్‌ను సీఎం కేసీఆర్‌తో కలిసి ఏర్పాటు చేస్తామని ఎంఐఎం అధినేత, పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ ప్రకటించడం మతోన్మాద బీజేపీకి ఉపయోగపడేలా ఉందని సీపీఐ(ఎం) పేర్కొంది. ఈ చర్య మత ప్రాతిపదిక రాజకీయాలకు మేలు చేసి, దేశ సమైక్యత, సమగ్రతకు నష్టం కల్గిస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలోని రెండు ఫ్రంట్‌లకు సమదూరం పాటిస్తామని బీఆర్ఎస్ ప్రకటించడం కూడా బీజేపీకి దోహదపడే చర్యేనని వివరించింది. ఈ రెండు పార్టీలు పరస్పరం సహకరించుకునే ధోరణి, వైఖరులను పార్టీ రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈ మేరకు సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటన విడుదల చేశారు.

గతంలో జరిగిన అనేక శాసనసభల ఎన్నికల్లో పోటీ చేసిన ఎంఐఎం బీజేపీ వ్యతిరేక ఓట్లను చీల్చి ఆ పార్టీకి లాభం చేకూర్చిందని గుర్తుచేశారు. ఫలితంగా బీహార్, ఉత్తరప్రదేశ్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో సెక్యులర్ ఓట్లు చీలిపోయాయని తెలిపారు. తాజాగా థర్డ్ ఫ్రంట్ అనే ప్రకటన కూడా అందులో భాగమేనని విమర్శించారు. ప్రతీ ఎన్నికల సందర్భంలోనూ ఎంఐఎం వైఖరి ఇదే విధంగా ఉండటాన్ని గమనించాలని కోరారు. దేశంలో బీజేపీ మతోన్మాద ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి సెక్యులర్ శక్తులు ఒక్కటై ఎన్డీఏ కూటమిని ఎదుర్కొంటుంటే, ఎంఐఎం చెప్పే థర్డ్ ఫ్రంట్ వల్ల ఎవరికి లాభం? అని ఆయన ప్రశ్నించారు. మరోపక్క యూనిఫాం సివిల్ కోడ్, ఎన్నార్సీ వంటి చట్టాలను తెచ్చి దేశంలోని మైనార్టీల హక్కులు కాలరాయడానికి బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని గుర్తుచేశారు. అలాంటి పార్టీకి మేలు చేసే విధంగా ఎంఐఎం వ్యవహరించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. అదే సందర్భంలో బీజేపీ వ్యవహరిస్తున్న పద్ధతిలోనే ...11లో

ఖలిస్థానీ చిచ్చు ..



- కెనడా దౌత్యవేత్త బహిష్కరణ
- ఐదు రోజుల్లో దేశం విడిచి వెళ్లాలని కేంద్రం ఆదేశం
- ముందుగా కెనడాలోని భారత దౌత్యవేత్తపై బహిష్కరణ వేటు

11లో..

రాలనున్న కమలం రేకులు..

హస్తం గూటికి బీజేపీ సీనియర్లు...?

- రాజగోపాల్, వివేక్, విజయశాంతి, కొండా విశ్వేశ్వరరెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి రహస్య మంతనాలు
- హైదరాబాద్‌లో భేటీ- భవిష్యత్ కార్యాచరణపై చర్చ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మునుగోడులో గెలిచి.. రాష్ట్రంలో తిష్ట వేద్దామనుకుంటే, ఆ పాచిక పారలేదు... పార్టీలో చేరి ఖమ్మం జిల్లాలో మాంచి ఊపు తెస్తాడనుకున్న పొంగులేటి హ్యాండిచ్చి...కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ దెబ్బలకే వాడిపోయిన కమలానికి ఇప్పుడు మరో చిక్కొచ్చి పడింది. ఈ చిక్కుతో దాని రేకులు మరిన్ని రాలిపోనున్నాయని సమాచారం. బీజేపీలో సీనియర్లుగా ఉన్న పలువురు నేతలు ఆ పార్టీని వీడి 'అభయ హస్తం' అందుకునేందుకు రెడీ అయ్యారు. ఇందుకోసం వినాయక చవితి పండుగ రోజైన సోమవారం వారు హైదరాబాద్‌లో రహస్యంగా భేటీ అయ్యారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... పెద్దపల్లి మాజీ ఎంపీ గడ్డం వివేక్ వెంకటస్వామి ఇంట్లో వీరు సమావేశమయ్యారు. ఆయనతోపాటు మాజీ ఎంపీలు కొండా విశ్వేశ్వరరెడ్డి, విజయశాంతి, రవీంద్రనాయక్, మాజీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, సీనియర్ నేతలు గరికపాటి రామ్మోహనరావు, చాడా సురేశ్‌రెడ్డి తదితరులు ఈ భేటీకి ...2లో

బీఆర్ఎస్‌కు కౌంట్‌డౌన్

మిగిలింది 98 రోజులే...

- కారు, కమలం, కైట్ ముసుగు తొలగిపోయింది
- భారతమాత గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి లేదు
- మెరుగైన ధరణిని తెస్తాం
- సీడబ్ల్యూసీ సమావేశాలను జయప్రదం చేసిన నేతలకు ధన్యవాదాలు : రేవంత్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ పాలనకు ఇంకా 98రోజులే మిగిలి ఉన్నాయని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ విజయభేరి సభ జయప్రదం కావడాన్ని బీఆర్ఎస్ నేతలు తట్టులేకపోతున్నారని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కలను నెరవేర్చారని తెలిపారు. తెలంగాణ తల్లి సోనియమ్మను స్వాగతించాల్సింది పోయి...బీఆర్ఎస్ నేతలు విమర్శించడం సిగ్గుచేటన్నారు. వారు రాజకీయ విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బహురూపుల వేషాలు వేస్తూ విజయభేరి సభను అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రానికి రావడంతో బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీల ముసుగులు తొలగిపోయాయనీ, కారు, కమలం, కైట్ వేర్వేరు కాదనీ, అవి ఒక్కటేనని తెలిపోయిందన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మాజీ ఎంపీలు మధుయాష్కీగౌడ్, అంజన్‌కుమార్‌యాదవ్, మల్లు రవి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ...11లో

నేటినుంచి డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ

- 5,089 ఉపాధ్యాయ పోస్టుల్లో 2,598 పోస్టులు మహిళలకే

వివరాలు 2లో..

నేటినుంచి ఎడ్‌సెట్, పీఈసెట్ కౌన్సెలింగ్




వివరాలు 11లో...

చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ ...

- ఎన్నికల వేళ కుట్ర : న్యాయవాదులు హరీశ్ సాల్వే,సిద్ధార్థ్ లూథ్రా
- ఏపీ హైకోర్టులోముగిసిన వాదనలు

11లో..



ఏపీ విభజన సరిగా జరగలేదు

- రెండు రాష్ట్రాల్లో రక్తపాతానికి దారితీసింది : పార్లమెంట్‌లో మోడీ
- అవమానించడమే : రాహుల్ గాంధీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో భాగంగా సోమవారం ప్రధాని మోడీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజనపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను విభజించడం రెండు రాష్ట్రాల్లో రక్తపాతానికి దారితీసిందని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ విభజన సరిగా జరగలేదని, ఈ విభజన రెండు రాష్ట్రాలనూ సంతృప్తి కలిగించలేదని అన్నారు. తెలంగాణ ఏర్పాటు ఎంతో కష్టంతో ...11లో

ద్వేషం కాదు దేశం ముఖ్యం

- దేశమంటే రాష్ట్రాల సమాహారం: తెలంగాణపై ప్రధాని వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ద్వేషం కాదు...దేశం ముఖ్యం. దేశమంటే రాష్ట్రాల సమాహారమని మంత్రి కేటీఆర్ తెలిపారు. తెలంగాణపై ప్రధానమంత్రి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈ మేరకు మంగళవారం ట్వీట్ చేశారు. ఏ పార్లమెంటు సాక్షిగా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారో, అదే పార్లమెంటు ...11లో

ఏకీకృత సిద్ధాంతం దేశానికి ప్రమాదం

ఆదివాసీ గిరిజన హక్కులకు భంగం

- ఐక్య ఉద్యమాలతోనే వెనక్కి కొట్టగలం : ఆర్మ్ నాలుగో జాతీయ మహాసభలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఏకీకృత సిద్ధాంతాన్ని గిరిజనులపై బలవంతంగా రుద్దుతున్నదని కేరళ పరిశ్రమల శాఖ మంత్రి పి రాజీవ్ ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడులోని నమక్కల్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఆర్మ్) జాతీయ నాలుగో మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆర్మ్ జాతీయ చైర్మెన్, మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మిడియం బాబురావు సంఘం జెండాను ఆవిష్కరించారు. తమిళనాడులోని వివిధ గిరిజన ప్రాంతాలనుంచి తీసుకొచ్చిన అమరవీరుల జ్యోతిని బృందా కారత్, బాబురావు, జతిన్ చౌదరిలకు అందజేశారు. అనంతరం రాజీవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా తరతరాలుగా గిరిజనులు అనుసరిస్తున్న సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలు కనుమరగయ్యే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను కాలరాసే విధంగా నూతన చట్టాలను కేంద్రం తీసుకొస్తున్నదని విమర్శించారు. అడవులు, అటవీ సంపదను అంబానీ, ...11లో



మాట్లాడుతున్న కేరళ పరిశ్రమల శాఖ మంత్రి పి రాజీవ్ ...

నేటి నుంచి డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ

- జనరల్ కేటగిరీలోనూ పోటీ పడే అవకాశం
- సమర్పణకు తుదిగడువు అక్టోబర్ 20
- నవంబర్ 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో రాతపరీక్షలు
- జిల్లాలు, సబ్జెక్టులు, రోస్టర్ వారీగా పోస్టుల వివరాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో 2,598 పోస్టులు మహిళలకే కేటాయించబడ్డాయి. మిగిలిన 2,491 పోస్టులు జనరల్ కేటగిరీతో పాటు రిజర్వేషన్లకు అభ్యర్థులకు ఉన్నాయి. అయితే జనరల్ కేటగిరీలో ఉండే పోస్టులకు మహిళలు పోటీపడే అవకాశ మున్నది. 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లాస్థాయి నియామక కమిటీ (డీఎస్సీ) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ ఈనెల ఎనిమిదిన విడుదల చేసిన విషయం తెలిసిందే. జిల్లాలు, పోస్టులు, కేటగిరీలు, సబ్జెక్టు, మాధ్యమం, రోస్టర్ వారీగా పూర్తి వివరాలను విద్యాశాఖ మంగళవారం ప్రకటించింది. పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ డీఎస్సీ నోటిఫికేషన్‌ను గురువారం జారీ చేసింది.

1,739 స్కూల్ అసిస్టెంట్, 611 లాంగ్వేజ్ పండి తులు, 164 వ్యాయామ ఉపాధ్యాయులు (పీఈటీ), 2,575 సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) కలిపి మొత్తం 5,089 పోస్టులు న్నాయి. అత్యధికంగా హైదరాబాద్‌లో 358 పోస్టులు, అత్యల్పంగా పెద్దపల్లి జిల్లాలో 43 పోస్టులు భర్తీ అవుతున్నా యి. ఎస్జీటీ పోస్టులకు డీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులే అర్హులుగా ఉంటారని స్పష్టం చేసింది. బుధవారం నుంచి ఉపాధ్యాయ పోస్టుల కోసం దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. వాటి సమ ర్పణకు వచ్చేనెల 20 వరకు తుదిగడువు ఉన్నది. మొదటిసారిగా డీఎస్సీ రాతపరీక్ష లను నవంబర్ 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష (సీబీఆర్టీ) విధానంలో నిర్వహిస్తు న్నారు. అభ్యర్థుల గరిష్ట వయోపరిమితి 44 ఏండ్లు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేండ్లు సడలింపు ఉంటుంది.

ఉపాధ్యాయ పోస్టుల వివరాలు		
మాధ్యమం	కేటగిరీ	పోస్టులు
తెలుగు	ఎస్జీటీ	2,028
"	ఎస్ఏ	1,368
"	పీఈటీ	127
"	ఎల్పీ	319
ఉర్దూ	ఎస్జీటీ	448
"	ఎస్ఏ	138
"	పీఈటీ	32
"	ఎల్పీ	53
హిందీ	ఎస్జీటీ	8
"	ఎస్ఏ	135
"	పీఈటీ	233
"	ఎల్పీ	1
ఇంగ్లీష్	ఎస్జీటీ	40
"	ఎస్ఏ	92
"	పీఈటీ	3
"	ఎల్పీ	0
కన్నడ	ఎస్జీటీ	9
"	ఎస్ఏ	1
"	పీఈటీ	1
"	ఎల్పీ	1
మరాఠీ	ఎస్జీటీ	25
"	ఎస్ఏ	5
"	పీఈటీ	0
"	ఎల్పీ	5
బెంగాలీ	ఎస్జీటీ	16
"	ఎస్ఏ	0
"	పీఈటీ	0
"	ఎల్పీ	0
తమిళం	ఎస్జీటీ	1
"	ఎస్ఏ	0
"	పీఈటీ	0
"	ఎల్పీ	0
మొత్తం		5,089

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకూ అది వర్తిస్తుంది. వికలాంగులకు మాత్రం పదేండ్లు సడలింపు ఉంటుంది. అయితే మొదటిసారి బైలింగ్వల్ (రెండు భాషల్లో) ప్రశ్నాపత్రం అందుబాటులోకి తెస్తున్నారు. ఉదాహరణకు తెలుగు/ఇంగ్లీష్, హిందీ/ఇంగ్లీష్ ప్రశ్నాపత్రాలుంటాయి. 11 జిల్లా కేంద్రాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నల్లగొండ, సంగారెడ్డిలో పరీక్షలను నిర్వహిస్తారు. అయితే 160 ప్రశ్నలకు 2.30 గంట లపాటు డీఎస్సీ రాత పరీక్షలుంటాయి. వాటిని 80 మార్కులుగా పరిగణి స్తారు. టెట్‌లో వచ్చిన మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. ఆ రెండింటినీ కలిపి డీఎస్సీ మెరిట్ జాబితాను రూపొందిస్తారు. ఇతర వివరాలకు www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

2029 నుంచి మహిళా రిజర్వేషన్లు?

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వాలు కూడా లోక్‌సభలో ప్రవేశపెట్టినప్పటికీ ఆమోదానికి నోచుకోలేదు.

బిల్లులో ఏముంది....?

తాజా బిల్లు ప్రకారం లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో మూడవ వంతు సీట్లను మహిళలకు కేటాయిస్తారు. ఢిల్లీ అసెంబ్లీకి కూడా ఈ బిల్లు వర్తిస్తుంది. ఆరు పేజీల ఈ ప్రతిపాదిత బిల్లులో లోక్‌సభ, శాసనసభల్లో మహిళలకు మూడో వంతు సీట్లను రిజర్వు చేయాలని, ప్రత్యక్ష ఎన్నికల ద్వారా వీటిని భర్తీ చేయాలని పేర్కొన్నారు. రాజ్యసభకు, రాష్ట్రాల శాసనమండలికి ఈ కోటా వర్తించదని స్పష్టం చేశారు. ఈ కోటాలోనే ఎస్‌సి, ఎస్టీలకు మూడవ వంతు సీట్లను కేటాయించనున్నట్లు ప్రతిపాదించారు. నియోజకవర్గాల పునర్విభజన తరువాత రోటేషన్ ప్రకియలో రిజర్వుడ్ సీట్లను నిర్ణయిస్తారు. నియోజకవర్గాల పునర్‌విభజనకు జన గణన తప్పనిసరి. అయితే 2021లో జరగాల్సిన జనగణన కోవిడ్ కారణంగా వాయిదా పడింది. ఇది 2027లో జరుగుతుందని భావిస్తున్నారు. ఆ తరువాతే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది.

జనాభా లెక్కలు అందుబాటులోకి వచ్చిన ఏడాదిలో పునర్విభజన ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని పరిశీలకుల అభిప్రాయం. దీనిని పరిగణలోకి తీసుకుని 2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు అమలులోకి వస్తాయని భావిస్తు న్నారు. 2002లో ఆర్టికల్ 82కు చేసిన సవరణ ప్రకారం 2026 తరువాత జరిగే మొదటి జనగణన తరువాతే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ చేపట్టాల్సిఉంది. ఈ ప్రక్రియను మరింత త్వరగా పూర్తిచేయాలంటే ఆర్టికల్ 82ను మరొసారి సవరించాల్సిఉంటుంది. అయితే, పునర్విభజన ప్రక్రియ ను త్వరగా చేపట్టడాన్ని కొన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. మన్మో హన్ సింగ్ ప్రభుత్వంలో రూపొందించిన మహిళా బిల్లులో ఆంగ్లో ఇండియన్లకు కూడా కొన్ని సీట్లను కేటాయించగా, తాజా బిల్లులో వాటిని తొలగించారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, అజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	60,220	▲	140
క్యారెట్లు	55,200	▲	150
కిలో వెండి	78,300	▲	100



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 122
రిటైల్ (లైవ్)	రూ. 144
స్కిన్‌తో	రూ. 209
స్కిన్‌లెస్	రూ. 238

అంగన్‌వాడీలపై నిర్బంధాన్ని ఆపాలి

సమ్మెలో ఉన్న సంఘాలతో చర్చలు జరిపి పరిష్కరించాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలు
- ఈ నెల 26న ఇందిరాపార్కు వద్ద ధర్నా : అంగన్వాడీ జేఏసీ



నవతెలంగాణ -ముషీరాబాద్

సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని వెంటనే ఆపేయాలని కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. వారిని పర్మినెంట్ చేయాలనీ, అప్పటిదాకా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంపు, తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత, అంగన్‌వాడీ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యన్.కరుణకుమారి అధ్యక్షతన కార్మిక, ఉద్యోగ సంఘాల నేతృత్వంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ నెల 24న జిల్లా కేంద్రాల్లో కార్మిక, ఉద్యోగ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నట్టు, 26న ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపట్టనున్నట్టు ప్రకటించారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డీ.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.బి.విజయ్‌కుమార్ యాదవ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ఎల్.పద్మ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌కే బోస్, బీఈఎఫ్ఐ అధ్యక్షులు సతీస్, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు కృష్ణ, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ రాష్ట్ర నాయకులు ప్రేమ్‌పావని, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్‌వాడీలు ట్రేడ్ యూనియన్ చట్టం 1926 ప్రకారమే చట్టబద్ధంగా 14 రోజుల ముందు ప్రభుత్వానికి, సంబంధిత రాష్ట్ర అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చి పోరాడుతున్నారన్నారు. సమ్మెను పరిశీలించి పరిష్కారించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరించడం తగదని హెచ్చరించారు. అంగన్‌వాడీలను బెదిరిస్తూ కేంద్రాల తాళాలను పగులగొట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. అంగన్వాడీలు నిరవధిక సమ్మెలోకి వెళ్ళడానికి ప్రభుత్వమే కారణమని నొక్కి చెప్పారు. ఆగస్టు 18న ఐసిడిఎస్ మంత్రి సత్యవతి రాథోడ్ అంగన్వాడీ సంఘాలతో జాయింట్ సమావేశం నిర్వహించి కొన్ని అంశాలపైనే హామీలిచ్చారన్నారు. వాటికి భిన్నంగా, అతి తక్కువ రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని విమర్శించారు. అంగన్‌వాడీల నుంచి నిరసన తీవ్రంగా రావడంతో కొన్ని జీవోలు, ఉత్తర్వులు జారీ చేసి చేతులు దులుపుకున్నదన్నారు. సమ్మెలో లేని సంఘాలతో మాట్లాడి ఆహా..ఓహో.. అనిపించారన్నారు. అసలు సమ్మెలోనే లేని సంఘాలతో చర్చలు జరపడమేంటని నిలదీశారు. సమ్మెలో ఉన్న సంఘాలతో చర్చలు జరిపి సమస్యలను సామరస్యపూర్వంగా పరిష్కరించాలని కోరారు. అంగన్వాడీల పట్ల అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవావాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వినాయకునికి అంగన్‌వాడీల వినతి

- కొనసాగుతున్న సమ్మె
- తహసీల్దార్ కార్యాలయాల ఎదుట బైటాయింపు
- అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టిన అధికారులు



నల్లగొండలో...

నవతెలంగాణ- విలేకరులు

తమ సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలంటూ అంగన్‌వాడీ కేంద్రాల ఉద్యోగులు, ఆయాలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. మంగళవారం పలుచోట్ల వినాయకుడికి వినతిపత్రాలు ఇచ్చి నిరసన తెలిపారు. ఈ క్రమంలో కొన్నిచోట్ల అధికారులు బలవంతంగా కేంద్రాలు తాళాలు పగులగొట్టి కార్యదర్శులకు అప్పగించారు. దీన్ని సీఐటీయూ నాయకులు తీవ్రంగా ఖండించారు.

రంగారెడ్డి జిల్లా కందుకూర్‌లో ఆర్డీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున బైటాయించారు. ఆమనగల్‌లో సమ్మెకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మద్దతు తెలిపారు. షాద్‌నగర్‌లో అంగన్‌వాడీలకు ఆశావర్కర్లు మద్దతు తెలిపారు. చేవెళ్లలో ఆర్టీసీ కార్గో ద్వారా కేంద్రాలకు తరలిస్తున్న సామాగ్రిని అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడీ కార్మికులు ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

సమ్మె కారణంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసిన ఆహారం లబ్దిదారులకు అందకుండా పాడవుతుందన్న సాకుతో ఐసీడీఎస్ అధికారులు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని నర్ఖూడ గ్రామంలో కేంద్రాల తాళాలు పగలగొట్టి తెరిపించారు. శంషాబాద్‌కు చెందిన అంగన్‌వాడీలు కందుకూరు వెళ్లడంతో సెక్టార్ సూపర్‌వైజర్ సుగుణ, శంషాబాద్ సెక్టార్ సూపర్‌వైజర్ భిక్షమమ్మ నర్ఖూడ కేంద్రానికి వచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద నోటీసులు అంటించారు. గ్రామ సర్పంచ్ సునిగంటి సిద్దులు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసింహ సమక్షంలో అంగన్‌వాడీ కేంద్రం తాళాలను కటింగ్ మిషన్‌తో విరగ్గొట్టారు. కేంద్రంలో ఉన్న ఆహారం, ఇతర సామాగ్రిని లెక్కించారు. అనంతరం అంగన్‌వాడీ సెక్టార్-2, సెక్టార్-3లో పంచాయతీలో కార్యదర్శి సమక్షంలో తాళాలు పగలగొట్టారు. అధికారులు కేంద్రాలకు వేరే తాళాలు వేసి పంచాయతీ కార్యదర్శికి అప్పగించారు. లబ్దిదారులకు ఆహారం పంపిణీ చేయాలని సూపర్‌వైజర్ సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాళాలు పగలగొట్టి, సామాన్లు పంచాయతీ కార్యదర్శులకు అప్పగించామని సూపర్‌వైజర్ సుగుణ తెలిపారు. అధికారుల వైఖరిని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు నీరటి మల్లేశ్ ఖండించారు.

భద్రాచలంలో వినాయక విగ్రహానికి సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆళ్లపల్లిలో మూతికి గుడ్డ కట్టుకుని నిరసన తెలిపారు. పాల్వంచలో కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీలు పొర్లు దండాలు పెట్టారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట ఖాళీ ప్లేట్లు పట్టుకుని అంగన్‌వాడీలు బైటాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.స్వామి, ఐద్వా జిల్లా కోశాధికారి ఆర్.మంజుల, అంగన్‌వాడీ యూనియన్ సీఐటీయూ నాయకులు, మల్లికాంబ తదితరులు పాల్గొన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌక్ వద్ద భారీ మావహారంగా ఏర్పడ్డారు. దహెగాం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. రెబ్బెన మండలంలో ఒంటికాలుపై నిలబడి నిరసన తెలిపారు.

టాటా.. వీడుకోలు

(మొదటిపేజీ తరువాయి)

భారత రాజ్యాంగాన్ని తన చేతుల్లో పట్టుకుని కనిపించారు. పార్లమెంట్ నూతన భవనంలో మంగళవారం లోక్‌సభ మధ్యాహ్నం 1.15 గంటలకు ప్రారంభం కాగా.. రాజ్యసభ మధ్యాహ్నం 2.15 గంటలకు ప్రారంభం అయ్యాయి.

పాత పార్లమెంట్ భవనంలో 71 ఏండ్లు గా కీలక నిర్ణయాలు

పార్లమెంట్ పాత భవనంలోని సెంట్రల్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఉభయసభల సభ్యులనుద్దేశించి ప్రధాని మోడీ మాట్లాడారు. కొత్త పార్లమెంటు భవనంలో కొత్త భవిష్యత్తును ఈరోజు మనం ప్రారంభించనున్నామని,అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సాధించాలనే దృఢ సంకల్పంతో కొత్త భవంతిలోకి అడుగుపెడుతున్నామని అన్నారు. గత 71 సంవత్సరాల్లో పలు ప్రభుత్వాలు అనేక కీలక నిర్ణయాలను ఇక్కడే తీసుకున్నాయని ఆయన గుర్తుచేసుకున్నారు. పార్లమెంటు సభ్యులకు, దేశ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్లమెంటు సెంట్రల్ హాలులో 1952 నుంచి 41 మంది ప్రభుత్వాధినేతలు ప్రసంగించారని, 86 సార్లు రాష్ట్రపతుల ప్రసంగాలు జరిగాయని, సుమారు 4,000 చట్టాలు ఇక్కడే చేశారని మోడీ అన్నారు. ట్రిపుల్ తలాఖ్, ట్రాన్స్‌జెండర్స్ చట్టాలు ఈ పార్లమెంటులోనే ఆమోదం పొందాయన్నారు. 370వ అధికరణ రద్దు ఇక్కడే చోటుచేసుకుందని తెలిపారు.

ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపొందే లక్ష్యంతో భారత్ ముందుకు వెళ్తోందన్నారు. భారతదేశ అభివృద్ధి లక్ష్యంగా, ఆ లక్ష్య సాధన దిశగా దృఢ సంకల్పంతో కొత్త పార్లమెంటు భవనంలోకి వెళ్తున్నామని అన్నారు. ఇండియా నూతన శక్తితో, నూతన సంకల్పంతో కోట్లాది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేం దుకు సిద్ధంగా ఉందన్నారు. దేశ భవిష్యత్తు కోసం సకాలంలో సరైన నిర్ణయాలు మనం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. నాలెడ్జ్, ఇన్నొవేషన్‌లపై మన మంతా దృష్టిసారించాలని చెప్పారు. చంద్రయాన్-3 విజయం తర్వాత యువత శాస్త్ర, సాంకేతిక రంగాల పట్ల మరింత మక్కువతో ఉన్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని మనం జారవిడుచుకోరాదని ప్రధాని సూచించారు. సెప్టెంబర్ 19 దేశ చరిత్ర పుటల్లో చిరస్మరణీయమైన ఘట్టంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా ఆమోదానికి నోచుకోని మహిళ రిజర్వేషన్ బిల్లుకు సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలపాలని కోరారు. పార్లమెంట్ కార్యకలాపాలకు విఘాతం కలిగేలా ఆటంకాలను ఆయుధాలుగా మలచుకునే వ్యూహానికి ముగింపు పలికేందుకు ఇదే సరైన సమయమని రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్కర్ అన్నారు. అటువంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.

పార్లమెంట్ హౌస్ ఆఫ్ ఇండియా

అత్యాధునిక హంగులతో నిర్మించిన కొత్త భవనం ఇకపై పార్లమెంటుగా సేవలు అందిచనుంది. ఈ మేరకు కొత్తగా నిర్మించిన భవనాన్ని పార్లమెంట్ హౌస్ ఆఫ్ ఇండియాగా నోటిఫై చేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది.

రాలనున్న కమలం రేకులు..

(మొదటిపేజీ తరువాయి)


హాజరైనట్టు తెలిసింది. బీజేపీ అధిష్టానం, రాష్ట్ర నాయకత్వం గత కొంతకాలంగా తమ పట్ల అనుసరిస్తున్న తీరుపై వీరు గుర్రుగా ఉన్నారు. బీజేపీకి బీఆర్ఎస్ దగ్గరవుతుండటంతోపాటు పార్టీలో బండి, ఈటల, కిషన్‌రెడ్డికే ప్రాధాన్యతనిస్తూ... తమను పట్టించుకోవటం లేదని వారు తమ సన్నిహితుల వద్ద వాపోయారని తెలిసింది. ప్రతీ సందర్భంలోనూ, ప్రతీ కమిటీలోనూ ఆ ముగ్గురికే పెద్ద పీట వేస్తూ సీనియర్లమైన తమను గుర్తించటం లేదంటూ వారు అలకపాన్పు ఎక్కారు. ఇదే విషయమై గతంలో కూడా ఈ సీనియర్లు తమ నిరసన గళాలను విప్పారు. అధిష్టానంతో తాడో పేడో తేల్చుకోవాలని భావించినా... ఢిల్లీ పెద్దల జోక్యంతో అది అప్పటికి ఆగిపోయింది. కానీ ఇటీవల మారిన రాజకీయ పరిణామాలు, ముఖ్యంగా కాంగ్రెస్‌కు జోష్ పెరిగిందనే వాతావరణం ఏర్పడటంతో మళ్లీ ఈ సీనియర్లందరూ తమ భవిష్యత్ కార్యాచరణపై సమాలోచనలు జరిపినట్టు తెలిసింది. మరోవైపు ఈ ఎనిమిది మందిలో ఐదారుగురిని వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రకటించాలని బీజేపీ భావించింది. ప్రస్తుతం వారు రహస్యంగా భేటీ కావటం, కాంగ్రెస్ వైపు చూస్తున్నారనే సంకేతాలతో కమలంలో కలకలం రేగుతోంది. మొన్నటి కాంగ్రెస్ విజయభేరీ సభ నేపథ్యంలో...'సోనియాగాంధీని వ్యక్తిగతంగా నేను గౌరవిస్తా...' అంటూ విజయశాంతి ట్వీట్ చేయటం ఈ వార్తలకు మరింత బలం చేకూరుస్తున్నది.

దీంతోపాటు ఈటల అనుచరుడైన ఏనుగు రవీందర్‌రెడ్డి కూడా ఈ రహస్య భేటీలో పాల్గొనటంతో...ముమ్ముందు ఈటల కూడా హస్తం గూటికి చేరతారనే వార్తలు ఊపందుకుంటున్నాయి.

కాకతీయ మెడికల్ కాలేజీ ర్యాగింగ్ ఘటనలో..

ఏడుగురిపై బహిష్కరణ వేటు

- మూడు నెలలు అకాడమిక్ ఇయర్, ఏడాది హాస్టల్ సస్పెన్స్
- యాంటీ ర్యాగింగ్ కమిటీ నిర్ణయం



నవతెలంగాణ - మట్టెవాడ

ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం వైద్య విద్యార్థి మనోహర్‌పై ర్యాగింగ్ పేరుతో విచక్షణరహితంగా దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఏడుగురు సీనియర్ వైద్య విద్యార్థులపై సస్పెన్షన్ వేటు పడింది. కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దివ్వెల మోహన్దాస్ అధ్యక్షతన మంగళవారం సమావేశమైన యాంటీ ర్యాగింగ్ కమిటీ 4 గంటల పాటు సుదీర్ఘంగా చర్చించి ర్యాగింగ్‌కు పాల్పడిన సీనియర్ వైద్య విద్యార్థుల నుంచి వివరణ తీసుకొని సాక్షులను విచారించారు. ర్యాగింగ్ జరిగింది వాస్తవమేనని నిర్ధారించింది. కాగా, మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న మనోహర్ ఈనెల 14వ తేదీ రాత్రి కళాశాల లైబ్రరీలో చదువుకొని వెళ్తున్న క్రమంలో సీనియర్ వైద్య విద్యార్థులు పిలవగా రాకపోవడంతో ర్యాగింగ్ పేరుతో విచక్షణా రహితంగా అతనిపై దాడిచేశారు. గాయపడిన విద్యార్థి పోలీసులను ఆశ్రయించడంతో సీనియర్ వైద్య విద్యార్థులపై కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో నాలుగు రోజులపాటు విచారణ కొనసాగించిన కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ మంగళవారం సమావేశమై మనోహర్‌పై దాడిచేసిన సీనియర్ వైద్య విద్యార్థులు అభినవ్ మోర, సిలువేరు శ్రీహరి, శ్రీ చరణ్, సూర్య ప్రకాష్, సాయి కిరణ్, హరి కృష్ణ, కె.లోకేష్‌ను ఈ విద్యా సంవత్సరంలో మూడు నెలల పాటు బహిష్కరించడంతోపాటు ఏడాది పాటు హాస్టల్ నుంచి బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకున్నది. విద్యార్థులను బయపట్టే చర్యలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని తెలిపేందుకే ఇలాంటి నిర్ణయంతీసుకున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. సమావేశంలో డాక్టర్ రాజ్ కుమార్ రెడ్డి, యాదగిరి, వేణు గోపాల్, కిషన్, విజయ్ కుమార్, సుధాకర్, అనితా రెడ్డి, అనిఫ్ ఖాన్, సుజాత, రాజారామ్, దామోదర్ బాయ్, అపర్ణ, మధుసూదన్ రెడ్డితో పాటు సీనియర్, జూనియర్ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



నకిలీ డాక్యుమెంట్స్, స్టాంపులు

తయారీ ముఠా అరెస్ట్

- ప్రభుత్వ బ్యాంకులే లక్ష్యంగా మోసాలు
- కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి ప్రాంతాల్లో ఆఫీస్‌లు
- సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

నవతెలంగాణ-మియాపూర్

నకిలీ డాక్యుమెంట్స్, ప్రభుత్వ ఆఫీసర్ల స్టాంప్స్, ఇతర గ్రామపంచాయతీ లే అవుట్ కాపీలు తయారీ చేస్తున్న ముఠాను సైబరాబాద్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి, వీరి నుంచి పెద్ద మొత్తంలో డాక్యుమెంట్స్, స్టాంప్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ కమిషనరేట్‌లో సీపీ స్టీఫెన్ రవీంద్ర మీడియాకు వెల్లడించారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ పరిధిలో ఆరుగురు ఒక ముఠాగా ఏర్పడి ప్రభుత్వ అధికారుల స్టాంపులను, నకిలీ డాక్యుమెంట్లను తయారు చేస్తున్నారు. ప్రధానంగా జీహెచ్ఎంసీ ఇంటి పర్మిషన్, ట్రేడ్ లైసెన్స్, జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని విభాగాలకు సంబంధించిన నకిలీ డాక్యుమెంట్స్, గ్రామపంచాయతీ లే అవుట్ కాపీలు, హెచ్ఎండీఏ నాలా కన్వర్షన్ సర్టిఫికెట్లు, బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లతో పాటు నకిలీ హౌస్ హోల్డర్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నారు. వీటి ద్వారా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇతర ప్రభుత్వ జాతీయ బ్యాంకుల్లో లోన్లు తీసుకుంటున్నారు. హౌసింగ్ లోన్ తీసుకునే సమయంలో అధికారులు వెరిఫికేషన్‌ను నిర్లక్ష్యంగా చేయడం వల్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని సీపీ వెల్లడించారు. ఇలాంటి సంఘటనలు నిర్లక్ష్యంగా జరిగాయా లేదా ఉద్దేశపూర్వకంగా జరిగాయా? వీటి వెనుక ఎవరు ఉన్నారనే అంశంపై దర్యాప్తు వేగవంతం చేసి, త్వరలోనే వివరాలను వెల్లడిస్తామని తెలిపారు. నిందితుల నుంచి 687 నకిలీ రబ్బర్ స్టాంపులు, వివిధ డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన ఫేక్ సర్టిఫికెట్స్, 1180 డాక్యుమెంట్లు, 10 లాప్‌టాప్స్ సీపీయూలు, 8 మానిటర్స్, 2 ప్రింటర్స్, స్టాంప్ తయారు చేసే ఒక మిషన్, 57 మొబైల్ ఫోన్స్, టూవీలర్ స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 10 కోట్ల వరకు ఉంటుందని సీపీ వివరించారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బులిస్తే తీస్కోండి..

- ఓటు మాత్రం కారుకే వేయండి... : మంత్రి కేటీఆర్
- రజాకార్ సినిమాతో చిచ్చుకు బీజేపీ యత్నం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'కుంభకోణాలకు పాల్పడిన కాంగ్రెస్ నేతలు డబ్బులిస్తే తీస్కోండి..ఓటు మాత్రం కారు గుర్తుకే వేయండి...' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ ప్రజలకు సూచించారు. అక్రమ సంపాదనతో కాంగ్రెస్ నేతలు ఓటర్లను కొనాలనుకుంటున్నారని ఆయన విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ అధ్యక్షుడు కోనేరు చిన్న సత్యనారాయణ మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...కాంగ్రెస్ ఇచ్చిన అబద్ధపు హామీలను నమ్మొద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వం సెప్టెంబరు 17ను జాతీయ సమైక్యత దినోత్సవంగా నిర్వహించిందని గుర్తు చేశారు. అయితే కేంద్రంలోని బీజేపీకి ఇది నచ్చటం లేదని విమర్శించారు. తొమ్మిదన్నరేండ్లుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ భ్రమల నుంచి ప్రజలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నారని అన్నారు. రజాకార్ సినిమాతో ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీ అంటూ రకరకాల సినిమాల ద్వారా ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టటం ద్వారా బీజేపీ చిల్లర రాజకీయాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆరు హామీలూ మోసపూరితమే

బీఆర్ఎస్‌పై రాహుల్ ఆరోపణలు హాస్యాస్పదం : ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇచ్చిన హామీలను అమలు చేసిన చరిత్ర కాంగ్రెస్‌కు లేదనీ, ఆరు హామీలూ మోసపూరితమేని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తామని చెప్పి 2004లో టీఆర్ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేసిందని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వడానికి కాంగ్రెస్ చేసిన ఆలస్యమే వందలామంది చావులకు కారణమైనదని ఆరోపించారు. కేసీఆర్ నేతృత్వంలో పోరాటం ఉధృతం కావడంతో అనివార్యంగా కాంగ్రెస్ దిగివచ్చి తెలంగాణ ఇచ్చిందని తెలిపారు.

ఈకేవైసీ ఇక్కట్లు

కుటుంబమంతా ఒకేసారి వేలిముద్రలతో ఇబ్బందులు • సుదూర ప్రాంతాల్లో ఉంటున్న వారు రాక తప్పని స్థితి

- సాధ్యం కాకపోతే రేషన్‌కార్డుల్లో నుంచి వారి పేరు కట్
- ఈ నెలాఖరు గడువు.. దసరా వరకు పొడగించాలని విజ్ఞప్తులు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ సర్కారు రేషన్‌కార్డులపై తీసుకున్న నిర్ణయం లబ్ధిదారులను ఇక్కట్లకు గురిచేస్తోంది. అస్సలైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఈకేవైసీ (నో యువర్ కస్టమర్) ని పూర్తి చేసేందుకు సిద్ధమైంది. ఇది రేషన్‌కార్డుదారులను ఇబ్బందుల పాలుజేస్తోంది. బోగస్ రేషన్‌కార్డుల ఏరివేతతో పాటు రేషన్ సరుకుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం స్వాగతించాల్సిందేనైనా.. కుటుంబసభ్యులందరూ ఒకేసారి కేవైసీ పూర్తి చేయాలనడంతో ఇబ్బందికర స్థితి ఏర్పడింది. ఈనెలాఖరు లోగా కేవైసీ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులకు తెలంగాణ పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 11వ తేదీ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా సాంకేతిక కారణాలతో ఒకటి, రెండురోజులు వాయిదా పడింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఈ ప్రక్రియపై విమర్శలు వస్తున్నాయి. దసరా సెలవుల వరకు పొడగించాలని లబ్ధిదారులు విజ్ఞప్తులు చేస్తున్నారు.

పిల్లల చదువుకు ఆటంకం

మా పాప భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని గురుకులంలో చదువుతోంది. రేషన్‌కార్డుల్లో ఉన్నవారందరూ వేలిముద్ర వేయాల్సిందేనని డీలర్ చెబుతు న్నారు. కుటుంబసభ్యులందర్నీ రేషన్ దుకాణానికి రమ్మంటే పాపను తీసుకురావాల్సి వస్తుంది. పిల్లల చదువుకు ఆటంకం ఏర్పడుతుంది కాబట్టి ఇలాంటి పనులు దసరా సెలవుల్లో పెట్టుకుంటే బాగుంటుంది.

- బండి సుజాత, సింగరాయపాలెం, కొణిజర్ల

అందరూ దుకాణానికి వెళ్లాలంటే అయ్యేపనిలా లేదు..

రాష్ట్రంలో రేషన్‌కార్డున్న కుటుంబసభ్యుల్లో ఎవరు వెళ్లినా వేలిముద్ర వేసి రేషన్ తీసుకుంటున్నారు. కార్డుల్లో ఎంతమంది పేర్లుంటే అందరికీ సరుకులు ఇస్తున్నారు. కుటుం బసభ్యుల్లో ఎవరైనా చని పోయినా, పెండ్లిండ్లై వేరే చోటకు వెళ్లినా వారి పేర్లను రేషన్‌కార్డుల్లో నుంచి తొలగించడం లేదు. ఇంట్లో ఎవరో ఒకరు వెళ్లి వీరందరి పేర్ల మీద రేషన్ తీసు కుంటున్నారు. ఈ నేపథ్యంలో రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత కోసం ప్రభుత్వం కేవైసీ ప్రక్రియ చేపట్టింది. ఇంతవరకూ బాగానే ఉన్నా అందరూ రేషన్‌దుకాణానికి వెళ్లి వేలముద్రలు వేయాలనడంతో సుదూర ప్రాంతాల్లో ఉన్నవారు రావడం ఇబ్బందికరంగా మారింది. కాబట్టి దసరా సెలవుల సమయంలో ఈ ప్రక్రియ చేపడితే హాస్టల్స్, వివిధ ప్రాంతాల్లో ఉంటున్న విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఈకేవైసీ కాకపోతే రేషన్ కట్టే..!

కుటుంబ యజమానితో పాటు రేషన్‌కార్డులో పేరున్న వాళ్లందరూ సమీప రేషన్ దుకాణానికి వెళ్లి ముద్రలు ఇవ్వాల్సి ఉంటుంది. రేషన్‌డీలర్లు ఈ-పాస్ మిషన్‌లో వేలిముద్రలు తీసుకుంటారు. వేలిముద్ర వేసినప్పుడు వారి ఆధార్‌కార్డు నంబర్‌తో పాటు రేషన్‌కార్డు నంబర్ డిస్‌ప్లే అవుతుంది. ఆ తర్వాత గ్రీన్‌లైట్ వచ్చి కేవైసీ ప్రక్రియ పూర్తవుతుంది.

ఒకవేళ అప్పుడు రెడ్‌లైట్ వస్తే ఆధార్ నంబర్‌తో రేషన్‌కార్డు నంబర్ మ్యాచ్ కావడం లేదని కేవైసీ రిజెక్టవుతుంది. ఇలాంటి సందర్భాల్లో రేషన్‌కార్డు నుంచి సంబంధిత లబ్ధిదారు పేరును తొలగిస్తారు. రేషన్ సరుకులు ఒక యూనిట్ అంటే ఒకరికి కట్ చేస్తారు. కేవైసీ కోసం కుటుంబ సభ్యులందరూ ఒకేసారి రేషన్ దుకాణానికి వెళ్లి వేలిముద్రలు ఇవ్వాలనే నిబంధనతోనే అసలు సమస్య వచ్చిపడింది. ఏదైనా కారణంతో కుటుంబసభ్యుల్లో ఎవరైనా వెళ్లకపోతే.. ఫ్యామిలీ నుంచి వారు విడిపోయినట్టుగా భావించి వారి పేర్లను రేషన్‌కార్డు నుంచి తొలగిస్తారు.

కార్డుంటే వేలిముద్ర తప్పనిసరి..

రేషన్‌కార్డులో ఉన్న ప్రతి ఒక్కరూ కేవైసీకి కోసం సంబంధిత రేషన్ దుకాణాలకు వెళ్లి వేలిముద్ర ఇవ్వాల్సిందే. రేషన్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం ఈ ప్రక్రియ చేపట్టింది. ఈనెలాఖరు వరకు కేవైసీకి అవకాశం ఉంది.

- శ్రీలత, ఖమ్మం జిల్లా పౌరసరఫరాల అధికారి

అక్టోబర్ చివరి వరకు గడవు పొడగించాలి...

అక్టోబర్ చివరి వరకు రేషన్‌కార్డుల కేవైసీ గడువు పొడిగించాలి. అటుఇటుగానీ సమయంలో ఇలాంటి ప్రక్రియ చేపట్టడం వల్ల దూరప్రాంతంలో ఉన్న విద్యార్థులు, ఇతరులు ఇబ్బంది పడతారు. కొత్త రేషన్‌కార్డులు ఇవ్వక పదేండ్లవుతోంది. అనేక మందికి పెండ్లిండ్లయ్యాయి. పిల్లలు పుట్టారు. ఈ పేర్లేవీ రేషన్‌కార్డుల్లో నమోదు కాలేదు. కొత్త కార్డులు ఇవ్వకపోగా పాత కార్డుల రేషన్ కట్ చేసే ప్రయత్నం సరికాదు.

- నున్నా నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి

రేషన్‌కార్డుంటే ఒక్క రేషనే కాదు..

ఖమ్మం జిల్లాలో 4,11,206 రేషన్‌కార్డులున్నాయి. ఇంకా రెండు లక్ష మందికి పైగా రేషన్‌కార్డులందాల్సి ఉంది. ప్రస్తుత రేషన్‌కార్డుదారులకు 11,36,226 యూనిట్ల రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఒక్కొక్కరికీ (ఒక్కో యూనిట్) 6 కేజీల చొప్పున బియ్యం ఇస్తున్నారు. రేషన్‌కార్డు ద్వారా వచ్చే బియ్యం కన్నా కూడా ప్రభుత్వం వైపు నుంచి అనేక ప్రయోజనాలు లబ్ధిదారులు పొందుతున్నారు.

విద్యా, వైద్యం వంటి వాటిలో రాయితీలు లభిస్తున్నాయి. రేషన్ ఉపయోగించుకోవడం లేదనే పేరుతో వారి పేర్లను కార్డుల్లో నుంచి తొలగిస్తే పేద, మధ్యతరగతి ప్రజలు నష్టపోయే ప్రమాదం ఉందని పలువురు అంటున్నారు. కాబట్టి సెలవుల సమయంలో ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టాలని కోరుతున్నారు.



బీజేపీని గద్దెదించడమే ప్రధాన లక్ష్యం

- అక్టోబర్ 5న 'చలో ఢిల్లీ' విజయవంతం చేయాలి: ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

నవతెలంగాణ-భూపాలపల్లి

'బీజేపీని గద్దె దించండి - మహిళలను, దేశాన్నీ రక్షించండి' నినాదంతో అక్టోబరు 5వ తేదీన జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని శ్రామిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దేశంలో అతిపెద్ద మహిళా సంఘంగా ఉన్న ఐద్వా మహిళల సమాన హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏండ్లు దాటినా మహిళలపై హింస, లైంగిక దాడులు పెరుగుతూనే ఉన్నాయన్నారు. మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులపై దాడి జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా హక్కుల పరిరక్షణకు ఐద్వా పోరాడుతోందని తెలిపారు. కోటి సభ్యత్వంతో 26 రాష్ట్రాలకు విస్తరించిన ఐద్వా.. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల్లోకి చొచ్చుకుపోయి పని చేస్తోందన్నారు. 1981లో ఆవిర్భవించినప్పటి నుంచి స్త్రీల ఆహార, ఉపాధి, విద్య వైద్య హక్కుల కోసం పోరాడుతోందని తెలిపారు. 2014లో బీజేపీ అధికార పగ్గాలు చేపట్టాక మహిళల స్వేచ్ఛా స్వతంత్రాలపై, బతుకు దెరువుపై మునుపెన్నడూ లేని రీతిలో దాడులు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న రాజ్యాంగ హక్కులను కాలరాసేందుకు సైతం కేంద్రం తెగబడుతోందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలను తిప్పికొట్టే దిశగా రానున్న 2024 ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించటమే లక్ష్యంగా ఐద్వా పని చేస్తోందని స్పష్టంచేశారు. తెలంగాణలో మూడు లక్షల సభ్యత్వం కలిగిన ఐద్వా నిరంతరం స్త్రీల సమస్యలపై ఉద్యమిస్తోందన్నారు. అక్టోబరు 5న జరపబోయే ప్రదర్శనను జయప్రదం చేసేందుకు జిల్లాల్లో సెమినార్లు, పది రోజులపాటు జీపు జాతాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఢిల్లీ ప్రదర్శనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నలిగంటి రత్నమాల, భూపాలపల్లి జిల్లా కార్యదర్శి సంగం ప్రీతి, ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సొప్పదండి స్వర్ణలత, జిల్లా ఉపాధ్యక్షులు ముక్కెర శ్రీలత, జిల్లా కమిటీ సభ్యులు దాట్ల రజిత, ఉషారాణి, మంద కోమల, బందు సుజాత, మండల ఉపాధ్యక్షులు పులి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం సరుకుల పంపిణీ

- కొత్త గ్రామ సేవా సమితి అధ్యక్షుడు రవీందర్ రావు ఆధ్వర్యంలో...



వెల్దండ : వెల్దండ మండలం కొట్ర గ్రామ పంచాయతీ పరిధిలోని బుడ్డాన్‌పల్లిలో కుందేళ్ళ పర్వతాలు అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న కొట్ర గామ సేవా సమితి అధ్యక్షుడు పోనుగోటి రవీందర్‌రావు ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి 25 కేజీల సన్న బియ్యం, తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కొప్పు వెంకటయ్య కరుణాకర్ రెడ్డి, మల్లేష్, బాలరాజు, బాల్ చంద్రయ్య, నరసింహ, గ్రామస్తులు పాల్గొన్నారు.

11వ వేతన ఒప్పందాన్ని అడ్డుకుంటే సమ్మె తప్పదు

- దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమల్లో 72 గంటల సమ్మె
- సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



మాట్లాడుతున్న సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి

నవతెలంగాణ-గోదావరిఖని

అమలైన 11వ వేతన ఒప్పందాన్ని అడ్డుకుంటే దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమల్లో 72 గంటల సమ్మె తప్పదని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జీడీకే 11వ గనిలో మంగళవారం ఫిట్ సెక్రెటరీ అన్నం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల కక్షతోనే డీపీఈ నిబంధనలను రూపొందించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాని ఆధారంగానే అధికారుల సంఘం కోర్టుకు వెళ్లిందన్నారు. బొగ్గు గని కార్మికుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వేతన ఒప్పందంపై వెంటనే ఈ పార్లమెంట్ సమావేశాల్లో చర్చ జరిపి వేతనాల చిచ్చుకు కారణమైన డీపీఈ నిబంధనలను ఎత్తేయాలన్నారు. లేదంటే అక్టోబర్ 5, 6, 7, తేదీల్లో దేశవ్యాప్త సమ్మె చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రాలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వ కోల్‌బెల్ట్ ప్రజాప్రతినిధులు సొంతింటి కలపై కార్మిక సమస్యలపై శాసనసభలో మాట్లాడకుండా తమ గొప్పలు చెప్పుకున్నారని విమర్శించారు. కార్మికుల వేతనాలపై అధికారులు కోర్టుకు వెళ్లిన విషయంపై, కేంద్ర ప్రభుత్వం విదేశాల నుంచి బొగ్గు దిగుమతిని తప్పనిసరి చేసిన ఆదేశాలను వెనక్కి తీసుకునేలా పార్లమెంటులో లేవనెత్తాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోసం జరిగిన సమావేశంలో డైరెక్టర్ అన్ని యూనియన్లను సమానంగా గుర్తిస్తూ సర్క్యులర్ జారీ చేయకుండా కేవలం రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఆర్జీ-1 కార్యదర్శి మెండె శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి జేల్లా గజేంద్ర, ఉపాధ్యక్షుడు అసరీ మహేష్, ఆరేపల్లి రాజమౌళి, బొద్దుల రఘువరన్, అన్నం శ్రీనివాస్, బొగ్గరం శ్రీనివాసరావు, ఇప్పలపల్లి సతీష్ కుమార్, సీహెచ్ దేవేంద్ర, జె మల్లేష్, యం రామన్న, గాండ్ల రమేష్, జె.సత్యనారాయణరావు, మహేందర్, రవితేజ, కార్మికులు పాల్గొన్నారు.

చింతలపాలెంలో భూకంపం

నవతెలంగాణ-చింతలపాలెం

సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో మళ్లీ భూకంపం సంభవించింది. సోమవారం రాత్రి 9:50 నిమిషాలకు పది సెకండ్లు కంపించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.3గా నమోదైంది. దీంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడి ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. 2020 నుంచి ఈ ప్రాంతంలో అప్పుడప్పుడూ భూకంపాలు సంభవిస్తున్నాయి. అప్పట్లో ప్రతి రోజూ భూ ప్రకంపనలు వచ్చాయి. మండలంలోని ప్రజలు భూ ప్రకంపనలకు పులిచింతల ప్రాజెక్టు డ్యాం కారణమని భావిస్తున్నారు. ఆనాడు ప్రజలకు పలు సందేహాలు రావడంతో భూ భౌతిక పరిశోధన శాస్త్రవేత్తలు ఈ ప్రాంతంలో పర్యటించి పులిచింతల ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి నిల్వ వల్ల భూ అంతర్భాగంలో పొరలపై భారం పడి ఈ భూకంపాలు సంభవిస్తున్నాయని తేల్చారు. ఏడాదిన్నరపాటు సుమారు వెయ్యి సార్లు భూకంపాలు వచ్చినట్టుగా భూకంపం లేఖిని (సిస్మోగ్రాఫ్)పై నమోదయ్యాయి. కాగా పులిచింతల ప్రాజెక్టులో ప్రస్తుతం 30 టీఎంసీల (45.77) నీటి నిల్వ వుంది.



కాంగ్రెస్ మాటలు సంతకం లేని డెబిట్ చెక్కుల్లాంటివి

- ఆ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు నెలలకో సీఎం
- అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న కాంగ్రెస్
- పెద్ద శంకరంపేటలో డబుల్ బెడ్‌రూమ్‌లను ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ పెద్ద శంకరంపేట

'కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు సంతకం లేని డెబిట్ చెక్కులాంటివని, అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని, వారి మాటలను ఎవ్వరూ నమ్మే పరిస్థితిలో లేరని వైద్యారోగ్య ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం మెదక్ జిల్లా పెద్ద శంకరంపేటలో రూ.564 లక్షలతో నిర్మించిన 96 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ఆయన ప్రారంభించి లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి పేరు ఢిల్లీ నుంచి రావాల్సి వస్తుందని, అందుకే ఆరు నెలలకో సీఎం మారతారన్నారు. అలాగే, ఆరు నెలలకోసారి కర్ఫ్యూ, ఆరు గంటల కరెంటు మాత్రమే ఉంటుందని తెలిపారు. పరిశ్రమలకు వారంలో రెండు రోజులు పవర్ హాలిడే ఉంటుందన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉందని అక్కడ కేవలం రూ.600 పింఛన్ మాత్రమే ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నాయకుల మోసపూరిత మాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో చేయని అభివృద్ధి పనులను తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పాలనలో కాలిపోయిన మోటార్లు పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు ఉండేవన్నారు. కాళేశ్వరం నీటిని పెద్ద శంకరంపేట మండలంలోని ప్రతి రైతుకు ప్రతి ఎకరానికి అందిస్తామని హామీ ఇచ్చారు. సబ్ మార్కెట్ యార్డ్‌ను ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయం మేరకు నూతన పూర్తిస్థాయి మార్కెట్ యార్డుగా తొందరలో ప్రకటిస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో త్వరలో వస్తుందని, చాలా అద్భుతంగా ఉంటుందన్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో అన్ని కేసులు, కొట్లాటలే తప్ప అభివద్ధి ఏమాత్రం జరగలేదన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత నారాయణఖేడ్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, నియోజకవర్గంలో ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా మూడవసారి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజా విశ్వాసాన్ని కోల్పోయింది

- మతచిచ్చు రేపి లబ్ధి పొందాలని చూస్తోంది : డీకే అరుణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణ అన్నారు. ఆ పార్టీ దేశవ్యాప్తంగా మతచిచ్చు రేపి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నదని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ మారబోరనీ, కుంభకోణాలు చేయబోమనీ, తెలంగాణ చరిత్రను వక్రీకరించబోమనే మూడు కీలకమైన హామీలను ప్రజలకు ఇవ్వాలని కాంగ్రెస్‌పార్టీని డిమాండ్ చేశారు.

రజాకార్ సినిమాను నిషేధించాలి

సినిమాల్లో అవాస్తవాల చిత్రీకరణ

- మత విద్వేషాలకు బీజేపీ ఆజ్యం: విలేకరుల సమావేశంలో జూలకంటి



నవతెలంగాణ-మిర్యాలగూడ

బీజేపీ నాయకుల సారథ్యంలో విడుదల కాబోతున్న 'రజాకార్' సినిమాను నిషేధించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బీజేపీ నేతలు కులం, మతం రంగు పూస్తున్నారని విమర్శించారు. అది వర్గ పోరు మాత్రమేనని, పేదలు, భూస్వాముల మధ్య జరిగిన పోరాటమని తెలిపారు. పేదల పక్షాన అన్ని వర్గాల ప్రజలు వీరోచితంగా పోరాడి ప్రాణాలు పోగొట్టుకున్నారని గుర్తు చేశారు. దానిని మతాల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తూ ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. వాస్తవాలను పక్కనపెట్టి అవాస్తవాలతో చిత్రీకరించి ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల సమయంలో ఇలాంటి సినిమాలు విడుదల కావడం వల్ల ప్రజల్లో విభేదాలు వస్తాయని వెంటనే ఆ సినిమాను సెన్సార్ బోర్డు నిషేధించాలని డిమాండ్ చేశారు.

ఆనాటి పోరాటంలో ఆర్ఎస్ఎస్ నైజాం నవాబుకు అనుకూలంగా వ్యవహరించిందని, స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వాళ్లకు సహకరించిందని చెప్పారు. తెలంగాణలో ప్రజలందరూ సామరస్యంగా జీవిస్తున్నారని, ఇలాంటి ప్రజల మధ్య మత విద్వేషాలు సృష్టించి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. విభేదాలు సృష్టించే సినిమాలను సెన్సార్ బోర్డు నిషేధించాలని కోరారు.

పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టడం శుభపరిణామమని, సాకులు చూపి బిల్లు అమలు కాకుండా చూసినా, ఆటంకాలు సృష్టించినా ఊరుకోబోమన్నారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే మహిళా బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయింపులు లేకుండా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. రాష్ట్ర యూనిట్‌గా దామాషా పద్ధతిలో ఎన్నికలు జరిపి పార్టీలకు వచ్చిన ఓట్ల ఆధారంగా సీట్లను కేటాయించాలన్నారు. దీనివల్ల ఎన్నికల వ్యయం పూర్తిగా తగ్గిపోతుందన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మూడవత్ రవి నాయక్, జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ మల్లు గౌతంరెడ్డి రాగిరెడ్డి మంగారెడ్డి, నాయకులు కందుకూరి రమేష్, లక్ష్మీనారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీని వదలని ర్యాగింగ్ భూతం..

- విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం : కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్



నవతెలంగాణ - మట్టెవాడ

వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల (కేఎంసీ)లో ర్యాగింగ్ భూతం ఇప్పట్లో వదిలేలా లేదు. కాకతీయ మెడికల్ కళాశాల పేరు ప్రఖ్యాతులు ర్యాగింగ్ వల్ల అభాసుపాలవుతున్నా సీనియర్ వైద్య విద్యార్థుల్లో ఎలాంటి మార్పు రాకపోవడం శోచనీయం. ర్యాగింగ్ భూతం వల్ల ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన ప్రీతి సంఘటన పూర్తిగా మర్చిపోకముందే మూడు రోజుల కిందట మొదటి సంవత్సరం వైద్య విద్యార్థి ఆస్పత్రి పాలయ్యాడు. వికృత చేష్టలతో సీనియర్ వైద్య విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో విచక్షణ రహితంగా కొట్టడంతో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న రాజస్థాన్‌కు చెందిన మనోహర్ తీవ్ర గాయాలపాలై ఎంజీఎం ఆస్పత్రిలో చేరిన సంఘటన ఆలస్యంగా వెలుగు లోకొచ్చింది. దీన్ని బయటకి పొక్కకుండా కాకతీయ మెడికల్ కళాశాల ఉన్నతాధికారులు తీసుకున్న జాగ్రత్తలపై మెడికల్ కళాశాల విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 14వ తేదీన ఒక సీనియర్ విద్యార్థి పుట్టినరోజు వేడుకల్లో ఆడిపాడిన సీనియర్ విద్యార్థులు, ఆ సమయంలో కళాశాల లైబ్రరీలో అర్ధరాత్రి వరకు చదువుకుని వెళ్తున్న ఫస్ట్ ఇయర్ విద్యార్థి మనోహర్‌ను గమనించి వారి వద్దకు పిలిపించుకున్నారు. సీనియర్ల మాట వినాలని బెదిరిస్తూ మద్యం తాగించి, నృత్యాలు చేపించి వికృత చేష్టలు చేశారు.

అంతేకాకుండా ఫస్ట్ ఇయర్ విద్యార్థిపై 13 మంది విద్యార్థులు దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలైన విద్యార్థి ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్‌కు సమాచారాన్ని అందించి మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వరంగల్ ఎంజీఎంలో చికిత్స కోసం చేరాడు. ఈ విషయం శనివారం రాత్రి బయటికి పొక్కడంతో సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టింది. గేమ్స్‌లో జరిగిన ర్యాగింగ్‌పై రెండు రోజులుగా అంతర్గతంగా విచారణ చేసిన కమిటీకి ర్యాగింగ్ చేసిన మాట వాస్తవమే అనేది నిర్ధారణకు వచ్చినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. 13 మంది విద్యార్థులను సంవత్సరం పాటు సస్పెన్షన్‌కు సిఫారసు చేసినట్టు తెలుస్తున్నప్పటికీ అధికారికంగా మెడికల్ కళాశాల నుంచి సమాచారం వెలువడలేదు

చర్యలు తీసుకుంటాం

ర్యాగింగ్ జరిగింది వాస్తవమే. పిల్లల భవిష్యత్తుకు సంబంధించిన సున్నితమైన విషయం కాబట్టి అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాం. ర్యాగింగ్‌తో గాయాలపాలైన మనోహర్‌తో యాంటీ ర్యాగింగ్ కమిటీ శనివారం మాట్లాడి వివరాలు సేకరించింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. శనివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి హాస్టల్‌కు చేరుకున్నాడు. ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థులతో 19న(మంగళవారం) కమిటీ సమావేశం అవుతుంది. ర్యాగింగ్ చేసినట్టుగా నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకుంటాం.

- మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్

తెలంగాణపై మరోసారి విషం చిమ్మిన మోడీ

- ఎక్కడ రక్తం పారిందో చూపించాలి
- కేసీఆర్ పోరాట ఫలితంగానే రాష్ట్రం ఏర్పాటు : విలేకర్ల సమావేశంలో శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నవతెలంగాణ- నల్గొండ కలెక్టరేట్

'మోడీ మనసు నిండా విషం ఉంది. పార్లమెంట్ సాక్షిగా సోమవారం ప్రధాన మంత్రి మోడీ పచ్చి అబద్ధాలు మాట్లాడారు. తెలంగాణపై మరోసారి విషం చిమ్మారు' అని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావుతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎక్కడ రక్తం ఏరులై పారిందో ప్రధానమంత్రి చూపించాలని డిమాండ్ చేశారు. గుజరాత్‌లో రక్తపుటేరులు పారిన ఘటనలు ఇంకా మోడీ మరువనట్టు ఉందని, అవి గుర్తొచ్చి మాట్లాడుతున్నట్టు ఉందని ఎద్దేవా చేశారు. వాజ్‌పేయి హయాంలో జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను ఏర్పాటు చేసి తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఎందుకు ప్రకటించలేదో చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ చేసిన అన్యాయాలు, అక్రమాలు చాలా ఉన్నాయని, కేసీఆర్ అలుపెరుగని పోరాట ఫలితంగానే కేంద్రం దిగొచ్చి రాష్ట్రాన్ని ఇచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టేలా హామీలు ఇస్తున్నదని ఆరోపించారు. ఆ పార్టీ అనౌన్స్ చేసిన 6 గ్యారంటీ హామీలు ఉత్తివేనని, ఆచరణకు సాధ్యం కాని హామీలను కాంగ్రెస్ పార్టీ ప్రకటిస్తుందని విమర్శించారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మొద్దన్నారు. తెలంగాణ కోసం రాజీనామా చేయాలంటే పారిపోయిన వ్యక్తి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అని విమర్శించారు.



యెండల లక్ష్మీనారాయణ రాజీనామా చేస్తే కిషన్ రెడ్డి చేయలేదని గుర్తు చేశారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడం బీజేపీ పనని, ఆ పార్టీ పతనం ప్రారంభమైందని, అందుకే మహిళా రిజర్వేషన్ బిల్లు అంటూ హడావుడి చేస్తోందని విమర్శించారు.

చేసిన తప్పుని సరిదిద్దుకోకపోతే అది ఇంకా పెద్ద ఆపదను తెచ్చిపెడుతుంది - స్వామి వివేకానంద

సంపాదకీయం

ముందడుగు

మానవ జీవితంలో డిజిటల్ సాంకేతికత ప్రతి అంశానికీ విస్తరించింది. ప్రతి మూలనూ స్పృశిస్తోంది. మన దైనందిన జీవితానికి సాంకేతికత కీలకంగా మారింది. కంప్యూటర్లకు శక్తినిచ్చే ఆపరేటింగ్ సిస్టమ్ నుంచి... స్మార్ట్‌ఫోన్‌లలోని యాప్‌ల వరకూ- సాఫ్ట్‌వేర్ సాంకేతికతే మన దైనందిన చర్యలను నిర్వచిస్తోంది. ఏదైనా

'ఫ్రీ సాఫ్ట్‌వేర్ ప్రజాస్వామ్యం వైపు ఒక పెద్ద అడుగు. ఆర్థిక, సామాజిక నేపథ్యంతో సంబంధం లేకుండా ఎవరినైనా అనుమతిస్తుంది' అంటారు ఫ్రీసాఫ్ట్‌వేర్‌కి చెందిన పీటర్ బ్రౌన్. ఈ భావన సాధ్యమేనని కేరళ ఆచరణలో చూపింది. కేంద్రంతో సహా దేశంలోని అన్ని రాష్ట్రాలూ కేరళ నమూనాను ఆదర్శంగా తీసుకోవాలి. గుత్తాధిపత్య సాఫ్ట్‌వేర్ల ప్రభావం నుంచి బయటపడాలి.

సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ కానీ, యాప్ కానీ మన అవసరాలకనుగుణంగా పనిచేస్తోందంటే... అందుకు అవసరమైన సోర్స్‌కోడ్ ఆ సాఫ్ట్‌వేర్ బ్యాక్‌గ్రౌండ్‌లో ఉంటుంది. ఇది చాలామంది కంప్యూటర్ వినియోగదారులకు తెలియని, చూడని సాఫ్ట్‌వేర్ భాగం. ఒక ప్రోగ్రాం ఎలా పనిచేస్తుందో, ఎలా పనిచేయాలో నిర్దేశించగల కోడ్ ఇది. మానవ మేధస్సు సృష్టించిన అద్భుత పరిజ్ఞానం. ప్రొప్రయిటరీ సాఫ్ట్‌వేర్‌లో సోర్స్‌కోడ్‌పై గుత్తాధిపత్యం యజమానికే ఉంటుంది. సాఫ్ట్‌వేర్ ప్రపంచంపై దశాబ్దాలుగా కొందరి గుత్తాధిపత్యం కొనసాగుతూ వస్తోంది. డిజిటల్ సాంకేతికత మనిషి జీవితంలోకి చొచ్చుకొచ్చిన తర్వాత... ఈ గుత్తాధిపత్యం నుంచి బయటపడాలనే భావన మొలకెత్తింది. అలా మొలకెత్తిన అంకురమే ఫ్రీ సాఫ్ట్‌వేర్ భావన. 'శాస్త్రం నీ అస్త్రం/ మౌనం శ్మశానం/ అది కాదు జ్ఞానం/ పరీక్షించు సహేతుకంగా/ ప్రసంగించు సాధికారంగా/ సమిష్టి సూత్రం సరైన విధానం' అంటాడు మహాకవి శ్రీశ్రీ. ఫ్రీ సాఫ్ట్‌వేర్... సాంకేతిక పురోగతి, వినియోగదారు సాధికారత, సామాజిక సమానత్వానికి మూలస్తంభం.



డబ్బు ఖర్చు చేయకుండా ఉచితంగా లభ్యమయ్యే సాఫ్ట్‌వేర్ మాత్రమేకాక... స్వేచ్ఛ అనే భావన చుట్టూ తిరిగే తత్వశాస్త్రం. 'ఏదైనా ప్రయోజనం కోసం ప్రోగ్రామ్‌ను అమలు చేసే స్వేచ్ఛ, ఆ ప్రోగ్రామ్ ఎలా పనిచేస్తున్నదో అధ్యయనం చేసే స్వేచ్ఛ, మన అవసరాలకు తగినట్లుగా మార్చుకునే స్వేచ్ఛ, ఆ సాఫ్ట్‌వేర్‌ను ఎవరికైనా పునఃపంపిణీ చేయగల స్వేచ్ఛ' ఉండాలని ఫ్రీ సాఫ్ట్‌వేర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రిచర్డ్ స్టాల్‌మాన్ చెబుతారు. ఈ భావన సోర్స్ కోడ్‌ను వీక్షించడానికి, సవరించడానికి ఎవరినైనా అనుమతించడం ద్వారా, అప్పటివరకూ సాఫ్ట్‌వేర్‌పై ఉన్న యాజమాన్య హక్కు సమస్యకు సృజనాత్మక పరిష్కారాన్ని చూపడానికి అవసరమైన భూమికను ఫ్రీ సాఫ్ట్‌వేర్ సృష్టించింది. లైనక్స్ ఆపరేటింగ్ సిస్టమ్, వెబ్ సర్వర్లు, ఆండ్రాయిడ్ పరికరాలు, మొజిల్లా ఫైర్‌ఫాక్స్, జింప్, స్క్రైబస్ వంటి అనేక సాఫ్ట్‌వేర్లకు ఈ సాంకేతికతే ఆధారం. ఈ సాంకేతికత ఆధారంగానే కేరళ 'ఉచిత సాఫ్ట్‌వేర్‌లో ఛాంపియన్'గా నిలిచింది. అంతర్జాతీయ మోడల్‌గా 'స్కూల్‌వికీ' అనే పోర్టల్‌ను తీర్చిదిద్ది, ఇంటర్నెట్ కనెక్టివిటీలో దేశంలోనే ముందంజలో ఉందని యునెస్కోచే ప్రశంసలు పొందింది. కేరళ విద్యారంగంలో ఉచిత సాఫ్ట్‌వేర్ సాంకేతికతను అనుసంధానం చేయడం ద్వారా సాంప్రదాయ సాఫ్ట్‌వేర్ గుత్తాధిపత్యాన్ని బద్దలు కొట్టింది. 'ఫ్రీ సాఫ్ట్‌వేర్ ప్రజాస్వామ్యం వైపు ఒక పెద్ద అడుగు. ఆర్థిక, సామాజిక నేపథ్యంతో సంబంధం లేకుండా ఎవరినైనా అనుమతిస్తుంది' అంటారు ఫ్రీసాఫ్ట్‌వేర్‌కి చెందిన పీటర్ బ్రౌన్. ఈ భావన సాధ్యమేనని కేరళ ఆచరణలో చూపింది. కేంద్రంతో సహా దేశంలోని అన్ని రాష్ట్రాలూ కేరళ నమూనాను ఆదర్శంగా తీసుకోవాలి. గుత్తాధిపత్య సాఫ్ట్‌వేర్ల ప్రభావం నుంచి బయటపడాలి.

కంప్యూటింగ్ సంస్కృతి నుండి ఉత్పన్నమయ్యే అత్యంత విజయవంతమైన సామాజిక ఉద్యమాలలో ఫ్రీ సాఫ్ట్‌వేర్ ఒకటి. ఆధునిక సాంకేతికత, స్వేచ్ఛ, ఆవిష్కరణను సమర్థించేలా ఉచిత సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చెందింది. అది డిజిటల్ యుగంలో మనం పాటించే విలువలకు ప్రతీక. ప్రపంచవ్యాప్తంగా ప్రతిభావంతులైన, సేవాతత్పరులైన ఎందరో ప్రోగ్రామర్ల మేధస్సుతో నడపబడుతోంది. 'మెదడన్నది మనకున్నది/ అది సరిగా పనిజేస్తే/ విశ్వరహః పేటికా వి/ పాటన జరగక తప్పదు' అంటాడు శ్రీశ్రీ. ఒక్కమాటలో చెప్పాలంటే- వినియోగదార్లను చైతన్యం చేయడం, సాఫ్ట్‌వేర్‌పై కార్పొరేట్ల గుత్తాధిపత్యాన్ని బద్దలు కొట్టడంపై ఉచిత సాఫ్ట్‌వేర్ విజయం ఆధారపడి ఉంటుంది.

మూడు రోజుల నుండి ఇంట్లోని పాత సామాన్లలో ఏదో వెతుకుతున్నాడు రాములు. కాని అతను వెదుకుతున్నదేదో దొరకటం లేదు. అయినా వెదుకులాట ఆపలేదు. మూడురోజుల నుండి పెద్దగా పట్టించుకోని సీతకు ఈరోజు ప్రశ్నించక తప్పలేదు. ఎందుకంటే రాములు వెదుకులాట తర్వాత తనే సర్దుకోవాలి కదా!

"ఏందయ్యా మూడు రోజుల నుండి వెదుకుతున్నావు. ఇంతకూ ఏం కావాలి!" అడిగింది సీత.

సీత వంక సీరియస్‌గా మళ్ళీ వెదుకులాటలో మునిగిపోయాడు. దాంతో సీతకు చిరాకొచ్చింది.

"ఏం వెదుకుతున్నావో, ఏం కావాలో చెప్పవు. కాని ఇల్లంతా ఆగమాగం చేస్తున్నావు. ఇంక చాలు ఆపు! లేదా ఏం కావాలో చెప్పు! అన్నది కఠినంగా.

"కత్తి కోసం వెదుకుతున్నాను" అన్నాడు.

"కత్తి ఎందుకు? అన్నది ఆశ్చర్యంగా.

"తల నరకటానికి!" అన్నాడు కోపంగా

"తల నరకుతావా? ఎవరి తల? ఎందుకు నరుకుతావు!" మరింత ఆశ్చర్యంగా అడిగింది.

"ఆ ఉదయనిధిగాడి తల నరుకుతాను! వాడి తల నరికితే రూ.10కోట్లు ఇస్తానని స్వామి ఆదేశించాడు! స్వామిజీ ఆదేశం పాటించకపోతే పాపం తగులుతుంది!" అన్నాడు.

"ఉదయనిధి తల నరకటం ఎందుకు? అంత తప్పు ఆయనేం చేశాడు! అడిగింది.

"సనాతన ధర్మాన్ని రక్షించటం కోసం చంపుతాను! ధర్మాన్ని మనం రక్షిస్తే, ధర్మం మనం రక్షిస్తుంది!" అన్నాడు.

"తల నరికితే నీవు హంతకుడవై, ఉరితీయబడతావు! నిన్ను ధర్మం ఎట్లా రక్షిస్తుంది?" అడిగింది.

"ఇదుగో నన్ను తికమక పెట్టకు! సనాతన ధర్మ పరిరక్షణలో నేను ఒక సమిధను అవుతాను. కాని ఆగేది లేదు!" మా నాయన చెప్పులు తయారు చేసేటప్పుడు వాడిన కత్తి ఎక్కడుంది? దాని కోసమే వెదుకుతున్నా!" అన్నాడు.



సనాతన ధర్మం

"సడన్‌గా మీ నాయన కత్తి గుర్తుకు వచ్చిందేమిటి? ఇప్పుడు నీవు ఉద్యోగం చేస్తున్నావు కదా?" అడిగింది.

"నేను కష్టపడి చదువుకున్నాను. కనక ఉద్యోగం వచ్చింది. అయినా దానికి దీనికి లింకు పెడతావేమిటి?" అన్నాడు.

"ఎందుకంటే సనాతన ధర్మం ప్రకారం నీవు శూద్రుడవు. చదువుకునే హక్కు లేదు! ఊరికి దూరంగా ఉండాలి. మూతికి ముంతా, వీపుకి చీపురూ కట్టుకోవాలి! ఊర్లోని అయ్యవార్లకు, దొరలకు, గులాంగిరీ చేయాలి! అదంతా మానేసి చదువుకోవటమే కాక ఉద్యోగం కూడా చేస్తావా? ఇదంతా సనాతన ధర్మానికి విరుద్ధం కాదా? నీవుముందు నీ ధర్మాన్ని ఆచరించు! ఆ తర్వాత తల నరకటం ఆలోచించవచ్చు!" అన్నది.

నజర్

"మళ్ళీ నన్ను కన్ఫ్యూజ్ చేయకు! తల నరకాల్సిందే! ధర్మం పాటించాల్సిందే! అన్నాడు మొండిగా.

"నిజమే! స్వామిజీ అంటే సర్వసంగ పరిత్యాగి కదా! కామ, క్రోధ, మోహ, లోభ, మద, మంత్సర్యాలు, ఇహలోక సంగతులు అన్ని వదలిపెట్టాలి కదా!" అడిగింది.

"అవును! ఆ స్వామి సర్వసంగ పరిత్యాగి! అందుకే ఆయన షర్టు కూడా వేసుకోడు తెలుసా? అన్నాడు గర్వంగా.

"అవును షర్టు వేసుకోడు నిజమే! ఉదయనిధి ఫొటోను కత్తితో నరికేటంత క్రోధం ఉన్నది! ధర్మాన్ని రక్షించాలన్న మోహం ఉన్నది! ఎవరూ తల నరకకపోతే నేనే నరుకుతాను అన్నంత మదం ఉన్నది. సాటి మనుషుల పట్ల మత్సరం ఉన్నది. పదికోట్ల డబ్బు ఇవ్వగలిగే సంపద ఉన్నది. అన్ని త్యజిస్తేనే సన్యాసి అవుతాడు. కాని కాషాయ వస్త్రాలు కట్టుకుంటే సన్యాసి అవుతాడా? ఇంతకూ తల నరకమన్న స్వామి నిజంగా సన్యాసేనా లేక మాఫియా డానా? అడిగింది.

నిజంగానే కన్ఫూజ్ అయ్యాడు రాములు.

"ఏదేమైనా సనాతన ధర్మాన్ని తిట్టడం తప్పుకదా!" గొణిగాడు.

"నీవు అన్నది నిజమే! అంటరానితనాన్ని కుల వ్యవస్థను తిట్టాడు కాని మొత్తం ధర్మాన్ని తిట్టలేదే? పైగా కుల వివక్షను రూపుమాపితే రూ.20కోట్లు ఎదురు ఇస్తానన్నాడు కదా! దాని మీద ఎవరూ మాట్లాడటం లేదెందుకు?" అడిగింది.

రాములు కూడా మాట్లాడలేదు.

"నీవు కూడా మాట్లాడటం లేదు. అంటే అంటరానితనాన్ని, కుల వ్యవస్థను సమర్థిస్తున్నావన్న మాట! సనాతన ధర్మమంటే అనాదిగా ఉన్న ధర్మం అనీ, దాన్ని మార్చరాదని చెబుతున్నాడు కదా!" అన్నది.

అవునన్నట్లు తలూపాడు రాములు.

"మరి కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు వాడమని, ఉపగ్రహాలు పంపించమని, వాహనాల్లో, విమానాల్లో ప్రయాణం చేయమని సనాతన ధర్మంలో ఉన్నదా?" అడిగింది.

"అవన్ని కాలానుగుణంగా వచ్చిన మార్పులు! అభివృద్ధి! ధర్మం అభివృద్ధిని వ్యతిరేకించదు!" అన్నాడు.

"మరి కుల వివక్ష తప్పని, కుల వ్యవస్థను రద్దు చేసుకుందామని, చతుర్వర్ణ వ్యవస్థకు కాలం చెల్లిందని, సనాతన ధర్మపరిరక్షకులు ఎందుకు ప్రకటించలేదు! అంటే కాలానానుగుణంగా వచ్చే అభివృద్ధి కావాలి గాని, సాటి మనిషిని హీనంగా చూడటం తప్పు అనే మార్పు ధర్మంలో కాలానుగుణంగా ఎందుకు రాకూడదు?" అడిగింది.

రాములు అయోమయంలోనే ఉన్నాడు.

సనాతన ధర్మాన్ని వల్లెవేసే వారెవరూ ఈ విషయాలు మాట్లాడరు! కాని తల నరకమని ఆదేశాలు ఇస్తారు! అదే చాతువర్ణ వ్యవస్థలో దోపిడీకి గురి అవుతున్న నీలాంటివారే కత్తులు పట్టుకుని బయలుదేరుతారు! ఇంకెన్నాళ్ళీ బానిస బతుకులు? ఒకరు ఆదేశిస్తే, అమలు చేయటానికి వెనకా ముందు ఆలోచించరా? విచక్షణ లేదా?" అడిగింది.

రాములు తలదించుకున్నాడు.

"తలదించుకోవటం కాదు! తలెత్తి ప్రశ్నించండి? ఎన్నాళ్ళీ బానిసత్వం! ఎంతకాలమీ వివక్ష? నరకటానికి కావాలంటే కత్తి ఇస్తాను! కాని దానితో తలలు నరకొద్దు! అంటరానితనాన్ని, కులవివక్షను, మనిషిని మనిషే దోచుకునే ఈ చాతువర్ణ వ్యవస్థనే తెగనరకండి!" అంటూ కత్తి తెచ్చి పడేసింది సీత.

- ఉషాకిరణ్

జి-20 ఢిల్లీ ప్రకటన, ప్రస్తావించని అంశాలు



ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఒక తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో జి-20 దేశాల ఢిల్లీ సమావేశం జరిగింది. సంపన్న పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక వ్యవస్థల వృద్ధి రేటు 2022లో 2.7శాతం ఉన్నది కాస్తా 2023లో 1.3శాతానికి పడిపోవచ్చునని ఐఎంఎఫ్ అంచనాలు చెపుతున్నాయి. ఐఎంఎఫ్ వేసిన మరొక ప్రత్యామ్నాయ అంచనా ప్రకారం వృద్ధి రేటు 1శాతం కన్నా తక్కువగానే ఉండవచ్చు. ఇదే కాలంలో కార్మిక ఉత్పాదకతలో పెరుగుదల రేటు ఇంతకన్నా ఎక్కువగానే ఉంటుంది. అందువలన సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో నిరుద్యోగం పెరుగుదల గణనీయంగా ఉండబోతోంది (వృద్ధిరేటు తగ్గడం అంటే ఉత్పత్తిలో వృద్ధిరేటు తగ్గడం. అదే సమయంలో ఉత్పాదకత రేటు అంతకన్నా ఎక్కువగా వృద్ధి చెందితే అంతకు మునుపు అవసరమైనంతమంది కార్మికులు ఇప్పుడు అవసరం ఉండరు. అందువలన నిరుద్యోగం పెరుగుతుంది). యూరోపియన్ యూనియన్ దేశాలలోకి తూర్పు యూరప్ దేశాల నుండి వలసలు భారీగా కొనసాగుతూనే ఉన్నాయి. అదనంగా ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఉక్రెయిన్ నుండి కూడా వలసలు సాగుతున్నాయి. వీటి ఫలితంగా ఇయు దేశాలలో నిరుద్యోగం ఇంకా ఎక్కువగా పెరగనుంది.

ఈ నిరుద్యోగం పెరిగేకొద్దీ శరణార్థులకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టే ధోరణులు ఇప్పటికే అక్కడ బలపడుతున్న ఫాసిజాన్ని ఇంకా బలపరుస్తాయి. "ఆల్టర్నేటివ్ ఫర్ డేయిష్ ల్యాండ్" (ఎఎఫ్‌డి) అనే నయా నాజీ పార్టీ జర్మనీలో 20శాతం ఓట్లను సాధించేందుకు చేరువలో ఉంది. అదే జరిగితే అప్పుడు అక్కడ అధికారాన్ని పంచుకోడానికి ఇతర పార్టీలతో ఒప్పందాలు చేసుకునే అవకాశం ఉంటుంది. అ పరిస్థితి కనీసం అక్కడ రాష్ట్రాల ప్రభుత్వాల ఏర్పాటులో వ్యక్తం అవుతుంది. ఇంతవరకూ ఆ పార్టీని దూరంగా ఉంచిన తక్కిన పార్టీలు కూడా ఇప్పుడు ఎఎఫ్‌డితో ఒప్పందాలకు రాక తప్పదు. ఇక ఫ్రాన్స్‌లో ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ కన్నా ఫాసిస్టు నేత లి పెన్ కే ఎక్కువమంది ఓటర్లు మొగ్గు చూపుతున్నట్టు నివేదికలు వస్తున్నాయి. స్పెయిన్‌లోనూ అటువంటి పరిస్థితే ఉంది. ఎటొచ్చీ ఇటీవలి ఎన్నికలు స్పష్టమైన తీర్పు ఇవ్వనందున అక్కడ తాత్కాలికంగా ఫాసిస్టు ముప్పు నుండి ఊరట లభించింది. పెరిగే నిరుద్యోగం ఈ దేశాలన్నింట్లోనూ ఫాసిస్టు శక్తుల పెరుగుదలకు ఊతం ఇస్తుంది.

సంపన్న పెట్టుబడిదారీ దేశాలు కనీవినీ ఎరుగని రీతిలో ఎదుర్కొంటున్న సంక్షోభపు ప్రకంపనలు మూడవ ప్రపంచ దేశాలలోనూ ప్రభావాన్ని చూపిస్తాయి. జీడీపీ వృద్ధిరేటు తగ్గిపోవడం, నిరుద్యోగం పెరిగిపోవడం, రుణ సంక్షోభం తీవ్రం కావడం. ఫాసిస్టు ధోరణులు బలపడటం తదితర రూపాలలో ఆ ప్రభావం ఉంటుంది. అన్ని రకాల సంక్షేమ పథకాలనూ రద్దు చేస్తానని ప్రకటించిన వ్యక్తి ఇప్పుడు అర్జెంటీనాలో జరగనున్న ఎన్నికల్లో దేశాధ్యక్షుడిగా గెలుపొందే పరిస్థితులు ఉన్నాయి. ఇంతవరకూ ఆ దిశగా అడుగులు వేయని దేశాలలో కూడా అటువైపే అడుగులు పడే ప్రమాదం ఉంది.

ఇటువంటి నేపథ్యంలో జరిగిన జి-20 దేశాల సమావేశంలో ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించే చర్యల గురించి చర్చ జరుగుతుంది అని ఎవరైనా ఆశిస్తారు. గతంలో అమెరికాలో హౌసింగ్ బుడగ పేలిపోయి ఆర్థిక సంక్షోభం తలెత్తినప్పుడు నిర్వహించిన జి-20 సమావేశంలో ఆ విధంగానే చర్చించారు. ఇప్పుడూ అటువంటి చర్చ జరుగుతుందని ఆశించడం సహజం. జి-20 దేశాలకు తాను నాయకత్వం వహించడం వలన మూడో ప్రపంచదేశాలకు ఎంతో ప్రయోజనకారిగా జి-20 వేదిక ఉంటుందని భారత ప్రభుత్వం చెప్పుకుంటోంది.



ప్రభాత్ పట్నాయక్

అందుచేత ఆ మూడో ప్రపంచ దేశాల రుణ సమస్య ఈ సమావేశాలలో చర్చకు వస్తుందని ఎవరైనా భావిస్తారు. నిజానికి కొందరు భారత ప్రభుత్వ అధికార ప్రతినిధులు ఆ అంశం ఎజెండాలో ఉంటుందని సూచించారు కూడా.

కాని ఢిల్లీ సమావేశాలలో అటువంటి చర్చ జరగనేలేదు. జి-20 ఢిల్లీ శిఖరాగ్ర సమావేశం ప్రస్తుతం చాలా తీవ్రంగా ఉన్న ఆర్థికాంశాలగురించి ఏమీ ప్రస్తావించ లేదు. భద్రతా సమస్యలకన్నా ఆర్థికాంశాలపైనే జి-20 ఎక్కువగా దృష్టి సారించడం మంచిదని చైనా, రష్యా దేశాల ప్రతినిధులు ముందునుంచీ చెపుతూనేవున్నారు. ఇంతకు ముందు ఇండోనేసియాలోని బాలిలో జరిగిన జి-20 సమావేశ ప్రకటనలో ఉక్రెయిన్ యుద్ధానికి కారణం రష్యాయేనంటూ బాహాటంగానే విమర్శించారు. ఢిల్లీ ప్రకటనలో ఆ విధంగా రష్యాను నిందించే విధంగా ఏమీ లేదు. అక్కడ తక్షణమే శాంతి స్థాపన జరగాలన్న వాంఛను మాత్రం వ్యక్తం చేశారు. ఇదే జి-20 వైఖరిలో కనిపించిన స్వల్పమైన మార్పు. అయితే అటువంటి ప్రకటనల వలన కలిగే ప్రభావం ఏమీ ఉండదు.

ఉక్రెయిన్‌ను అడ్డం పెట్టుకుని రష్యామీద పరోక్షయుద్ధాన్ని సాగిస్తున్న నాటో కూటమిదేశాలు అక్కడ శాంతిని స్థాపించే దిశగా ఎటువంటి ప్రయత్నాలూ ముందుకు సాగకుండా అడ్డు పడుతూనే ఉన్నారు. గతంలో ఉక్రెయిన్, రష్యా దేశాల నడుమ మిన్స్క్‌లో కుదిరి ఒప్పందాన్ని చెడగొట్టినది అమెరికా, బ్రిటన్ దేశాలే. రష్యా సైనిక చర్యలు ప్రారంభించిన అనంతరం శాంతి స్థాపన కోసం మొదలైన సంప్రదింపులను చెడగొట్టినదీ ఆ దేశాలే. ఇప్పుడు కూడా యుద్ధంలో కొనసాగాలని ఉక్రెయిన్‌పై ఒత్తిడి తెస్తున్నది ఆ దేశాలే. నాటో కూటమి ఎంతకాలంపాటు ఈ యుద్ధం కొనసాగాలని కోరుకుంటోందో అంతకాలమూ ఆ యుద్ధం సాగుతూనేవుంటుంది. నాటో సభ్యదేశాలు ఢిల్లీ ప్రకటనలో ఉపయోగించిన పదజాలం తమకు అంత అనుకూలం కాకపోయినా, దానితో ఏకీభవించివుండొచ్చు. కాని యుద్ధాన్ని ముగించే విషయంలో నాటో నిర్ణయాన్ని జి-20 దేశాల ప్రకటన ఏ విధంగానూ ప్రభావితం చేయలేదు.

ఢిల్లీ ప్రకటన ఆర్థికాంశాల గురించి అసలు ఏమీ ప్రస్తావించనేలేదా అంటే ప్రస్తావనలైతే ఉన్నాయి. కాని అవి చాలా పైపైన మాత్రమే ఉన్నాయి. ఒక్క నిర్దిష్ట ప్రతిపాదన కూడా అందులో లేదు. పేద దేశాలకు రుణసహాయం అందించే విషయాన్ని చర్చించేందుకు ఒక అంతర్జాతీయ సమావేశాన్ని నిర్వహించాలన్న సూచన కూడా అందులో లేదు. పోనీ నిలకడైన వృద్ధి సాధించేవిషయంలోనైనా ఒకటైనా సూచన వచ్చిందా అంటే అదీ లేదు. ప్రకటనలో అటువంటివి ఎలా చోటు చేసుకుంటాయని కొందరు ప్రశ్నించవచ్చు. కాని, కనీసం చర్చైనా జరిగిన దాఖలాలు ఉన్నాయా అంటే అదేమీ లేదు.

ఇలా ఎందుకు జరిగింది అని ఆశ్చర్యపడవలసిదేమీ లేదు. సదస్సుకు ఆతిధ్యం ఇస్తున్న మనదేశ ప్రభుత్వం దానినుండి గరిష్టంగా ప్రచార లబ్ధి పొందాలని మాత్రమే చూసింది. ఆ విధంగానే ప్రచారం చేసుకోగలిగింది కూడా. ఇక ప్రస్తుత సంక్షోభానికి ప్రధానంగా బలవుతున్నదీ, ఐఎంఎఫ్ రుద్దిన "పొదుపు చర్యల" కింద నలిగిపోతున్నదీ పేద దేశాలు. వాటికి ఈ సమావేశంలో ప్రాతినిధ్యమే లేదు. ఇక అభివృద్ధి చెందిన దేశాలైతే అసలు సంక్షోభం ఎక్కడుందని అంటూ దబాయిస్తున్నాయి (మరోపక్క ఆ దేశాలలో ప్రభుత్వానుకూల ఆర్థిక వేత్తలు మాత్రం సంక్షోభం ఉందని అంగీకరిస్తున్నారు). అందుచేత జి-20 సమావేశాల్లో ఆయా దేశాలు తమ తమ కారణాల రీత్యా పాల్గొన్నాయే తప్ప ప్రపంచాన్ని ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం గురించి అవి పెద్దగా పట్టించుకోలేదు.

ఇప్పుడు ఒక ప్రశ్న తలెత్తుతుంది. ఈ సంపన్న పెట్టుబడిదారీ దేశాలు ప్రస్తుత ఆర్థిక సంక్షోభం గురించి పట్టనట్టు ఎలా ఉండగలుగుతున్నాయి? గతంలో పెట్టుబడిదారీ ప్రభుత్వాలకు నిరుద్యోగ సమస్య పట్ల చాలా ఆందోళన ఉండేది. పెట్టుబడిదారీ వ్యవస్థను రక్షించేందుకు కంకణం కట్టుకున్న ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కీన్స్ "పెట్టుబడిదారులలో ఉండే వ్యక్తిగతపోకడల ఫలితంగా తలెత్తే నిరుద్యోగాన్ని ఈ ప్రపంచం సహిస్తూ ఉండడం ఇంకెంతమాత్రమూ సాధ్యం కాదు" అని ప్రకటించాడు. ఆ కాలంలో నిరుద్యోగం ఆర్థిక మాంద్యం పర్యవసానంగా ఉండేది. ఆర్థిక మాంద్యంలో పెట్టుబడిదారుల లాభాలు కూడా పడిపోతాయి. ఇటు పెట్టుబడిదారులు, అటు కార్మికులు, ఇరుపక్షాలూ సంక్షోభం వలన నష్టపోయే పరిస్థితి ఉండేది. కాని ప్రస్తుత పెట్టుబడిదారీ సమాజంలో ఆవిధంగా లేదు. ఉత్పత్తిని పెంచడం ద్వారా మాత్రమే లాభాలను పెంచుకోగలం అనే పరిస్థితి ఇప్పుడు లేదు. ద్రవ్య పెట్టుబడి లావాదేవీల ద్వారా లాభాలలో గణనీయమైన భాగం సమకూరుతోంది. అందుచేత సంక్షోభ కాలంలో కూడా పెట్టుబడిదారుల లాభాలు బాగా పెరుగుతూనే ఉన్నాయి. ఈ ద్రవ్య పెట్టుబడి లావాదేవీలలో ఏ విధమైన అదనపు విలువా ఉత్పత్తి కాదు. అందుచేత ద్రవ్య పెట్టుబడి వనరులను చేజిక్కించుకోడం మీద దృష్టి పెడుతుంది. అందుచేత ఒకపక్కన ఉత్పత్తిలో పెరుగుదల లేకపోయినా, ప్రభుత్వరంగ ఆస్తులపైన, చిన్న పెట్టుబడి దారుల ఆస్తులపైన, సహజ వనరులపైన దృష్టి పెట్టి వాటిని తమ ఆధీనంలోకి తెచ్చుకోవడం మీద బడా కార్పొరేట్లు

ఆ కాలంలో నిరుద్యోగం ఆర్థిక మాంద్యం పర్యవసానంగా ఉండేది. ఆర్థిక మాంద్యంలో పెట్టుబడిదారుల లాభాలు కూడా పడిపోతాయి. ఇటు పెట్టుబడిదారులు, అటు కార్మికులు, ఇరుపక్షాలూ సంక్షోభం వలన నష్టపోయే పరిస్థితి ఉండేది. కాని ప్రస్తుత పెట్టుబడిదారీ సమాజంలో ఆవిధంగా లేదు. ఉత్పత్తిని పెంచడం ద్వారా మాత్రమే లాభాలను పెంచుకోగలం అనే పరిస్థితి ఇప్పుడు లేదు. ద్రవ్య పెట్టుబడి లావాదేవీల ద్వారా లాభాలలో గణనీయమైన భాగం సమకూరుతోంది. అందుచేత సంక్షోభ కాలంలో కూడా పెట్టుబడిదారుల లాభాలు బాగా పెరుగుతూనే ఉన్నాయి.

కేంద్రీకరిస్తారు. అంటే, అదనపు విలువను చేజిక్కించుకోడంతోబాటు నేరుగా ఆస్తులను కూడా స్వాధీనం చేసుకోడానికి సిద్ధపడతారు. ఇంతవరకూ సరుకులుగా పరిగణింపబడని వాటిని కూడా సరుకులుగా మార్చివేస్తారు (పెట్టుబడి కేంద్రీకరణ అనేది కొల్లగొట్టి పోగేసుకోవడం ద్వారా జరుగుతుంది). అందుచేత ఆర్థిక మాంద్యం అనేది ప్రస్తుత పెట్టుబడిదారీ సమాజంలో ఆధిపత్యస్థాయిలో ఉన్న కార్పొరేట్ల ప్రయోజనాలకు అంతగా ఆటంకంగా పరిగణించబడదు.

కాని పెద్ద స్థాయిలో పెరిగిపోయే నిరుద్యోగానికి, పేదరికానికి కారణమయ్యే ఈ విధానాల వలన సంభవించే సామాజిక అస్థిరత్వం మాటేమిటి? నిరుద్యోగం గురించి, దానిని అదుపు చేయడంలో పెట్టుబడిదారీ వర్గం తీసుకోవలసిన బాధ్యత గురించి ఆనాడు కీన్స్ చెప్పిన సందర్భానికి, నేడు పెట్టుబడిదారీ వర్గం నిరుద్యోగం పట్ల నిర్లిప్తంగా ఉంటున్న సందర్భానికి మధ్య తేడాను మనం చూడాలి. బోల్షివిక్ విప్లవం విజయవంతం కావడం, సోషలిజం అనేది సమీప కాలంలోనే వచ్చే అవకాశాలు కనిపిస్తూండటం కీన్స్ సిద్ధాంతాన్ని బలంగా ప్రభావితం చేశాయి. ఆ కాలంలో నిరుద్యోగాన్ని పరిష్కరించే చర్యలు వెంటనే గనుక చేపట్టకపోతే కార్మికవర్గానికి పెట్టుబడిదారీ వ్యవస్థ పట్ల విముఖత బాగా పెరిగి వ్యవస్థనే మార్చే దిశగా కార్యాచరణకు వారు సిద్ధపడే అవకాశం ఉంది. కాని ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదు. ఉనికిలో ఉన్న సోషలిజం దెబ్బతినడంతో సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు సోషలిజం వచ్చేస్తుందేమో అన్న భయం ఏమాత్రమూ లేదు. ఆ దేశాల ఆధిపత్యాన్ని కొనసాగించే విషయంలో అవి కొన్ని సవాళ్ళను ఎదుర్కొంటున్నమాట వాస్తవమే. కాని ఆ సవాళ్ళు పెట్టుబడిదారీ వ్యవస్థనే సైద్ధాంతికంగా సవాలు చేసే స్థాయిలో లేవు. కీన్స్ కాలంలో అటువంటి సైద్ధాంతిక సవాలు కూడా ఉంది. ఇప్పుడు కార్మికవర్గం నుంచి ఎదురయ్యే ఎటువంటి సవాలునైనా ఫాసిస్టు శక్తుల సహాయంతో దెబ్బ తీయవచ్చునని అవి భావిస్తున్నాయి.

అయితే అవన్నీ పిచ్చి భ్రమలే. ప్రస్తుతం సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో భారీ స్థాయిలో కార్మికవర్గ పోరాటాలు చెలరేగుతున్నాయి. బోల్షివిక్ విప్లవం వస్తుందని ఆనాడు పెట్టుబడిదారీ వర్గం ఊహించిందా? వాళ్ళ ఊహలకు అందని రీతిలో ఆనాడు విప్లవం జయప్రదం కాలేదా?

(స్వేచ్ఛానుసరణ)


జి-20 మోడీ సొంత ప్రచార కార్యక్రమమే!

సదస్సు సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన బ్రహ్మాండమైన కటౌట్లతో సహా ప్రచారార్భాటమంతా కూడా మోడీని అంతర్జాతీయ వేదికపై ముఖ్యమైన వ్యక్తిగా చూపించే యత్నం చేశారు. ఈ సదస్సును కవర్ చేయడానికి వచ్చిన విదేశీ మీడియా వెంటనే దీన్ని గుర్తు పట్టేలానే ఈ వ్యవహారం ఉంది. మోడీ తన వ్యక్తిగత పేరు ప్రతిష్టలను పెంచుకోవడానికి, వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తన విజయావకాశాలను మెరుగు పరుచుకోవడానికి ఈ సదస్సును దారుణంగా దుర్వినియోగ పరిచారంటూ బ్రిటిష్ వార్తాపత్రిక 'ది అబ్జర్వర్' తన సంపాదకీయంలో వ్యాఖ్యానించింది. ఏమీ లేకపోయినా మోడీని విశ్వగురుగా చూపించే మరో కార్యక్రమంగా జి-20 సదస్సు మిగిలిపోతుంది.

ఉక్రెయిన్ యుద్ధంపై నెలకొన్న తీవ్ర అభిప్రాయ భేదాలను దృష్టిలో ఉంచుకుంటే, న్యూఢిల్లీలో జరిగిన జి-20 సదస్సు, అన్ని సభ్య దేశాల ఆమోదంతో సంయుక్త డిక్లరేషన్‌ను ఆమోదించడం ఆ సదస్సు సాధించిన విజయంగా చెప్పవచ్చు. 2022 నుండి 2025 వరకు జి-20కి అధ్యక్షత వహించిన, వహించబోతున్న నాలుగు దేశాలు-భారత్, ఇండోనేషియా, బ్రెజిల్, దక్షిణాఫ్రికాలు చేసిన సంయుక్త కృషి కారణంగానే ఉక్రెయిన్ యుద్ధం గురించి చెబుతున్న 8 పేరాగ్రాఫ్‌లపై విజయవంతంగా చర్చలు జరిగాయి. ఉక్రెయిన్ యుద్ధంపై గల సెక్షన్‌లో, దురాక్రమణ దారుగా రష్యా గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. అమెరికా, పశ్చిమ దేశాలు అంగీకరించిన విషయం ఇది. బ్రిక్స్ శక్తివంతమైన వేదికగా ఎదుగు తున్న సమయంలో, ఒక డిక్లరేషన్‌ను ఆమోదించడంలో విఫలమైతే జి-20 పలచనైపోతుందనే వాస్తవాన్ని గుర్తెరిగి రష్యా దూకుడును ఖండించాలన్న వారి దృఢమైన వైఖరి నుండి వెనక్కి మళ్ళారు. చైనాను ఎదుర్కోడానికి భారత్‌ను కీలకమైన మిత్రదేశంగా బైడెన్ చూస్తున్నారు. అందువల్ల నరేంద్ర మోడీ, భారత్ రెండూ జి-20 సదస్సును విజయవంతంగా నిర్వహించి నందుకు అభినందనలు పొందేలా చూడాలని అమెరికా చాలా ఆసక్తిగా ఉండటం ఇందుకు మరో కారణమని చెప్పవచ్చు.

అంతర్జాతీయ ఆర్థిక అంశాలపై చర్చించే వేదికగా జి-20 మొదలైంది. ఆగ్నేయాసియా ఆర్థిక సంక్షోభం తర్వాత 1999లో ఇది ఏర్పడింది. నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణల పంథాను అనుసరించడం వల్ల తలెత్తిన సంక్షోభ భారాన్ని పంచుకునేందుకు వర్ధమాన దేశాలను కూడా కలుపుకోవాలని సంపన్న దేశాలు భావించడంతో జి-7 కాస్తా జి-20గా విస్తరించింది. 2008లో అంతర్జాతీయంగా ఆర్థిక మాంద్యం నెలకొన్న నేపథ్యంలో అప్పటివరకు మంత్రిత్వ స్థాయిలో జరిగే వార్షిక సంప్రదింపులను ప్రభుత్వాధి నేతల సదస్సుగా మార్చారు. జి-20 అధ్యక్ష బాధ్యతలు సభ్య దేశాల మధ్య ప్రతి ఏటా మారుతూ ఉంటాయి. జి-20 వార్షిక సదస్సు పలు అంశాలను చర్చించి, ఒక డిక్లరేషన్‌ను ఆమోది స్తుందని అనుభవం తెలియచేస్తోంది కానీ, సభ్యదేశాలన్నీ అమలు చేయగలిగేలా నిర్ణయాలు తీసుకునే సంస్థ కాదిది. జి-20 సదస్సులనేవి ఒక రొటీన్ వ్యవహారంగా మారిపోయాయి. ఈ సదస్సుల్లో ఆర్థికాంశాలు చర్చిస్తారు, కొన్ని ప్రతినలు కూడా చేస్తారు. కానీ వాటి అమలుకు కట్టుబడి ఉండటంగానీ లేదా పర్యవేక్షించడంగానీ ఉండదు. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి, భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు ఉధృతమయ్యాయి. ఇది సరికొత్త ప్రచ్ఛన్న యుద్ధానికి దారి తీసింది. ఈ ప్రచ్ఛన్న యుద్ధంలో అమెరికా, దాని మిత్రపక్షాలు ఒకవైపు. చైనా-రష్యా మరోవైపు నిలిచాయి. గతేడాది బాలి సదస్సులో ఎజెండాలోకి ఉక్రెయిన్ యుద్ధాన్ని తీసుకురావడానికి జి-7 దేశాలు పట్టుబట్టాయి. కానీ దానివల్ల చీలికలు ఏర్పడ్డాయి. చివరకు సంయుక్త డిక్లరేషన్‌ను వెలువరించే సాంప్రదాయాన్ని కూడా గందరగోళంలో పడేసింది.

అంతర్జాతీయ పేద దేశాల వాణిగా జి-20 సదస్సును చూపించాలని నరేంద్ర మోడీ, భారత్ బృందం భావించాయి, అందుకోసం కృషి చేశాయి. అమెరికాతో సన్నిహితమైన వ్యూహాత్మక పొత్తును పెట్టుకుంటున్నప్పటికీ, మారుతున్న ప్రపంచ పరిస్థితులు, పెరుగుతున్న బహుళ ధృవ వైఖరులను దృష్టిలో ఉంచుకుంటే, భారత్‌ను అంతర్జాతీయ పేద దేశాల ఛాంపియన్‌గా చూపించుకోవాల్సిన అవసరం ఉందని మోడీకి తెలుసు. అయితే, వర్ధమాన దేశాలు, నిరుపేద దేశాలు ఎదుర్కొంటున్న సమ కాలీన సమస్యలపై



న్యూ ఢిల్లీ డిక్లరేషన్‌లో ఎలాంటి నిర్దిష్టమైన లేదా చెప్పుకోదగ్గ అంశం లేదు. వాతావరణ మార్పులు, ఆ కారణంగా ఎదురయ్యే ఇబ్బందులను ఎదుర్కొనడానికి అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చడం వంటి కీలకమైన అంశంపై కేవలం సాధారణ ప్రకటనలు మాత్రమే వెలువడ్డాయి. వాతావరణ విపత్తులను ఎదుర్కొనడానికి వర్ధమాన దేశాలకు ఈ క్లైమేట్ ఫైనాన్సింగ్ చాలా కీలకం. వాతావరణ మార్పులను ఎదుర్కొనడానికి అవసరమైన ఆర్థిక సాయం కోసం వంద బిలియన్ల డాలర్లను సమీకరించేందుకు పారిస్ సదస్సులో పారిశ్రామిక దేశాలు ఇచ్చిన హామీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ఉంది. క్లైమేట్ ఫైనాన్స్‌పై వర్ధమాన, పేద దేశాల డిమాండ్లు ఈ డిక్లరేషన్‌లో ప్రతిబింబించలేదు.

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పెరుగుతున్న రుణ ఇబ్బందులను తగ్గించేందుకు, వారిపై భారాన్ని తొలగించేందుకు ఎలాంటి వాస్తవిక చర్యలు ఇందులో లేవు. అమెరికా నిరంతరాయంగా పెంచుతున్న వడ్డీ రేట్ల వల్ల గత సంవత్సర కాలంలో పేద దేశాల రుణ భారాలు దాదాపు 800 బిలియన్ల డాలర్ల మేర పెరిగిన విషయాన్ని ప్రస్తావించడంలో డిక్లరేషన్ విఫలమైంది. తమ రుణాల చెల్లింపు బాధ్యతల కారణంగా తీవ్రంగా ఇబ్బందులు పాలవుతున్న 60దేశాలకు రుణాలను రద్దు చేస్తామన్న హామీ కూడా ఆ డిక్లరేషన్ ఇవ్వలేకపోయింది. ఐక్యరాజ్య సమితి విధించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంపై శీఘ్రగతిన పురోగతిని సాధించాలని డిక్లరేషన్ పిలుపునిచ్చింది. 2015లో వీటిని ప్రారంభించారు. 2030 కల్లా పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటి వరకు, 17లక్ష్యాల అమల్లో కేవలం 12శాతం పురోగతి మాత్రమే జరిగింది. అయితే వాటిని సాధించేందుకు మరింతగా కృషి చేయాలంటూ దేశాలకు పిలుపివ్వడంతోనే డిక్లరేషన్ సంతృప్తి పడాల్సి వచ్చింది.

భారత్-మధ్య ప్రాచ్యం-యూరప్ ఆర్థిక కారిడార్ (ఐఎంఇసి)ని ఏర్పాటు చేయడంపై ఒప్పందం కుదుర్చుకోవడం ఈ సదస్సు నేపథ్యంలో వెలువడిన రెండో ప్రకటన. ఇది కూడా అమెరికా చొరవతోనే జరిగింది. ఈ కారిడార్‌లో రైలు, సముద్ర మార్గాల అభివృద్ధి కూడా ఇమిడి ఉంది. ఈ మార్గాలు భారత్‌ను మధ్య ప్రాచ్యం ద్వారా యూరప్‌కు అనుసంధా నిస్తాయి. ఈ మొత్తం ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థికాంశాలు, వివిధ ప్రాజెక్టుల ఫైనాన్సింగ్ వంటి వివరాలు లేవు. చైనా చేపట్టిన బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌కు ప్రతిగా ఐఎంఇసిని తయారు చేయాలన్నది ఇక్కడ అమెరికా ఆలోచన అని వేరే చెప్పనక్కరలేదు. జి-20 ప్రధాన బహుళార్థ వేదికగా అసమర్థ మైనదిగా ఇప్పటివరకు సాగిన ప్రక్రియ నిరూపించింది. ఎందుకంటే ఇక్కడ జి-7 దేశాలు, వాటి మిత్రపక్షాలే ఆధిపత్యం చెలాయించాయి. అయితే, భారత్ అధ్యక్ష బాధ్యతలకు సంబంధించినంతవరకు చూసి నట్లైతే జి-20 సదస్సుకు ఇతర ఉపయోగాలు ఉన్నాయి. మోడీ నాయకత్వం వల్ల భారత్‌కు చాలా లాభం కలిగిందని ఊదరగొట్టవచ్చని ఈ జి-20 సదస్సును నరేంద్ర మోడీ, బీజేపీ ప్రభుత్వం భావించాయి. మోడీ ప్రతిష్టను దేశీయంగా పెంచుకోవాలన్న తాపత్రయంతో పెద్దఎత్తున హంగామా చేశారు. గతేడాది కాలంలో జి-20 సమావేశాల కోసం ఏకంగా రూ.4100 కోట్లకు పైగా ఖర్చు పెట్టినట్లు తెలుస్తోంది. జి-20 కోసం చేసిన బడ్జెట్ కేటాయింపులు కేవలం రూ.990 కోట్లుగా ఉన్నాయి. సదస్సు సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన బ్రహ్మాండమైన కటౌట్లతో సహా ప్రచారార్భాటమంతా కూడా మోడీని అంతర్జాతీయ వేదికపై ముఖ్యమైన వ్యక్తిగా చూపించే యత్నం చేశారు. ఈ సదస్సును కవర్ చేయడానికి వచ్చిన విదేశీ మీడియా వెంటనే దీన్ని గుర్తు పట్టేలానే ఈ వ్యవహారం ఉంది. మోడీ తన వ్యక్తిగత పేరు ప్రతిష్టలను పెంచుకోవడానికి, వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తన విజయావకాశాలను మెరుగు పరుచుకోవడానికి ఈ సదస్సును దారుణంగా దుర్వినియోగ పరిచారంటూ బ్రిటిష్ వార్తాపత్రిక 'ది అబ్జర్వర్' తన సంపాదకీయంలో వ్యాఖ్యానించింది. ఏమీ లేకపోయినా మోడీని విశ్వగురుగా చూపించే మరో కార్యక్రమంగా జి-20 సదస్సు మిగిలి పోతుంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

భర్తపై పోలీసులకు ఫిర్యాదు

నవతెలంగాణ-పెనుబల్లి

మండల కేంద్రంలోని వియం బంజర్‌కి చెందిన కుమారి తన భర్త ప్రకాష్ తరచూ మద్యం సేవించి వేధిస్తున్నాడని వీయం బంజర్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. గతంలో కూడా పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించినాప్పటికీ మార్పు రాలేదని, సోమవారం ప్రకాష్ కుటుంబ సభ్యులు తనను తీవ్రంగా దూషించి కొట్టారని ఫిర్యాదులు పేర్కొంది. పెనుబల్లి ఎస్ఐ సూరజ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో వీల్ చైర్ బహూకారణ

నవతెలంగాణ-వైరా

గ్రేట్ విజన్ క్లబ్ ఉపాధ్యక్షులు లయన్ తోటకూర శ్రీకాంత్ ఆధ్వర్యంలో క్లబ్ సెక్రటరీ కొరకొప్పుల దివ్య పుట్టినరోజు సందర్భంగా గన్నవరంకి చెందిన దివ్యాంగుడికి వీల్ చైర్ అందించారు ఈ సందర్భంగా పాస్ట్ డిస్టిక్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ దాతలు అయిన కొరకొప్పుల డాక్టర్ శ్రీధర్ గౌడ్, దివ్యా దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిఎంటి కోఆర్డినేటర్ ఉంద్రు శ్యామ్ బాబు, ఆర్‌సి లగడపాటి ప్రభాకరరావు, తోటకూర శ్రీకాంత్, గోపి, చిన్న గురువయ్య పాల్గొన్నారు.



రామాలయం ఆధునీకరణకు లక్ష రూపాయల విరాళం

నవతెలంగాణ-వైరాటౌన్

పట్టణ వాస్తవ్యులు వేమూరి సత్యనారాయణ, స్వరూపరాణి దంపతుల కుమారులు వేమూరి సుదీర్ (యుఎస్ఏ) సౌజన్యంతో వైరా మండలం స్టేజి పినపాక గ్రామంలోని రామాలయం ఆధునీకరణకు ఒక లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా స్టేజి పినపాక సర్పంచ్ ధనకొండ పుల్లంరాజు మాట్లాడుతూ గ్రామంలోని నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు చేయూత అందించడంతోపాటు రామాలయం పునర్నిర్మాణం కోసం లక్ష రూపాయలు విరాళం అందజేసిన వేమూరి సత్యనారాయణ, స్వరూపరాణి దంపతులకు పలువురు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్పు స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి గుడిమెట్ల మోహనరావు, వేమూరి సత్యనారాయణ, తుమ్మలపల్లి కృష్ణారావు, సర్పంచ్ ధనకొండ పుల్లంరాజు, పంచాయతీ కార్యదర్శి కొణిదల వంశీ పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

నవతెలంగాణ - ఎర్రుపాలెం

బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని జ మలాపురం గ్రామంలో ఆయుర్వేద వైద్యులు వెంకట్ లాల్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో భాగంగా జ్వరం, తలనొప్పి, షుగర్, బి.పి, మోకాళ్ళ నొప్పులు, గ్యాస్, చర్మ వ్యాధులు, శ్వాస కోశ వ్యాధులు, స్త్రీ సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్న 83 మందిని పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు వెంకట్ లాల్ మాట్లాడుతూ పై వ్యాధులతో బాధపడుతున్న వారు బనిగండ్లపాడు ఆసుపత్రికి వచ్చి పరీక్ష చేయిం చుకొని ఉచితంగా మందులు తీసు కోవచ్చని ఈ అవ కాశాన్ని ప్రజలంతా వినియోగించు కోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మూల్పూరి శ్రీని వాసరావు, హెల్త్ అసిస్టెంట్ సాయిరెడ్డి, ఏఎన్ఎం రత్న మాల, ఫార్మాసిస్ట్ శ్రీను, అసిస్టెంట్ సాయిబాబు, ఆశా కార్య కర్తలు సునీత,నాగమణి, వరలక్ష్మిపద్మ పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-వైరా

వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి ఎస్.కె బాబర్ ఇంజనీరింగ్ చదువులకు పరిష సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ మంగళవారం రూ.15వేల ఆర్థిక సహాయం అందజేసింది. ఈ సందర్భంగా ట్రస్ట్ బాధ్యులు పుల్లయ్యను కళాశాల ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం సత్యనారాయణ, ఇతర అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీస్ పథకాలు బోగస్

రుణమాఫీ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే సండ్ర

నవతెలంగాణ-పెనుబల్లి




కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయని ఆరు గ్యారెంటీస్ పథకాలు తెలంగాణలో ఎలా అమలు చేస్తారని, వారి ప్రకటనలు వట్టి బూటకం అని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. మంగళవారం కొర్లగూడెం సొసైటీ రైతులకు రుణమాఫీ చెక్కులు అందజేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో 1000కి మించి పెన్షన్ ఇవ్వడం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మెన్ కూరాకుల నాగభూషణం, సొసైటీ అధ్యక్షులు కేసరి వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్కినేని అలేఖ్య వినీల్, జడ్పిటిసి చెక్కిలాల మోహన్ రావు, మార్కెట్ కమిటీ అధ్యక్షుల చెక్కిలాల లక్ష్మణరావు, పెనుబల్లి సర్పంచ్ తావునాయక్, బిఆర్ఎస్ నాయకులు కనగాల వెంకట్రావు పాల్గొన్నారు.

జాబితా నుండి నకిలీ ఓట్లు తొలగించాలి

ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన కొండూరి

నవతెలంగాణ-కల్లూరు

నియోజకవర్గంలో ఉన్న బోగస్ ఓట్లను పరిశీలించి జాబితా నుంచి తొలగించాలని ఆర్డీవో కార్యాలయాల్లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండూరు సుధాకర్ వినతి పత్రం అందజేశారు. వినతిపత్రంతో పాటు నియోజకవర్గ పరిధిలోని సత్తుపల్లి, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి మండలాల్లో ఉన్న బోగస్ ఓటర్ల జాబితాని కూడా వినతి పత్రానికి జత చేసి అందజేశారు. ఈ కార్యక్రమంలో యాసా వెంకటేశ్వర రావు, కాటేపల్లి కిరణ్ కుమార్, మట్టూరి జనార్ధన్, యంగళ సురేష్, మాజీ వార్డ్ మెంబర్ మైబు, బోడిమెల్లి కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.



చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసన

నవతెలంగాణ-ఎర్రుపాలెం

టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం నిరసన దీక్షలు చేపట్టారు. ఎర్రుపాలెం అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భం గా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను దిగజార్చుతూ చట్టాన్ని గుప్పెట్లో పెట్టుకుని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న నిరంకుశ విధానాలను తీవ్రంగా ఖండించారు. రాజకీయ కుట్రలకు పాల్పడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత పై తప్పుడు కేసులను పెట్టి జైలుకు పంపడం పైశాచిక రాజకీయ నిరంకుసత్వ పోకడలకు నిర్దర్శన మని విమర్శించారు.ఈ కార్య క్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వర రెడ్డి, నాయకులు గురజాల సత్యనారాయణ, మహిళా నాయకురాలు వాసిరెడ్డి శివకుమారి, అయ్యవా రి గూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ గోసు రామారా వు పాల్గొన్నారు.

వినాయక చవితి వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని త్రీ టౌన్ ప్రాంతంలోని గాంధీ చౌక్‌లో కిరాణం & జాగిరి మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు వేములపల్లి వెంకటేశ్వరరావుతో స్థానిక కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్రావు మండపం రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకరపర్తి రాంప్రతాప్, వల్ల బోతూ శ్రీనివాసరావు, పుల్లకాండం వినయ్ పాల్గొన్నారు.

కూసుమంచి : మండల వ్యాప్తంగా వాడ, వాడన వినాయక చవితి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు విగ్రహాలు ఏర్పాటు చేసుకొని సంబరాలు నిర్వహించారు.



సాయుధ పోరాట చరిత్ర వక్రీకరణ



- త్యాగాల వారసులు కమ్యూనిస్టులే

నవతెలంగాణ - ఎర్రుపాలెం

తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర కమ్యూనిస్టుల త్యాగాల చరిత్ర అని సాయుధ పోరాట నిజమైన వారసులుగా వాస్తవ చరిత్రను ప్రజలకు తెలియ పరచ వలసిన బాధ్యత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలపైనే ఉందని సాయుధ పోరాట చరిత్రనే వక్రీ కరిస్తున్నారని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వర రావు విమర్శించారు. మండల పరిధిలోని మీనవోలు, రేమిడిచర్ల గ్రామాలలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ముగింపు సందర్భంగా పొన్నం మాట్లాడుతూ తెలంగాణ సంస్థానాన్ని పరిపాలిస్తున్న బ్రిటిష్ వారి పాలనను వ్యతిరేకిస్తూ చేపట్టిన రైతాంగ సాయుధ పోరాటానికి ఎదురొడ్డి గ్రామానికి చెందిన తోట వెంకయ్య, మెట్టెల శ్రీ రాములు, బండి వీరయ్య, రాంపల్లి రామయ్య, తోట బాలయ్య, సుఖభోగి ముత్తయ్య, పిల్లి కాటయ్య, ఏడుగురు కామ్రేడ్లు బ్రిటిష్ వారి జరిపిన మారణ కాండకు వారు కాల్చిన తూటాలకు ప్రాణాలు అర్పించి అమరులైనారని అన్నారు. వారి ప్రాణతర్పంతో మీనవోలు గ్రామం పోరాటాల పురిటి గడ్డగా చరిత్ర పుటలకెక్కిందని అన్నారు. గ్రామంలో నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా కార్యకర్తలు పని చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్య క్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, రామిశెట్టి సురేష్, షేక్ నాగుల మీరా, మొహిద్దిన్, కుర్ర వెంకటరామయ్య, మేకల పుల్లయ్య, అంకాలరావు, హుస్సేన్ రావు, నాగులవంచ వెంకట్రామయ్య, లగడపాటి అప్పారావు, మాదల వెంకట నరసయ్య, సగుర్తి సంజీవరావు, గామాసు జోగయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం
సీపీఐ(ఎం) నాయకులు కిలారు శ్రీనివాసరావు

వైరాటౌన్ : మండలంలోని గొల్లెనపాడు గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమర వీరుల స్థూపం వద్ద పార్టీ జెండాను సీనియర్ నాయకులు కామ్రేడ్ కొణిదన ధర్మారావు ఎగురవేశారు. అనంతరం జరిగిన సభలో సిపిఐ(ఎం) వైరా మండల కార్యదర్శివర్గ సభ్యులు కిలారు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆనాడు భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలో కామ్రేడ్ కొణిదన సీతారామయ్య, కొణిదన సత్యనారాయణ, వెంపటి సాంబయ్య ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలిపారు. వీరితో పాటు పరోక్షంగా అనేక మంది పాల్గొన్నారని, అమర వీరుల ఆశయాలు



కొనసాగిస్తూ కార్మిక, కర్షక వర్గ పోరాటాలు కొనసాగించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం) గ్రామ శాఖ కార్యదర్శి అమరనేని వెంకటేశ్వరరావు, ఆళ్ల రాంబాబు, సండ్ర ప్రసాద్, వెంపటి రాజేశ్వరరావు, సిహెచ్ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ దళిత బంధు అందజేయాలి

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

పాలేరు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ దళిత బంధు పథకం వర్తింపజేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి(కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ సభ్యులు పాపిట్ల సత్యనారాయణ అన్నారు.మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్ వద్ద గల తమ్మినేని సుబ్బయ్య భవన్ లో కెవిపిఎస్ ఖమ్మం రూరల్ మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు కుక్కల సైదులు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాపిట్ల సత్యనారాయణ మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గంలో అర్హత కలిగినటువంటి ప్రతి ఎస్సీ కుటుంబానికి పార్టీలకు అతీతంగా దళిత బంధు అందించాలన్నారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 215 దళిత వాడల్లో దళితుల స్థితిగతులపై సర్వే నిర్వహించడం జరిగిందని,ఈ సర్వేలో ప్రధానంగా దళితులు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురై అత్యంత దుర్భరంగా జీవిస్తున్నారని సర్వేలో నిర్ధారణ చేయడం జరిగిందన్నారు. దళిత బంధు పథకాన్ని రాజకీయాలకు అతీతంగా ఎమ్మెల్యే, మంత్రుల సిఫారసులు లేకుండా కలెక్టర్, ఇతర జిల్లా అధికారులతో సర్వే చేయించి నిజమైన లబ్ధిదారులకు అందిస్తే దళితులు అభివృద్ధి చెందుతారన్నారు. జీవో నెంబర్ 342 ప్రకారం 100 యూనిట్ల ఉచిత విద్యుత్ నియోజకవర్గంలో ఎక్కడ అమలు కావటం లేదని,ఎస్సీ కార్పొరేషన్ సబ్ ప్లాన్ నిధుల నుంచి ట్రాన్స్కోకు నిధులు వెళ్తున్న పేద దళితుల నుండి యధావిధిగా విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్నారని తెలిపారు. కెవిపిఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలు అక్టోబర్ రెండున పాలేరు నియోజకవర్గం లోని అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలని సభ్యులకు సూచించారు.ఈ సమావేశంలో కెవిపిఎస్ ఖమ్మం రూరల్ మండల ఉపాధ్యక్షులు అరెంపుల ఉప్పలయ్య, మండల కమిటీ సభ్యులు వెలుతూరి రామనాథం, పాల్గొన్నారు.



కురమ, యాదవులను అప్పులు పాలు చేసిన ప్రభుత్వం

- జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి తుశాకుల లింగయ్య

నవతెలంగాణ - బోనకల్

కురమ, యాదవులను గొర్రెల పంపిణీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అప్పుల పాలు చేసిందని గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి తుశాకుల లింగయ్య, జిల్లా అధ్యక్షుడు చింతలచెరువు కోటేశ్వరరావు విమర్శించారు. మండల పరిధిలోని రావినూతల గ్రామంలో ఈనెల 22న జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే మహా ధర్నాకు సంబంధించి పోస్టర్ ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 16,844 మంది కురమ, యాదవులకు గొర్రెల పంపిణీ చేయవలసి ఉండగా కేవలం 15 నెలల కాలంలో 521 మందికి మాత్రమే గొర్రెల పంపిణీ చేశారన్నారు. గొర్రెల పంపిణీ వలన కురమ, యాదవులు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి సాధిస్తారని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఒకవైపు ప్రకటిస్తూ మరొకవైపు వారిని అప్పుల పాలు చేస్తున్నారని విమర్శించారు. డీడీలు చెల్లించి 15 నెలల కాలం అవుతున్న నేటి వరకు గొర్రెల పంపిణీ చేయలేదన్నారు.కురమ, యాదవులకు నగదు బదిలీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ధనియాకుల రామయ్య, జోనిబోయిన గురవయ్య, దుండుకూరు మోహన్ రావు, పుచ్చకాయల ధనయ్య, మంద వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



గొర్రెల పంపిణీ.. నగదు బదిలీ రూపంలో చేయాలి


నేలకొండపల్లి : కురమ, యాదవులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని నగదు బదిలీ రూపంలో చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న జీఎంపీఎస్ ఆధ్వర్యంలో ఖమ్మంలో చేపట్టిన మహాధర్నాకి యాదవ్, కురమలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు చింతలచెరువు కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలలో గొర్రెలు మేకల పెంపుకుందారుల సంఘం ఆధ్వర్యంలో వివిధ గ్రామాలలో జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలకొండపల్లి మండలంలో గొర్రెల స్కీం కోసం డీడీలు కట్టి 14 నెలలుగా గడుస్తున్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గొర్రెల పంపిణీ కోసం ఎదురుచూస్తున్న యాదవ, కురములు అందరికీ వెంటనే గొర్రెల పంపిణీ నగదు రూపంలో అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు. ఈ ప్రచారంలో జిల్లా కార్యదర్శి తుశాకుల లింగయ్య, మండల అధ్యక్షులు తెల్లగొర్ల లింగస్వామి, కార్యదర్శి యడ్ల తిరుపతిరావు, నాయకులు మార్తి కొండలరావు, జిల్లా డైరెక్టర్ మల్లెబోయిన శ్రీ ను, యర్రా దేశి నరసింహారావు, కనకబండి రమేష్, వలరాజు, నోముల జానయ్య కొమెర నాగేశ్వరరావు,పచ్చిపాల వెంకటేశ్వరరావు, ధనమూర్తి, ఆవుల వెంకన్న, నవీన్, మీగడ లింగరాజు, చిలకల వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

నూతన పార్లమెంటులోకి నామ

- పాత పార్లమెంట్ ఆవరణలో ఎంపీల ఫొటో సెషన్
- ఉపరాష్ట్రపతి, ప్రధానితో కలసి బీఆర్ఎస్ ఎంపీల ఫొటోలు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

నూతన పార్లమెంటు భవనంలోకి బీఆర్ఎస్ ఎంపీలతో కలిసి లోక్ సభాపక్ష నేత నామ నాగేశ్వరరావు మంగళవారం అడుగిడారు. 75 ఏళ్ల లో అనేక కీలక ఘట్టాలకు కేంద్ర బిందువుగా నిలిచిన పాత పార్లమెంట్ భవనం ప్రాంగణంలో ఎంపీలతో ఫొటో సెషన్‌కు హాజరయ్యారు. పాత భవనం జ్ఞాపకాలను పదిలపరుచుకుంటూ లోక్ సభ, రాజ్యసభ సభ్యులంతా కలసి గ్రూప్ ఫొటో దిగారు. తర్వాత విడివిడిగా ఫొటోలు దిగి, పాత భవనానికి వీడ్కోలు పలికారు. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్ ఖడ్ , ప్రధాని నరేంద్ర మోడీ, రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ , లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా , రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ముందు వరుసలో కూర్చోగా వారితో పాటు బీఆర్ఎస్ పార్లమెంటరీ నేత కె. కేశవరావు, లోక్ సభ నాయకులు, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు, తదితర పార్టీ ఎంపీలు కూర్చున్నారు. ఎంపీలతో సమావేశం అనంతరం ప్రధాని నరేంద్రమోదీ ఎంపీలతో కలసి కొత్త పార్లమెంట్ భవనానికి కాలినడకన చేరుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎంపీలంతా పార్టీ పార్లమెంటరీ నేత కే. కేశవరావు, లోక్ సభ లీడర్ నామ నాగేశ్వరరావు నేతత్వంలో కొత్త పార్లమెంట్ లో ఆశీనులయ్యారు. లోక్ సభ లో ముందు వరుసలో ఎంపీ నామ కూర్చున్నారు. అంతకుముందు రోజు సోమవారం ప్రారంభమైన పార్లమెంటు సమావేశాల్లో నూతన పార్లమెంటు భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని నామ డిమాండ్ చేశారు. తెలంగాణ నూతన సచివాలయానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అంబేద్కర్ పేరుపట్టిన విషయాన్ని ప్రస్తావించారు. కేసీఆర్ దళిత పక్షపాతని పేర్కొన్నారు.



అంగన్వాడీ సమస్యలు పరిష్కరించటంలో పూర్తిగా విఫలం

నవతెలంగాణ-మధిర

అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి సిఐటియు, ఏఐటీఐయూసీ రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా 9వ మంగళవారం మధిర లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మానవహారం అనంతరం కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చాలా పద్మ మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగులు, ఎన్నో సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని అయినవారికి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించలేదని, కనీస వేతన చట్టం అమలు పరచడం లేదని, అదనపు పనికి వేతనం ఇవ్వటం లేదని పేర్కొన్నారు. అంగన్వాడి ఉద్యోగులను ఆయాలను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, అదనపు, పనికి అదనపు వేతనం ఇవ్వాలని రాజకీయ ఒత్తిడి లను నివారించాలని, పని భారాన్ని తగ్గించాలని ఈ సమస్యలన్నిటినీ పరిష్కరించాలని ఇప్పటివరకు తొమ్మిది రోజుల పాటు సమ్మె చేస్తున్న ప్రభుత్వానికి కళ్ళు లేవని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శీలం నరసింహారావు, సిఐటియు మధిర టౌన్ కన్వీనర్ పడకంటి మురళి, సిఐటియు మండల నాయకులు వడ్రానపు మధు, అంగన్వాడీ టీచర్స్, మినీ వర్కర్స్ ఆయాలు పాల్గొన్నారు.



గడపగడపకీ కాంగ్రెస్ పార్టీ ఆరు పథకాలు ప్రచారం

నవతెలంగాణ-కల్లూరు

మండలంలోని కొర్లగూడెం గ్రామంలో గడపగడపకీ కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ కార్డు కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండూరు సుధాకర్, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, పిసిసి అధికార ప్రతినిధి కోటూరి మానవతా రాయ్‌లు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు పథకాలను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాస వెంకటేశ్వరరావు, కాటపల్లి కిరణ్, మట్టురి జనార్దన్, యంగల సురేష్, అభిలాష్, నేపాల్, గిద్దెల నాగరాజు పాల్గొన్నారు.

మిస్సయిన మొబైల్ ఫోను అందజేత

నవతెలంగాణ-మధిర

మండల పరిధిలోని వంగవీడు గ్రామానికి చెందిన వ్యక్తి వారం రోజుల కితం తన మొబైల్ ఫోన్ పోయిందని రూరల్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశాడు. టౌన్ ఎస్ఐ రఫీ విచారణ చేపట్టి బాధితుడికి అందజేశారు. ఎస్ఐకి బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీరు విడుదల చేయాలని ఎంపీడీఓకు వినతి

నవతెలంగాణ-వైరాటౌన్

మండలంలోని గొల్లెనపాడు గ్రామంలోని బీసీ కాలనీ వాసులకు మిషన్ భగీరథ తాగునీరు విడుదల చేయాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వైరా ఎంపీడీఓకు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ వైరా మండలం కార్యదర్శి యామాల గోపాలరావు మాట్లాడుతూ గొల్లెనపాడు బీసీ కాలనీలో సుమారు 400 మంది ప్రజలు నివసిస్తున్నారని, మూడు నెలల నుండి గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్, గ్రామ పంపు ఆపరేటర్ ఏకపక్ష ధోరణిలో తాగునీరు అందించటం లేదని, బీసీ కాలనీ ప్రజలు, మూగజీవాలు తాగునీరు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వైరా పట్టణ కార్యదర్శి గారపాటి అశోక్, గొల్లెనపాడు శాఖ కార్యదర్శి ఆళ్ళ రాంబాబు, వెంపటి సత్యం, పెడకంటి ఉదయ్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలో రాష్ట్రస్థాయికి ఎంపిక

నవతెలంగాణ-బోనకల్



ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో బోనకల్ మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ గురుకుల కళాశాలకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. అండర్ 16, అండర్ 18 హై జంప్, షాట్ పుట్, 100 మీటర్స్, అండర్ 16 హై జంప్ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల సెప్టెంబర్ 30, అక్టోబర్ 1న కరీంనగర్ లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపాల్ సుష్మా వీటి వెంకట్రావు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

అంగన్వాడీ సమస్యలను పరిష్కరించకపోతే కేసీఆర్‌ను గంగలో కలుపుతాం

- చావా పద్మ

నవతెలంగాణ-బోనకల్



అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సిఐటియు, ఏఐటీయూసీ రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా 8వ ఈరోజు మధిర తాసీల్దార్ కార్యాలయం లో వినాయక చవితి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ ప్రాజెక్టు నాయకురాలు చావా పద్మ మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులు, ఎన్నో సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని అయిన వారికి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించలేదని, కనీస వేతన చట్టం అమలు చేయటం లేదన్నారు. అదనపు పనికి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అంగన్వాడీ ఉద్యోగులను, ఆయాలను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని, రాజకీయ ఒత్తిడిలను నివారించాలని, పని భారాన్ని తగ్గించాలని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని విగ్నేశ్వరుడికి అందజేశారు. ఈ సమస్యలన్నీ కేసిఆర్ పట్టించుకోకపోతే కెసిఆర్ ని కూడా గంగలో నిమజ్జనం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శీలం నరసింహారావు, సిఐటియు మండల నాయకులు వడ్రానపు మధు, రైతు సంఘం మండల అధ్యక్షులు పాపినేని రామ నరసయ్య, అంగన్వాడీ టీచర్స్, మినీ వర్కర్స్ ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

నవతెలంగాణ-తల్లాడ

క్షయ వ్యాధి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని, 2025 వరకు క్షయ వ్యాధి రహిత రాష్ట్రంగా తెలంగాణను ప్రకటించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా టీబీ నిర్మూలన అధికారి డాక్టర్ సుబ్బారావు అన్నారు. మంగళవారం తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, బిల్లుపాడు, మిట్టపల్లి, హెల్త్ అండ్ వెల్ సెంటర్లను సందర్శించారు. ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రేష్మ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భాస్కరరావు, నోడల్ పర్సన్ కే.పెద్ద పుల్లయ్య, సూపర్వైజర్ వై సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

- ట్రాఫిక్ సీఐ అశోక్ కి వినతి

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ పబ్లిక్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఖమ్మం ట్రాఫిక్ సీఐ అశోక్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పబ్లిక్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)

జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై విక్రం, జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు టి విష్ణు, జిల్లా ఉపేందర్ మాట్లాడుతూ నగరంలోని బీసీ కాలనీ, టీఎన్జీవో కాలనీ, కరుణగిరి, రమణ గుట్ట ఆటో అడ్డాలకు ఆటో స్టాండ్ కేటాయించాలని కోరారు. ఖమ్మంలో మయూరి సెంటర్లో ప్రజలకు సానుకూలంగా వెళ్లే మార్గాలైన రమణగుట్ట, కరుణగిరి, బీసీ కాలనీ ,టీఎన్జీవో కాలనీ లకు ఆటో స్టాండులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే డ్రైవర్లు విధిగా యూనిఫామ్ ధరిస్తూ ప్రయాణికుల తో మర్యాదగా మంచిగా మాట్లాడాలని, ట్రాఫిక్ అశోక్ సమస్యలను చూసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దండగలు ఉపేందర్, హనుమంతరావు, సంగయ్య డ్రైవర్లు పాల్గొన్నారు.

సెమినార్‌ను జయప్రదం చేయండి

-డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్

నవతెలంగాణ-ఖమ్మం



డీవైఎఫ్ఐ జిల్లా విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు ఈనెల 23, 24 తేదీల్లో ఖమ్మం మంచికంటి హాల్లో జరుగుతున్నాయని, ఈ క్లాసుల ప్రారంభ సందర్భంగా 23వ తేదీన మణిపూర్ మారణకాండ దేశ రాజకీయం ఒక చిత్రం అనే అంశం పైన సెమినార్ నిర్వహిస్తున్నట్లు డివైఎఫ్ఐ సంఘం జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్ యువతకు పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మంలోని సుందరయ్య భవనం లో డివైఎఫ్ఐ వన్ టౌన్ అధ్యక్షులు రావులపాటి నాగరాజు అధ్యక్షతన జరిగిన వన్ టౌన్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సెమినార్ కు ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినే సుదర్శన్, బిగ్ టీవీ ఎడిటర్ ఇన్ చీఫ్ పీవీ శ్రీనివాసరావు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోటా రమేష్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, యుసిఎస్ఓ వ్యవస్థాపక అధ్యక్షులు గుడిబండ్ల దీపక్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్, డివైఎఫ్ఐ యంగ్ వుమెన్ రాష్ట్ర కన్వీనర్ పఠాన్ రోషిని ఖాన్, మద్దాల ప్రభాకర్ హాజరవుతారని తెలిపారు. వన్ టౌన్ కార్యదర్శి కోరపాటి శ్రీను మాట్లాడుతూ ఈ క్లాసులకు వన్ టౌన్ నుంచి 30 మంది హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ వన్ టౌన్ నాయకులు కొండూరు వెంకటరమణ, వెంకటేష్, రహిమాన్, రవితేజ, సాయి, బాలకృష్ణ, పవన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంకే యూత్ ఆధ్వర్యంలో 18 అడుగుల మట్టి విగ్రహం ఏర్పాటు

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం కొత్త బస్టాండ్ ఎన్ఎస్‌టి రోడ్‌లో ఎంకే యూత్ ఆధ్వర్యంలో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ 18 అడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బలుసు మురళీకృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ లో భాగంగా మట్టి విగ్రహం ఏర్పాటు చెయ్యాలని మంత్రి ఆదేశించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంకే యూత్ సభ్యులు కోమటిలి సాయి కృష్ణ చైతన్య, సాయికుమార్, ఆలేటి వెంకటేష్, వనపర్తి గోపి, పసునూటి సురేష్, కోమటిల్లి అభినవ్, భరత్ చౌదరి, వరప్రసాద్, రాజా ఆర్యన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆర్జేసి కృష్ణ

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని బైపాస్ రోడ్ ప్రాంతంలోని తారకరామా ఆటోనగర్‌లో శ్రీ కాణిపాక విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని బిఆర్ఎస్.పార్టీ సీనియర్ నాయకులు,ఎస్.బి. ఐ.టి.,ఆర్జేసి విద్యా సంస్థల అధినేత గుండాల కృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కన్నం ప్రసన్న కృష్ణ, ఉత్సవ కమిటీ బాధ్యులు మహంకాళి మల్లికార్జునరావు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని చెప్పండి స్వామి

- సమ్మె శిబిరంలో వినాయక చవితి వేడుకలు

మోకాళ్ళపై నిరసన తెలిపిన అంగన్‌వాడీలు

నవతెలంగాణ-కల్లూరు

వినాయక చవితి పర్వదినం సందర్భంగా అందరూ కుటుంబ సభ్యులతో సంతోషంగా పండగ జరుపుకుంటుంటే అంగన్వాడీలు మాత్రం తమ బతుకులు మారాలంటూ సమ్మె శిబిరంలోని వేడుకలు జరుపుకొని బొజ్జ గణపయ్యను వేడుకున్నారు. కేసీఆర్ మనసు మార్చాలని వేడుకున్నారు. అంగన్వాడీల సమ్మె మంగళవారం 9 రోజులు చేరుకుంది. సమ్మెలో బాగంగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు మాట్లాడారు. ఈ సిపిఎం మండల కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు పాల్గొని సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కల్లూరు ప్రాజెక్టు అంగన్వాడీ యూనియన్ నాయకత్వం వహించడం జరిగింది. అంగన్‌వాడీ శిబిరాన్ని కాంగ్రెస్ నేత కొండూరు సుధాకర్ సందర్శించి సంఘీభావం తెలిపారు.

పాలేరులో ఉన్న డబుల్ ఓట్లు తొలగించాలి

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

పాలేరు నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితాలో డబుల్ ఓట్లు ఉన్నవి, చనిపోయిన వారి ఓట్లు తొలగించాలని మండల తహసీల్దారు కార్యాలయంలో పాలేరు నియోజకవర్గ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఏఈఆర్వో) రామకృష్ణకి కాంగ్రెస్ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి మాట్లాడారు. పాలేరు నియోజకవర్గంలో 1,568 ఓట్లు డబుల్ ఓట్లు ఉన్నాయని వాటిని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తగూడెం సర్పంచ్ భుజంగరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మద్ది వీరారెడ్డి, అజ్మీరా అశోక్, కొప్పుల చంద్రశేఖర్, కిషోర్ రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో ముత్తారం గ్రామానికి చెందిన నారపొంగు వీరమ్మ (42) ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ పురుగుమందు తాగి మంగళవారం మృతి చెందింది. మృతురాలు భర్త కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి నరేష్ తెలిపారు.

ప్రతినిధులకు ఘనంగా స్వాగతం పలికిన ఆహ్వాన సంఘం

నవతెలంగాణ-వైరాటౌన్

తమిళనాడు రాష్ట్రం నమక్కల్ లో రేపటి నుంచి ప్రారంభం కానున్న గిరిజన జాతీయ మహాసభలకు ఖమ్మం జిల్లా నుండి పాల్గొంటున్న ప్రతినిధులు తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా అధ్యక్షులు బానోతు బాలాజీ, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా విజయలను సోమవారం సేలం రైల్వే స్టేషన్ లో ఆహ్వాన సంఘం అధ్యక్షులు, అఖిలభారత కిసాన్ సభ సహాయ కార్యదర్శి డి.రవీంద్రన్, ఏఐకెయస్ జిల్లా కార్యదర్శి ఏ.రామమూర్తి, ఎన్.బాలగన్, రైల్వే ఉద్యోగుల సంఘం నాయకులు తిరుపతిరావు ఘనంగా స్వాగతం పలికారు. స్వాగతం పలికిన ఆహ్వాన సంఘం నాయకులు, ప్రజా సంఘాల నాయకులకు ఖమ్మం జిల్లా ప్రతినిధులు ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలియజేశారు.



ప్రజాస్వామ్యం, లౌకిక శక్తుల రక్షణే ధ్యేయం

-మతోన్మాద శక్తులను నిలువరించండి

- జనసేవాదళ్ ముగింపు సభలో

సీపీఐ కార్యదర్శి నారాయణ

నవతెలంగాణ-ఖమ్మం

ప్రజాస్వామ్య, లౌకికశక్తుల పరిరక్షణే ధ్యేయంగా జనసేవాదళ్ కార్యకర్తలు పని చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కోరారు. దేశ రక్షణలో దేశ సైన్యం ఉంటే, జన సేవాదళ్ దేశాన్ని మతోన్మాద శక్తుల నుంచి కాపాడేందుకు రెడ్ ఆర్మీలా పనిచేయాలన్నారు. పది రోజుల పాటు ఖమ్మంలో జరిగిన జనసేవాదళ్ జాతీయ స్థాయి శిక్షణా శిబిరం మంగళవారం ముగిసింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జనసేవాదళ్ కార్యకర్తలు శిక్షణపొందారు. ముగింపు సందర్భంగా కె. నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ నాయకులు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ తదితరులు జనసేవాదళ్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ దేశంలో మతోన్మాద శక్తులు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తున్నాయని స్వేచ్ఛను హరిస్తున్నాయన్నారు. చారిత్రిక నేపథ్యం గల భారత రాజ్యాంగానికి సైతం తూట్లు పొడిచి తమకు సానుకూలమైన అంశాలను రాజ్యాంగంలో పొందుపర్చాలని చూస్తున్నారని ఆరోపించారు. విపత్కర పరిస్థితులలో కమ్యూనిస్టు పార్టీ ప్రజా సంఘాలు, సామాన్య ప్రజలకు అండగా నిలిచి పోరాటం చేశాయని నారాయణ గుర్తు చేశారు. సిపిఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు గడచిన సందర్భంగా 2024 డిసెంబరు 26న ఢిల్లీలో లక్ష మంది జనసేవాదళ్ కార్యకర్తలతో ఎర్ర కవాతు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణతో పాటు ప్రజా ఉద్యమాలకు జన సేవాదళ్ కార్యకర్తలు దన్నుగా నిలవాలని నారాయణ కోరారు. రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ యువత తోనే సమాజ మార్పు త్వరితగతిన సాధ్యమవుతుందని తెలిపారు. జనసేవాదళ్ గౌరవ వందనం స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ పాలకుల నిర్ణయాలతో యువత నైరాశ్యంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు మహ్మద్ మౌలానా, నార్ల వెంకటేశ్వరరావు, యువజన విద్యార్థి సంఘాల నాయకులు సిద్దినేని కర్ణకుమార్, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, నానబాల రామకృష్ణ, ఇటీకాల రామకృష్ణ, శ్రావణ్ పాల్గొన్నారు.



అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం కార్పొరేషన్ : అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి వారిని వెంటనే పర్మినెంట్ చేయాలని నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం అర్బన్ తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన సమ్మె చేస్తున్న అంగన్వాడీ ఉద్యోగులకు నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అంగన్వాడీల పక్షాన పోరాడుతుందని వారికి ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

మహిళా సమాఖ్య పోరాట ఫలితమే రిజర్వేషన్ బిల్లు

ఖమ్మం : భారత జాతీయ మహిళా సమాఖ్య పోరాట ఫలితంగానే ప్రస్తుత ప్రభుత్వం మహిళా బిల్లును ఆమోదించిందని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి తెలిపారు. మంగళవారం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో కేంద్ర మంత్రి వర్గం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో రిజర్వేషన్ బిల్లు కోసం పోరాడిన గీతా ముఖర్జీకి జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1996 సెప్టెంబరు 12న తేదీన 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టారని, దాని అమలు కోసం 27 ఏళ్ళ గా మహిళా సమాఖ్య పోరాడుతూనే ఉందని ఆమె తెలిపారు. ప్రశాంత్ భూషణ్ ద్వారా మహిళా సమాఖ్య రిజర్వేషన్ బిల్లు కోసం న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించిందన్నారు. ఎట్టకేలకు క్యాబినెట్ ఆమోదం పొందిందని పార్లమెంటు ఉభయ సభల్లోనూ ఆమోదం పొందేందుకు అన్ని పక్షాలు. సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షురాలు తాటి నిర్మల, నాయకులు పోటు మమత, ముంతాజ్ బేగం, మున్నీసా, మాధవి, కమల, జానీబీ తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల్లో ఆరు ప్రధాన పథకాలను అమలు చేస్తాం...

- రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం..

- మండల కేంద్రాలలో ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభం..

- కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగమే చంద్రబాబు

అరెస్ట్ : సీఎల్పీ నేత భట్టి

నవతెలంగాణ - బోనకల్

రానున్న సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలో కాంగ్రెస్ 74 నుంచి 78 అసెంబ్లీ స్థానాలతో అధికారంలోకి రావడం ఖాయమని సీఎల్పీ నేత, మధిర ఎమ్మెల్యే మల్లు బట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ బిసి సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకుడు చేబ్రోలు వెంకటేశ్వరరావు ఇంట్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుక్కుగూడ బహిరంగ సభ విజయవంతమైందన్నారు. ఈ సభలో కాంగ్రెస్ జాతీయ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే రాష్ట్రానికి సంబంధించిన మ్యానిఫెస్టో కాకుండా 6 ప్రధాన వాగ్దానాలను ప్రకటించారన్నారు. ఈ ఆరు వాగ్దానాలను అధికారంలోకి వచ్చిన 100 రోజులలోనే అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు.

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతీ నెలా రూ.2,500, పేద మహిళలకు కేవలం రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా ద్వారా ప్రతిఏటా రైతులతో సహా కౌలు రైతులకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలు, భూమిలేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేలు, వరికి మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇల్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి రూ.5 లక్షలు, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని తెలిపారు. గృహజ్యోతి పథకం కింద పేదల ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని తెలిపారు.

చేయూత పథకం ద్వారా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10 లక్షల ఆరోగ్య బీమా, నెలకు రూ.4 వేల పింఛన్ అందజేస్తామని తెలిపారు. యువ వికాసం ద్వారా ఫీజు రియంబర్స్ మెంట్ తో పాటు కళాశాల విద్యార్థుల కోచింగ్ ఫీజు కోసం రూ.5 లక్షల వరకు సహాయం అందజేస్తామని తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో ఇంటర్నేషనల్ స్కూల్ ని ఇంగ్లీష్ మీడియంలో ప్రారంభిస్తామని తెలిపారు. ఈ పథకాల అమల కోసం కాంగ్రెస్ కు చెందిన నాయకులు, కార్యకర్తల గ్రామాలలోనే ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్ట్ కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగమేనన్నారు. కేంద్ర ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి భుజం మీద తుపాకి పెట్టి జగన్ పరువు తీసిందన్నారు. దేశంలో, రాష్ట్రాలలో ప్రతిపక్ష పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతుందన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టుని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జర్నలిస్టులందరికీ ఇల్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, జెడ్పిటిసి మోదుగు సుధీర్ బాబు, కలకోట సొసైటీ అధ్యక్షుడు కర్నాటి రామకోటేశ్వరరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, ఎస్సీ సెల్, ఎస్టీసెల్ మండల అధ్యక్షులు మారుపల్లి ప్రేమ కుమార్, భూక్య బద్రు నాయక్, చేబ్రోలు వెంకటేశ్వరరావు, పాసంగులపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బాలుర సంక్షేమ గురుకుల విద్యాలయం సందర్శన:

మండల కేంద్రంలో గల మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సోమవారం సందర్శించారు. గురుకుల పాఠశాలలో జరిగిన వినాయక చవితి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయనతో కరచాలనం చేసేందుకు పోటీలు పడ్డారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిక

బోనకల్ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యుడు, బీఆర్ఎస్ యువ నాయకుడు బానోత్ మురళి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాడు. పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

గురు శిష్యులు ఒకే దగ్గర....

- కూసుమంచి ఉన్నత పాఠశాలలో అరుదైన ఘటన

- ప్రధాన ఉపాధ్యాయులుగా బాధ్యతలు

స్వీకరించిన ఆర్. వీరస్వామి

నవతెలంగాణ-కూసుమంచి

కూసుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురు శిష్యులు ఒకే చోట పని చేయడం విశేషం. ఇటీవల పాఠశాల గెజిటెడ్ ఉపాధ్యాయుల బదిలీల నియామకం కూసుమంచి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆర్. వీరస్వామి ప్రధానోపాధ్యాయులుగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అయితే ఇప్పటికే అదే స్కూల్లో ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతల్లో వున్న రేలా విక్రమ్ రెడ్డి ప్రస్తుతం బాధ్యతల స్వీకరించిన ప్రధానోపాధ్యాయులు విక్రమ్ రెడ్డికి విద్య బుద్ధులు నేర్పిన గురువు కావడం విశేషం. నిన్న జరిగిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీలతో కూసుమంచి పాఠశాలలో ఒక విశేషం చోటు చేసుకుంది. శిష్యుని నుండి పాఠశాల బాధ్యతలు స్వీకరించడం విశేషంగా చెప్పుకోవచ్చు. అయితే ఇదే పాఠశాల లో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న సంక్రాంతి రవి కుమార్ కూడా వీర స్వామి శిష్యుడు కావడం మరో విశేషం. ఇది యాధృచ్ఛికం అయినప్పటికీ గురు శిష్యులు ఒకే పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేయడం నిజంగా విశేషమే. వీర స్వామి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షునిగా కూడా ఉన్నారు. విక్రమ్ రెడ్డికి ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు రావడంతో అభినందనలు తెలియజేశారు. ఇదే పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయునిగా ఉన్న ఆళ్లగడప శ్రీనివాస రావు, ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న డాక్టర్.తేజావత్ శోభన్ బాబు ఇద్దరూ ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసి ఇక్కడే ఉపాధ్యాయులుగా పని చేస్తుండటం మరొక విశేషం.



సీసీ రోడ్లకు శంకుస్థాపన

- సర్పంచ్ పాలెపు లక్ష్మీకాంతమ్మ

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణానికి గ్రామ సర్పంచ్ పాలెపు లక్ష్మీకాంతమ్మ, సొసైటీ అధ్యక్షుడు పాలెపు రామారావు శంకుస్థాపన చేశారు. సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య చొరవతో ఎస్‌డీఎఫ్ నుండి సుమారు 50 లక్షలు నిదుల మంజూరు కావటంతో ఈ నిర్మాణాలు చేపడుచున్నట్లు చెన్నూరు సొసైటీ అధ్యక్షులు పాలెపు రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఏఈ వెంకటేశ్వరావు, యంపీటీసీలు జినుగు శ్రీనివాసరావు , కంచపోగు యశోద, మాదల జమలయ్య , మన్ని వెంకటేశ్వరరావు, గ్రామ సెక్రటరి , బి.ఆర్.ఎస్ గ్రామ నాయకులు జాలా అప్పారావు పాల్గొన్నారు.

గ్యారంటీ కార్డుల కార్యక్రమాన్ని ప్రారంభించిన డీసీసీ అధ్యక్షులు

నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని మల్లాయిగూడెం గ్రామంలో ఆరు గ్యారెంటీ కార్డులను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ... వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందన్నారు. గతంలో ఉచిత విద్యుత్ ఇచ్చినట్లే అధికారంలోకి వచ్చిన మొదటి 100 రోజుల్లోనే ఈ 6 గ్యారంటీ లు అమలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో 5వ రోజు రిలే నిరాహార దీక్షలు

నవతెలంగాణ-ఖమ్మం

తెలుగుదేశం పార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయంలో జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా రిలే నిరాహార దీక్షలో భాగంగా మంగళవారం 5వ రోజు ఖమ్మం పార్లమెంట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు పోట్ల నాగేశ్వరరావు, రిలే నిరాహార దీక్ష కు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్, ఉపాధ్యక్షులు కొండబాల కరుణాకర్, రాష్ట్ర మహిళా కార్యదర్శి చుండూరు రాజేశ్వరి, చెరుకూరి రమేష్ పాల్గొన్నారు.

ఆరెగూడెంలో సినిమా షూటింగ్ ప్రారంభం

నవతెలంగాణ-నేలకొండపల్లి

మండలంలోని ఆరెగూడెం గ్రామంలో శ్రీలక్ష్మి సమ్మక్క క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్మించబడుతున్న గోల్డ్ నెంబర్ వన్ చిత్రం షూటింగ్‌ను సోమవారం చిత్రీకరించారు. ఈ చిత్రం షూటింగును స్థానిక శ్రీ ఆంజనేయ స్వామి సన్నిధిలో పూజా కార్యక్రమం అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య చిత్రం క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిత్రం డైరెక్టర్, హీరోయిన్, నటీనటులు చిత్ర యూనిట్ సభ్యులు, నేలకొండపల్లి PACS చైర్మన్ కోటి సైదారెడ్డి, తునికిపాటి చారి, వడ్డే జగన్, పాల్గొన్నారు.

అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ఖమ్మం : అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, వారికి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి జి. రామయ్య తెలిపారు. మంగళవారం ఖమ్మంలోని రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఐఫ్టియు ఖమ్మం ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ,గత కొన్ని రోజులుగా అంగన్వాడి టీచర్స్ చేస్తూన్న సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు.అంగన్‌వాడీలకు మద్దతు ప్రకటించారు.

మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి 10 వేలు జరిమానా

వైరా : మద్యం సేవించి వాహనం నడిపిన కొణిజర్ల మండలానికి చెందిన గుడిమల్ల శ్రీనివాస్ అను వ్యక్తికి మధిర జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు మంగళ వారం 10 వేల జరిమానా విధించినట్లు వైరా ఎస్ఐ మేడా ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా కోర్టు కానిస్టేబుల్ డి నరసింహారావును అభినందించారు.

పారదర్శకంగా పదోన్నతులు, బదిలీలు

టీఎస్ యూటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

ఎనిమిదేళ్ల తర్వాత పదోన్నతులు, ఐదు సంవత్సరాల తర్వాత బదిలీలు చేపడుతున్న నేపథ్యంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అత్యంత పారదర్శకంగా పదోన్నతులు, బదిలీల జాబితాలు రూపొందించి అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, డీఈవో సోమశేఖరశర్మకు మంగళవారం విజ్ఞప్తి చేశారు. ఐడిఓసిలో కలెక్టర్, డీఈఓ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వి.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు బుర్రి వెంకన్న మాట్లాడారు. గతంలో అనేకసార్లు పదోన్నతులు నిరాకరించిన వారి పేర్లు జాబితాలో ఉన్నాయని నిబంధనల మేరకు అలాంటి వారిని తొలగించి పదోన్నతుల జాబితా తయారు చేయాలని సూచించారు. సీనియారిటీ జాబితాలలో అనేక తప్పులు చోటు చేసుకున్నాయన్నారు. ఉపాధ్యాయులు పదేపదే అప్పీల్స్ చేసుకోవాల్సి వస్తున్నది కాబట్టి అప్పీల్స్ అన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి, జాబితాలు విడుదల చేయాలని కోరారు. స్పౌజ్, ప్రిఫరెన్షియల్ క్యాటగిరీలు ఉపయోగించుకునేవారి వివరాలు క్షుణ్ణంగా పరిశీలించి, దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. నిబంధనల ప్రకారం జాబితాలు రూపొందించాలని కోరారు. అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలని కలెక్టర్ కు విన్నవించారు. మ్యూచువల్, స్పౌజ్ బదిలీల విషయంలో నిబంధనలు, కోర్టు ఉత్తర్వుల మేరకు వ్యవహరించాలని సూచించారు. పదోన్నతులలో నాట్ విల్లింగ్ ఆప్షన్ ఇవ్వాలని కోరారు. ఖాళీలన్నింటినీ చూపించాలని, గ్రీవెన్స్ కు మరొకసారి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయ సంఘాల సమన్వయ కమిటీ సమావేశ వివరాలు...

- హెచ్ఎం బదిలీ ప్రభుత్వ 14, జడ్పీ 99 మందికి బదిలీలు.
- ప్రధానోపాధ్యాయులు క్లియర్ వేకెన్సీస్ 66 (62o4)ఉన్నాయి.
- బదిలీలకు వచ్చిన దరఖాస్తులు 3766 రిజెక్ట్ అయినవి 87
- గ్రీవెన్స్ ద్వారా వచ్చిన దరఖాస్తులు 375 పరిష్కరించినవి 328, రిజెక్ట్ అయినది 47.
- మెడికల్ దరఖాస్తులు 207 రిజెక్ట్ అయినవి 31.

అ- ప్పీల్స్ కోసం రెండు రోజులు సమయం ఇచ్చారు.

- అప్పీల్ ను ఆన్లైన్ ద్వారానే స్వీకరిస్తారు.
- 93 మెడికల్ అప్లికేషన్ రీ ఎక్జామిన్ చేస్తారు.



- హైస్కూలు లో జీరో ఎన్రోల్మెంట్ ఉంటే ఎస్ఏలు పండిట్ లను చూపించరు. జీరో ఎన్ రోల్మెంట్ ఉన్న ప్రాథమిక పాఠశాలలను చూపించరు.
- స్కూల్ అసిస్టెంట్స్ ప్రమోషన్స్ లో నాట్ విల్లింగ్ ఆప్షన్ ఉంటుంది.
- అడక్వసి అమలులో ఉంటుంది. అన్ని క్యాడర్ల స్టేటస్ ప్రకటిస్తారు.
- మ్యూచువల్ వారికి బదిలీల తర్వాత అవకాశం ఇస్తారు.
- స్పౌజ్ కి దగ్గర ప్లేసుల్లో కోరుకునే వారు తప్పుడు సమాచారం ఇస్తే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటారు.

సీపీఐ(ఎం) సానుభూతిపరుడు వెంకయ్య మృతి

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రమైన ముదిగొండ గ్రామానికి చెందిన సిపిఐ(ఎం) సానుభూతిపరుడు కట్టకూరి వెంకయ్య(70) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం నాయకులు మందరపు వెంకన్న, మరలపాటి వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు వెంకయ్య మృతదేహాన్ని సందర్శించి పుష్పగుచ్చాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వెంకయ్య మృతికి సంతాపన్ని వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులకు వారు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుడు వెంకయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు కట్టకూరి సురేష్ ఎమ్మార్పీఎస్ మండల నాయకుడుగా కొనసాగుతున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) నాయకులు ఇరుకు నాగేశ్వరరావు, ఊటుకూరి నాగేశ్వరరావు, కట్టకూరి ఉపేందర్, ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి కొలికపొంగు వెంకట్రావుమాదిగ నాయకులు పులిపాటి ప్రకాష్ మాదిగ,వీరస్వామి మాదిగ, రామకృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి పిట్ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో నూతన పిట్ కమిటీ ఎన్నుకున్నట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ వైరల్ తెలిపారు. బుధవారం మణుగూరు ఏరియా హాస్పిటల్ నూతన పిట్ కమిటీని డీవైసీఎంఓ మేరీ కుమారికి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ సెక్రటరీ మాట్లాడుతూ 14వ మహాసభలలో అడ్వైజర్‌గా కామ్రేడ్ జీ.రామారావు, పిట్ సెక్రటరీగా కె.పద్మావతి, జాయింట్ సెక్రటరీగా గడ్డం రవికుమార్‌ని, ఆర్గనైజింగ్ సెక్రటరిలుగా మధు, ఈఎస్ విద్యాసాలి, సుధారాణి, బానోత్ రామారావు, జనరల్ షిఫ్ట్ ఇంచార్జ్‌గా ఉషారాణి, డెలిగేట్స్ గానాగజ్యోతి, ఏ.రాజేష్, బి.పవన్‌లు ఎన్నికైనట్లుగా పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఏరియా హాస్పిటల్‌లో తీవ్రజ్వరాలతో బాధపడుతున్న వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ ఆవుల నాగరాజు, ఆఫీస్ బేరర్ నంబూరి శ్రీనివాసరావు, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్స్ దాట్ల సందీప్ కుమార్, కోడి రెక్కల శ్రీనివాసరావు, జి.రామారావు, పద్మావతి, గడ్డం రవికుమార్, మధు కుమార్, ఎస్.విద్యాసాలి, సుధారాణి, రామారావు, ఉషారాణి నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ తునికి ఆకు బోనస్ వెంటనే చెల్లించాలి

- వ్యకాస జిల్లా కమిటీ సభ్యులు చంద్రయ్య



నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఎర్రటి ఎండలో చెట్టు, పుట్ట తిరుగుతూ విష పురుగుల కాటును సైతం లెక్క చేయకుండా తునికి ఆకు సేకరించిన కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ బోనస్ డబ్బులు వెంటనే అందజేయాలని వ్యవశాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో బట్టిగూడెం గ్రామానికి చెందిన తునికి ఆకు కార్మికులకు చెల్లించాల్సి బోనస్ డబ్బులు చెల్లించాలని కోరుతూ కార్మికులు అటవీ రేంజి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయం సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ.. 2016 నుండి 2021 వరకు తునికి ఆకు సేకరించిన సుమారు 60 మంది కార్మికులకు నేటికి బోనస్ చెక్కులు అందజేయ లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు కొర్సా చిలకమ్మ, మడకం లక్ష్మీ, పిసోడి ప్రభాకర్, సరియం ముత్యాలక్క, కొర్సా లక్ష్మయ్య, కల్లూరి మారయ్య, కుంజా లక్ష్మీ, మడకం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు

- పాల్గొన్న ఎమ్మెల్యే హరిప్రియ



నవతెలంగాణ-ఇల్లందు

పట్టణం, మండలంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమైయ్యాయి. కూరగాయల మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విఘ్నేశ్వర స్వామిని ఎంఎల్ఏ హరిప్రియ దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు, వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్ములపాటి వెంకటేశ్వర్ రావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీ పాషా, పట్టణ సీనియర్ నాయకులు ఎస్కే జానీ పాషా, అధ్యక్షుడు నాదెండ్ల శ్రీనివాస్ రెడ్డి, 18 వార్డ్ కౌన్సిలర్ పోబోలు స్వాతి కిరణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మనోహర్ తివారి, ఇల్లందు మండల కోఆప్షన్ సభ్యులు ఘాజి పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి 8 బస్సు షెల్టర్లు మంజూరు

నవతెలంగాణ-ఇల్లందు

దశాబ్దాలుగా మున్సిపాలిటీ పరిధిలో అనేక ఏరియాలలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది గురవుతున్నారు. విషయాన్ని పాలకవర్గం ఆధ్వర్యంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే 8 బస్ షెల్టర్లు మంజూరు చేయడం జరిగింది. బస్ షెల్టర్ల నిర్మాణం చేపడుతున్న క్రమంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర రావు పనులను పర్యవేక్షించారు. త్వరగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఒకటవ వార్డు కౌన్సిలర్ వారా రవి, తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల అడుగు జాడల్లో అతహార్...

- బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా



నవతెలంగాణ-ఆళ్ళపల్లి

ఇటీవల కాలంలో బీఆర్ఎస్ పార్టీకి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాజీనామా చేసి, కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తుమ్మల అడుగుజాడల్లో నడుస్తూ ఆయన అభిమాని, అనుచరుడైన ఆళ్ళపల్లి మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకులు మొహమ్మద్ అతహార్ సైతం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో తుమ్మల ఆళ్ళపల్లి, గుండాల మండలాల్లో చేసిన అభివృద్ధే పనులే ఆయన అభిమానిగా, ఆయన వెంట నడిచేలా నన్ను మార్చాయన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో అపార అనుభవం ఉన్న తుమ్మలకు బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం సముచిత స్థానం, తగిన గుర్తింపు ఇవ్వలేదని ఘాటుగా విమర్శించారు. తన రాజీనామాకు సైతం అదే ప్రధాన కారణంగా చెప్పుకొచ్చారు.

కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీలు పొర్లు దండాలు

- ప్రభుత్వం చర్చలకు చొరవ చూపాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్



నవతెలంగాణ-పాల్వంచ

అంగన్వాడీ టీచర్లు హెల్పర్లు భారీ ప్రదర్శనగా కలెక్టరేట్‌కి చేరుకుని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పొర్లు దండాలు పెట్టి సీఎం కేసీఆర్ అంగన్వాడీల సమస్యలు పై స్పందించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ సమ్మె 9 రోజులు కావస్తున్నా కేసీఆర్ ప్రభుత్వం దున్నపోతు మీద వాన కురిసిన సామెతలా నిర్లక్ష్యంగా ఉండటం దుర్మార్గం అని అన్నారు. అంగన్వాడీలు 48 ఏళ్లుగా గౌరవ వేతనం పేరుతో వెట్టి చాకిరీ చేస్తున్నారని, తెలంగాణ ప్రభుత్వం టీచర్ అని పేరు మార్చిందే కానీ శ్రమకు తగిన ఫలితం వేతనం ఇవ్వటం లేదన్నారు. కేసీఆర్ తక్షణం సమ్మె చేస్తున్న సంఘాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కే.జమలయ్య, గోనే మణి, భూక్యా లలిత, విజయ, సునీత, రూప, మాదవి, తదితరులు పాల్గొన్నారు.

మల్టీ స్పెషాలిటీ వైద్య క్యాంపుల నిర్వహణకు..

షెడ్యూల్ తయారు చేయాలి

- ఐటీడీఏలో కలెక్టర్ సమీక్షా సమావేశం



నవతెలంగాణ-భద్రాచలం

గిరిజన మారుమూల ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ వైద్య క్యాంపులు నిర్వహణకు షెడ్యూలు తయారు చేయాలని కలెక్టర్ ప్రియాంక అలా వైద్యాధికారులకు సూచించారు. మంగళవారం ఐటిడిఏ కార్యాలయంలో పీఓ ప్రతీక్ జైన్‌తో కలిసి ఆర్ఓఎఫ్ ఆర్, గిరిజన విద్య, గురుకుల, గిరిజన ఇంజనీరింగ్ విభాగం, అంగన్వాడీ భవనాలు, సియం గిరి వికాసం, యువజన శిక్షణా కార్యక్రమాలు, జీసీసీ, వైద్య ఆరోగ్య శాఖ తదితర ఐటీడీఏ ద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాలపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా శాఖల ద్వారా అమలు జరుగుతున్న పథకాల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణ చర్యల్లో భాగంగా వచ్చే వారం మల్టి స్పెషాల్టి వైద్య క్యాంపులు నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఆరోగ్య కేంద్రాలు నిర్వహణలో ఆరోగ్య పరిరక్షణకు ప్రజలు పాటించాల్సిన ఆరోగ్య నియయాలను వివరించాలని చెప్పారు. 102, 108 అంబులెన్సులు వెళ్లడానికి రహదారి సౌకర్యం లేని గ్రామాల జాబితా అందచేయాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. మంచినీటి సౌకర్యం లేని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల జాబితా అందచేయాలని చెప్పారు. ఐటిడిఏ ద్వారా నిర్వహిస్తున్న పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రతిపాదనలు అందచేయాలని గిరిజన సంక్షేమ శాఖ డిడిని ఆదేశించారు. ప్రభుత్వ భూములు అందుబాటులో లేని కారణంగా 15 గ్రామ పంచాయతీలకు భవనాలు నిర్మాణానికి స్థల సమస్య ఏర్పడిందని, వీటి నిర్మాణానికి అటవీశాఖ ద్వారా స్థల సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. ఐటిడిఏ కార్యాలయ ప్రాంగణంలో డిజిటల్ ల్యాబ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు అందచేయాలని చెప్పారు. 21 వైకుంఠధామాల్లో నీటి సరఫరా కల్పనకు చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రైకార్, యంఎస్ఎంఈ ద్వారా స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటుకు రుణాలు మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎల్డియంకు సూచించారు. రుణాలు మంజూరు ప్రక్రియపై బ్యాంకు కంట్రోల్సు సమావేశం నిర్వహణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. గిరిజన కళాకారులు తయారు చేసే హస్తకళలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. రైతు ఉత్పత్తి సంఘాలు ద్వారా రైతులు ప్రాసెసింగ్ ఏర్పాటుతో ఆదాయం పెంచే మార్గాలను అన్వేషణ చేయాలని చెప్పారు.

అనంతరం ఐటిడిఏ ప్రాంగణంలోని యూత్ ట్రైనింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులో ముఖాముఖి నిర్వహించారు. శిక్షణలో మెలకువలు నేర్చుకుని, ఉపాధి రంగంలో రాణించాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఫోటోలు దిగారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ మధుసూదన్ రాజు, సహకార అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, వెంకటేశ్వరచారి, ఆర్సిఓ డేవిడ్ రాజు, గిరిజన సంక్షేమ శాఖ డిడి మణెమ్మ, ఎస్ఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పరిసరాలను శుభ్రం చేయాలి : పీఓ



నవతెలంగాణ-భద్రాచలం

ఐటీడీఏ కార్యాలయంలో నివాసం ఉంటున్న గృహాల సముదాయంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకునే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్ అన్నారు. ఐటిడిఏ కార్యాలయంలోని సముదాయాలను ఆయన పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఐటిడిఏ కార్యాలయం సముదాయాలు చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. అలాగే చిన్నపిల్లలకు ఆటవిడుపుగా గతంలో ఏర్పాటు చేసిన ఆట స్థలాలను మెరుగుపరచాలని, ప్రస్తుతం ఖాళీగా ఉన్న క్వార్టర్లో విద్యార్థినీ, విద్యార్థులకు విద్యకు సంబంధించిన అవసరమయ్యే లైబ్రరీ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఐటిడిఏ కార్యాలయం పైన ఉన్న నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా ఉన్న దానిని తుదిమెరుగులు దిద్ది కార్యాలయం అవసరాల కొరకు ఉపయోగించుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని ప్రతి ఆట స్థలమును సర్వ సుందరంగా తీర్చిదిద్దాలని ఆయన అన్నారు. ముందుగా ఐటీడీఏ పరిసరాలను శుభ్రం చేయించాలని ఐటిడిఏ కార్యాలయానికి వచ్చే ప్రజలకు సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ, తదితరులు పాల్గొన్నారు.

చావో రేవో గూడెం ప్రజలతోనే..

- అభివృద్ధిలో రాష్ట్రంలోనే కొత్తగూడెం నెంబర్ వన్
- అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే



నవతెలంగాణ-పాల్వంచ

అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రంలో కొత్తగూడెం నియోజకవర్గం దూసుకుపోయి నెంబర్ వన్‌గా నిలుస్తుందని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం పాల్వంచ మున్సిపాలిటీలోని గిరిజన ప్రాంతాల్లో వనమా సుడిగాలి పర్యటన, పేటచెరువు, పిల్లవాగు, కొత్తూరు, గుడిపాడు, శ్రీనివాసపురం కాలనీ, కుంటి నాగులగూడెం ప్రాంతాల్లో పర్యటించారు. రూ.కోటి వ్యయంతో వైకుంఠధామం ప్రారంభోత్సవం, రూ.7 కోట్లతో అభివృద్ధి పనులకు వనమా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ గూడెం ప్రజలకు ఎల్లప్పుడూ తోడునీడగా ఉంటానని, తుది శ్వాస వరకు ప్రజాసేవలోనే కొనసాగుతానన్నారు. కేసీఆర్ లాంటి సీఎం దేశంలో మరొకరు లేరు అన్నారు. రూ.3000 కోట్లతో కొత్తగూడెం నియోజకవర్గంలో నేను చేసిన అభివృద్ధి ప్రజలు మర్చిపోరన్నారు. కొత్తగూడెం పాల్వంచకు కిన్నెరసాని జలాలను తీసుకువచ్చి అందిస్తున్నానని, మరలా గోదావరి జలాలను అందిస్తాం అన్నారు. ఓడినా, గెలిచినా కొత్తగూడెం ప్రజలతోనే ఉంటానన్నారు. వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నా చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను దశలవారీగా అమలుపరుస్తున్నా అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయ డంకా మోగించి, సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయం చెప్పారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో కొత్తగూడెం అభివృద్ధికి కోట్ల నిధులు, రాష్ట్ర చరిత్రలో కొత్తగూడెం పాల్వంచకు ఒకేసారి రూ.215 కోట్లు మంజూరు చేయించా అన్నారు.

అమలుగాని హామీలతో కాంగ్రెస్ పార్టీ గొబల్స్ ప్రచారాలతో ముందుకు వస్తుంది. వాళ్ల అధికారంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 46 లక్షల మందికి పెన్షన్స్ ఇస్తున్నాం, పట్టణ ప్రగతి పల్లె ప్రగతిలతో పట్టణాలను పల్లెలను తీర్చిదిద్దుతున్నాము చెప్పారు.

ఈ కార్యక్రమాల్లో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, ఏడీఈ మురళి, ఏఈ రాజేష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు మంతపురి రాజు గౌడ్, వర్కింగ్ అధ్యక్షులు ఎస్విఆర్కె ఆచార్యులు, సొసైటీ వైస్ చైర్మన్ కనకేష్, డైరెక్టర్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మల్లెల శ్రీరా మ్మూర్తి, ఆత్మ కమిటీ డైరెక్టర్ కాల్వ ప్రకాశరావు, నాయకులు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, వై.రమణమూర్తి నాయుడు, రాము, చిరంజీవి, సత్యనారాయణ, నవభారత్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి మైదానంలో జరుగుతున్న పనులపై విచారణ జరిపించాలి

- లక్షల రూపాయల ప్రజాధనం వృథా
- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్



నవతెలంగాణ-కొత్తగూడెం

అభివృద్ధి పేరుతో కొత్తగూడెం నియోజకవర్గంలో కోట్ల రూపాయల నిధులు పక్కదారి పడుతున్నాయని, అందుకు ప్రగతి మైదానంలో జరుగుతున్న పనులే నిదర్శనమని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆరోపించారు. మున్సిపల్ పరిధిలోని ప్రగతి మైదానంలో జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ సింథటిక్ ట్రాక్ పేరుతో గత కొన్ని నెలలుగా ఇక్కడ పనులు జరుగుతున్నాయని అన్నారు. సర్వాంగ సుందరంగా ఉన్న ప్రగతి మైదానంపై ఎమ్మెల్యే వనమాకు, మున్సిపల్ పాలక పక్షానికి కళ్ళు కుట్టినట్టు ఉందని ఆరోపించారు. ఉదయం, సాయంత్రం పూట వాకర్స్, క్రీడాకారులతో కలకలలాడే ప్రగతి మైదానం రూపురేఖలు లేకుండా పోయిందని అన్నారు. మున్సిపాలిటీకి గ్రౌండ్ ఉండాలని ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ప్రగతి మైదానంలో అభివృద్ధి పనుల పేరిట ఎక్కడికక్కడ గుంతలు తవ్వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రౌండ్ చుట్టూ నాసిరకపు మెటీరియల్ వాడుతూ పనులన్నీ లోపభూయిష్టంగా జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రగతి మైదానంలో అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులు ఎన్ని...? కాంట్రాక్టర్ ఎవరు...? ఎన్ని రోజుల్లో పనులు పూర్తవుతాయని..? ప్రశ్నించారు. ఈ మొత్తం తతంగంపై కలెక్టర్, అధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. నాణ్యతకు తిలోదకాలు ఇచ్చి ఇష్టారాజ్యాంగ నిర్మాణాలు చేపడుతూ కాలయాపన చేస్తున్న సదరు కాంట్రాక్టర్‌ను తక్షణమే బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున్ రావు, పట్టణ అధ్యక్షుడు వంగా రవిశంకర్, సందెలా సందీప్, తాటిపాముల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గరిమెళ్ల వెంకటేశ్వరరావు 33వ వర్ధంతి



నవతెలంగాణ-దమ్మపేట

మండల పరిధిలోని శ్రీరాం పురం గ్రామంలో సీపీఐ(ఎం) నాయకులు అమరజీవి కామ్రేడ్ గరిమెళ్ళ వెంకటేశ్వరరావు 33వ వర్ధంతి సభ మోరంపూడి కేశవరావు అధ్యక్షతన జరిగింది. తొలుత గరిమెళ్ళ స్మారక స్థూపం వద్ద పార్టీ జెండాను సీనియర్ నాయకుడు యంద్రాతి అప్పారావు ఎగురవేశారు. చిత్ర పటానికి మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు పూలమాలవేశారు. స్మారక స్థూపంనకు కుమారుడు గరిమెళ్ళ శ్రీరామ మూర్తి నివాళి అర్పించి, పూలదండ చేశారు. తరువాత జరిగిన సభలో జిల్లా కమిటీ సభ్యులు. దొడ్డా లక్ష్మినారాయణ, మండల కార్యదర్శి మాట్లాడుతూ గరిమెళ్ళ ఆనాటి పెత్తందారీ విధానాలకు, భూస్వాములు, జమీందారులకు, వారి దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పేదప్రజలు, రైతుల, వ్యవసాయ కార్మికుల, ఆదివాసిలు దళితులు, బలహీనవర్గాల వారి సమస్యల పరిష్కారం కోసం మిలిటెంట్ పోరాటాలు చేశారు. మార్క్సిస్టు పార్టీ అభివృద్ధికి తన ప్రాణం ఉన్నంత వరకు కృషి చేశారని కొనియాడారు. ఈ సభలో మోరంపూడి సూర్య నారాయణ, రామ మోహన రావు, పర్వతనేని కాంతారావు, వుసికల రామకృష్ణ, షేక్ జాన్ పాష, కాటయ్య, నాగేశ్వరరావు, రామారావు, బ్రహ్మం, నరసింహారావు, గ్రామస్తులు దొడ్డాప్రసాదు, వల్లభనేని భద్రరావు, మోరంపూడి వెంకటేశ్వరావు, గరిమెళ్ళ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు మృతి

నవతెలంగాణ-సుజాతనగర్

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే మండలంలోని రాఘవపురం గ్రామానికి చెందిన ఎనుముల వీరకృష్ణ పని నిమిత్తం సోమవారం రాత్రి కొత్తగూడెం బయలుదేరాడు. ఖమ్మం-భద్రాచలం రాష్ట్రీయ రహదారి గోధుమ వాగు పై నిర్మిస్తున్న వంతెన దగ్గర మూలమలుపులో వాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. ఉదయం అటువైపు వెళుతున్న వాహనదారులు చూసి స్థానికులకు సమాచారం అందించారు. బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వలన ప్రమాదం జరిగిందని స్థానికులు అనుకుంటున్నారు. ఇకనైనా సదరు కాంట్రాక్టు నిర్మాణం జరిగే ప్రదేశాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆదాయ వ్యయాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-అశ్వారావుపేట

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో లీడ్ బ్యాంకు వారి ఆధ్వర్యంలో విడ్స్ ఎన్జీవో సభ్యులు ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్స్ వి.అంజి బాబు, డి.చంటిలు మండలంలోని కావడిగుండ్ల పంచాయతీ గవర్నర్ దత్తత గ్రామమైన గోగుల పుడిలో ఆర్థిక అక్షరాస్యత పై మంగళవారం అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ రామకృష్ణ, గ్రామ దీపిక భాగ్య లక్ష్మి, డ్వాక్రా మహిళలు, గ్రామపంచాయతీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

ఆమ్ బజార్లో పగిలిన మంచినీటి పైప్ లైన్

- కూరగాయల మార్కెట్, బట్టల షాపుల్లోకి భారీగా వరద నీరు
- సందర్శించి సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే హరిప్రియ



నవతెలంగాణ-ఇల్లందు

ఓటు వేసి తనను ఎన్నుకున్న ప్రజల కష్టాలను గుర్తిస్తూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతిరోజు ఎమ్మెల్యే హరి ప్రియ హరి సింగ్ అడుగులు వేస్తున్నారు. తనపై నమ్మి అప్పగించిన బాధ్యతను మరవకుండా ఇల్లందు నియోజకవర్గంలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా త్వరితగతిన పరిష్కరిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని ఆమ్ బజార్లో మంచినీటి పైప్ లైన్ పగిలిపోయి భారీగా వరద నీరు కూరగాయల మార్కెట్‌లోకి, బట్టల షాపుల్లోకి రావడంతో అంతా జలమయమైంది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ ప్రాంతాన్ని సందర్శించారు. పైప్ లైన్ పగిలిన తీరును గమనించారు. షాప్ యజమానులతో మాట్లాడారు. పైప్లైన్ మరమత్తుల కోసం మిషన్ భగీరథ ఎస్ఈతో మాట్లాడి త్వరత గతిన పైప్ లైన్ మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. దీంతో మిషన్ భగీరథ అధికారులు మంగళవారం మధ్యాహ్నం వరకు మరమ్మతులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యేకు విన్నవించారు.

డ్రయినేజీ లేకపోతే రోడ్డు పైకి మరింత వరద...తప్పిన ఇబ్బందులు

గతంలో ఎమ్మెల్యే హరి ప్రియ నాయక్ ఆమ్ బజార్ వేయించిన డ్రైనేజీ నేడు ఆ ప్రాంత వాసులను ఆదుకుంది. పగిలిన పైపై నుంచి నీరు ప్రవాహంగా వస్తు డ్రైనేజీలోకి వెళ్లడంతో ఆ ప్రాంతంలోని షాపుల యజమానులకు చాలావరకు ప్రమాదం, ఇబ్బందులు తొలిగాయి. ఆనాడు ముందు చూపుతో ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ చేసిన పనిని గుర్తు తెచ్చుకొని కొనియాడుతున్నారు. ఎంఎల్ఏ హరిప్రియ వెంట మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ జానీ పాషా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్.కె జానీ బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నాదెండ్ల శ్రీనివాస రెడ్డి,18వార్డ్ కౌన్సిలర్ పాబోలు స్వాతి కిరణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మనోహర్ తివారి, మండల కో ఆప్షన్ సభ్యులు ఘాజీ, ఇల్లందు పట్టణ ప్రచార కార్యదర్శి, సోషల్ మీడియా ఇన్చార్జి రాజేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న చేయూత ట్రస్ట్



నవతెలంగాణ-బూర్గంపాడు

మండల పరిధిలోని మోరంపల్లి బంజర గ్రామంలో పంచాయతీ వార్డు మెంబర్, చేయూత ట్రస్ట్ మెంబర్ శనగ మల్లేశ్వరరావు అనే వ్యక్తి గత 20 రోజుల క్రితం పాల్వంచలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. రెండు నెలలు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించడంతో సమాచారం తెలుసుకున్న మోరంపల్లి బంజర గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ మంగళవారం వారి నివా సానికి వెళ్లి గాయపడిన మల్లేశ్వరరావును పరామర్శించారు. ఈ క్రమంలో రూ.12 వేలు ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలి

- మండల అభివృద్ధి అధికారి ముత్యాలరావు



నవతెలంగాణ-దుమ్ముగూడెం

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పై అవగాహన కలిగి ఉండడంతో పాటు 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి ముత్యాలరావు తెలిపారు. మంగళవారం దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వై మల్లికార్జునారావు అధ్యక్షతన ఓటు హక్కు పై మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సందీప్, విద్యార్థినీ, విద్యార్థులకు ఈఎల్‌సి మెంబర్ వై మల్లిఖార్జునరావు, కె.బాబురావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లెల శ్రీనివాస్, అధ్యాపకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నిరసనకు సీపీఐ(ఎం) సంఘీభావం



నవతెలంగాణ-బూర్గంపాడు

తెలుగుదేశం పార్టీ చేపట్టిన నిరసనకు సీపీఐ(ఎం) మండల కమిటీ సంఘీభావం తెలిపింది. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో సారపాక సెంటర్ వద్ద నిర్వహిస్తున్న నిరసన దీక్షకు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపి, మాట్లాడారు. రాజకీయాలతో వ్యక్తిగత కక్షలు మంచివి కావని ఆయన అన్నారు. చంద్రబాబు నాయుడు పేరు ప్రతిష్ట ఉన్న వ్యక్తిని ఆధారం లేని కేసులను అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టును చూస్తుంటే కచ్చితంగా దాని వెనక బీజేపీ పెద్దలు ఉన్నారని స్పష్టమవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాపినేని సరోజన, పాండవుల రావణాసు, రాయల వెంకటేశ్వర్లు, కందుకూరి నాగేశ్వరావు, సాధిక, మీనా, పాల్గొన్నారు.

పేదల గుడిసెల తొలగింపు చర్యలు అన్యాయం

- బాధితులకు కాంగ్రెస్, సీపీఐ(ఎం) అండగా ఉంటాయి
- జెడ్పీ చైర్మెన్ కోరం, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నబీ



నవతెలంగాణ-ఇల్లందు

మండలంలోని బాలాజీ నగర్ గ్రామ పంచాయతీలో గల రెవెన్యూ భూమిని గతంలో పేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు తొలగించడం అన్యాయమని జెడ్పీ చైర్మెన్ కోరం కనకయ్య మండల కార్యదర్శి నబీ పేర్కొన్నారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధితుల సమస్యను మాజీ ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మెన్ కోరం కనకయ్య, సీపీఐ(ఎం)కి మంగళవారం కలుసుకుని విన్నవించుకున్నారు. వెంటనే స్పందించి ఘటనా స్థలికి చేరుకుని బాధితులకు పార్టీ తరుపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడారు. భూములు సింగరేణి సంస్థకు కేటాయించగా, అట్టి భూమిని గత సంవత్సరం క్రిందట సింగరేణి సంస్థ గ్రామ పంచాయతీకి కేటాయించింది. అట్టి భూమిలో స్థానిక గ్రామ పంచాయతీకి చెందిన నిరుపేద వృద్ధ కుటుంబాలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని అన్నారు. తహశీల్దార్, సీఐ గుడిసెల నిర్మాణ స్థలాన్ని పరిశీలించి రెవెన్యూ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టరాదని, అట్టి గుడిసెలను తక్షణమే కాళీ చేయాలని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాయం స్వాతి, సీపీఐ(ఎం) మండల సెక్రెటరీ నభి, మోహనరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మడుగు సాంబమూర్తి, తాటి బిక్షం, బానోత్ శారదా, కృష్ణ, హరినాథ్ బాబు, శెట్టి రవి, మధారమ్మ, రావూరి సతీష్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సంఘంకు హెచ్చరిక : సీఐటీయూ

నవతెలంగాణ-కొత్తగూడెం

బొగ్గు గని కార్మికులు 11వ వేతన ఒప్పందం జూన్ నెల నుండి అమలవుతున్న తరుణంలో అడ్డుకునేందుకు అధికారుల సంఘం జబల్పూర్ హైకోర్టులో కేసు వేసినందుకు కోర్టు మొట్టికాయలు వేసిందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు పేర్కొన్నారు. అధికారులు మరల కోర్టును ఆశ్రయించారు. దీనికి అంతటికి కారణం సిఐటియు మొదటి నుంచి చెబుతున్నటువంటి డీపీ గైడ్‌లైన్స్ కేంద్ర ప్రభుత్వం సరి చేయకుండా ఉండటమేనని అన్నారు. రుద్రంపూర్ ఏరియాలోని పివికే-5 మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఈ విషయంపై పదేపదే సిఐటియు ప్రతి సమావేశంలో చెప్పినా కూడా కొన్ని సంఘాల వారు వీటి గురించి మాట్లాడాల్సిన అవసరం లేదని ఖండిస్తూ వచ్చారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని డిపి గైడ్‌లైన్స్‌ను సవరించాలని పేర్కొన్నారు. గతంలో డిపి గైడ్‌లైన్స్ ఆటంకం కాదని చెప్పిన వారు కూడా ఇప్పుడు కళ్ళు తెరిచి దేశవ్యాప్తంగా అక్టోబర్ 5, 6, 7 తేదీలలో సమ్మె చేయటానికి 5 జాతీయ కార్మిక సంఘాలు ఐక్యంగా పిలుపు నివ్వడం గమనార్హమన్నారు. బొగ్గు గని కార్మికుల జీతాల విషయాలలో ఎలాంటి ఆటంకం భవిష్యత్తులో కల్పించిన రాబోయే కాలంలో కార్మికుల ఆగ్రహానికి గురవుతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్, వై. వెంకటేశ్వరరావు, గడల నరసింహారావు, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒకే పేరుతో ఉన్న రెండు ఓట్లు తొలగించండి

- కాంగ్రెస్ నాయకులు జారే ఆదినారాయణ



నవతెలంగాణ-అశ్వారావుపేట

ఒకే పేరుతో రెండేసి ఓటర్లుగా నియోజక వర్గం మొత్తం 458 ఓటర్లను గుర్తించామని వాటిని తొలిగించి ఒకరికి ఒకే ఓటరు గుర్తిస్తూ ఓటరు జాబితాను సరి చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గం నాయకులు జారే ఆదినారాయణ మండల ఎన్నికల అధికారి తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్ కోరుతూ మంగళవారం వినతి పత్రం అందజేసారు. అశ్వారావుపేట మండలం 113, దమ్మపేట మండలం 142, ములకలపల్లి మండలం 74, అన్నపురెడ్డిపల్లి మండలం 43, చంద్రుగొండ మండలం 86, నియోజకవర్గ స్థాయిలో మొత్తం 458 ఓట్లు ఓటరు జాబితాలో డబుల్ పేర్లు ఉన్నాయని, పూర్తి స్థాయిలో పరిశీలించి తొలగించ గలరని జారే ఆయన్ను కోరారు. ఎన్నికల అధికారి దానికి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జూపల్లి రమేష్, స్థానిక సర్పంచ్ అట్టం రమ్య, నండ్రు రమేష్, ఆళ్ళ సత్తిబాబు, పల్లేల రామ లక్ష్మయ్య, ఫణి నాగు, తరుణ్ తేజ, నాగ కిషోర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి కారం సంజీవయ్య ప్రథమ వర్ధంతి

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి రిటైర్డ్ సూపర్ వైజర్ కారం సంజీవయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎం) మండల కమిటీ అధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. తొలుత వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జిల్లా నాయకులు కూకట్ల శంకర్ అధ్యక్షతన జరిగిన సభలో అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడుతూ మంచి కమ్యూనిస్టు కారం సంజీవయ్య వర్ధంతి సందర్భంగా వారికి నివాళి అర్పించడం అంటే ఆయన నడిచిన బాటలో మనం నడిచి నపుడే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మన్యం మోహన్ రావు, సుల్తానా, తాళ్లూరి పద్మ, ఎస్ విజయ కుమార్, వరంగంటి రాజ మొగిలి, కామ నాగరాజు, రాందాస్, నర్సయ్య, నాగమ్మ, కుమారి, శ్రీనివాస్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్



నవతెలంగాణ-పాల్వంచ

వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు స్నేహపూర్వక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆకాంక్షించారు. వినాయక చవితిని పురస్కరించుకొని పాల్వంచ పట్టణంలోని గాంధీనగర్ యూత్ అధ్వర్యంలో, వనమా కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్దకు కుటుంబ సమేతంగా వెళ్లి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. సర్వ మతాలకు గౌరవం ఇస్తూనే స్నేహపూర్వక వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని కోరారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాలలో ప్రతి ఒక్కరు భక్తి ప్రపత్తులతో పూజలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కోళ్ళపూడి ప్రవీణ్ కుమార్, అనిత, కేతిని కుమారి, పద్మ, భూక్యా సరోజిని తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన విప్ రేగా

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు సబ్ డివిజన్‌లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని ఎస్బిఐ సెంటర్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు ప్రారంభమైనాయి. విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేశారు. తొలిత నిర్వాహకులు అర్చకులు, సకల మర్యాదలతో స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు. వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. మణుగూరు సింగరేణి జీఎం దుర్గం రామచందర్ ఆధ్వర్యంలో భారీ మట్టి వినాయకునితోఈ ఉత్సవాలు ప్రారంభించారు. మండలం, మున్సిపాలిటీ పరిధిలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. డీఎస్పీ ఎస్వి రాఘవేంద్రరావు, సీఐ పి.బాలాజీ వరప్రసాద్, ఎస్ఐ రాజ్ కుమార్, సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు

32 గ్రామాలలో బీఎస్ఎన్ఎల్ 4జీ సెల్ టవర్స్ నిర్మాణం

- కలెక్టర్ ప్రియాంక అలా



నవతెలంగాణ-పాల్వంచ

బిఎస్ఎన్ఎల్ ద్వారా జిల్లాలో సెల్ సిగ్నల్ కవరేజ్ లేని 32 గ్రామాలలో బిఎస్ఎన్ఎల్ 4జీ సెల్ టవర్స్ నిర్మించనున్నట్లు కలెక్టర్ డా.ప్రియాంక అలా తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో నెట్ వర్క్ లేని గ్రామాల్లో సెల్ టవర్ల నిర్మాణంపై బీయస్ఎన్యల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సెల్ టవర్ల నిర్మాణానికి గుర్తించిన గ్రామాల నుండి 2 గుంటల భూమి టవర్స్ నిర్మించుటకు కేటాయింపు చేయాలని, బీఎస్ఎన్ఎల్ అధికారులను కోరారు. జిల్లాలో 26 గ్రామాలలో రెవిన్యూ అధీనంలోని గ్రామం నుండి 2 గుంటల భూమిని కేటాయిచడం జరిగుతుందని చెప్పారు. 6 గ్రామాలు వ్యవసాయ శాఖ పరిధిలో ఉండడం వలన వ్యవసాయ అధికారులతో మాట్లాడి త్వరలో భూమి కేటాయింపు అయ్యేలా చర్యలు తీసుకుంటామనని చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్వో రవీంద్ర నాథ్, బీఎస్ఎన్ఎల్ డీజీఎం నవీన, ఏజీఎం శ్రీనివాసరావు, ఎస్ డీఈ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై నిర్బంధం కేసీఆర్ నియంతృత్వానికి పరాకాష్ట

- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు
- అంగన్వాడీల సమ్మెకు సంపూర్ణ మద్దతు









నవతెలంగాణ-పాల్వంచ

నిత్యం ప్రజల్లో వుంటూ గర్భిణీలకుకు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ ఆరోగ్యవంతమైన తెలంగాణను నిర్మిస్తున్న అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తూ పరిష్కారం చేయకుండా సమ్మెపై నిర్బంధం ప్రయోగించడం కెసిఆర్ పరాకాష్ట అని వామపక్ష నాయకులు, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్ రావు, తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు కల్యాణం లక్ష్మీపతి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కామేష్, ప్రజపంథా సబ్ డివిజన్ కార్యదర్శి టీజేఎస్ నాయకులు బరగడి దేవదానం, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ చరప పాపారావు, వృత్తి దారుల జిల్లా కార్యదర్శి ముసలయ్యలు అన్నారు. అంగన్వాడీ టీచర్ల సమ్మె 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డా రవికుమార్ అధ్యక్షతన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. పలువురు మాట్లాడుతూ స్వరాష్ట్రం ఏర్పడ్డాక బారాస ప్రభుత్వంలో శ్రమ దోపిడీ ఇంకా ఎక్కువ అయిందని, ప్రభుత్వ శాకలన్నింటిలోనూ నిత్యం రాష్ట్రంలో ప్రతి చోట ఉద్యోగులు, శ్రామికులు వారి కనీస హక్కులకై పోరాటం చేయాల్సి వస్తుందని అన్నారు. ప్రభుత్వం ఇకనైనా వీరి సమస్యలను తీర్చకపోతే అవుసరమైతే అఖిలపక్షం మొత్తం అంగన్వాడీలకు మద్దతుగా ప్రత్యక్ష పోరాటానికి కూడా సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షులు ఎస్.కె రహీం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నుకల రంగారావు, టీడీపీ నాయకులు పూర్ణచందర్ రావు, ఏఐటీయూసీ నాయకులు బండి నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) నాయకులు ఎస్.కె నిరంజన్, తులసిరామ్, ఐద్వా నాయకురాలు కాంతి అంగన్వాడీ నాయకులు వెంకటరమణ, రమ్య, రాజ్యలక్ష్మి, అచ్చమ్మ మంజు, విజయ, తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ ఈ సమ్మెకు సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించి, మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తరపున తమ మద్దతు ఉంటుందని, రేపు అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీ అని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేది కాంగ్రెస్ పార్టీ అని అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు, మండల అధ్యక్షుడు కొండం వెంకన్న గౌడ్, బత్తుల వెంకటేశ్వరరావు తదతరులు పాల్గొన్నారు.

భద్రాచలం రూరల్ : అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం కళ్ళ తెరిపించాలని కోరుతూ వినాయక విగ్రహానికి మంగళవారం మెమోరండం అందజేశారు. భద్రాచలంలో సమ్మెను సీఐటీయూ కన్వీనర్ ఎం.బి.నర్సారెడ్డి ప్రారంబించి మాట్లాడారు. ఐసీడీఎస్‌లో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లకు మినీ టీచర్లకు హెల్పర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ చట్టాన్ని అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్కు రూ.10 లక్షలు, హెల్పర్‌కు రూ.5 లక్షలు ప్రకటించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అయిన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు ఎన్.నాగరాజు, జి.లక్ష్మీకాంత్, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు నాయకులు ఝాన్సీ, అనురాధ, అధ్యక్ష, కార్యదర్శులు లలిత, విజయలక్ష్మి మినీ అంగనవాడీ టీచర్స్, నాయకులు మీడియం సావిత్రి, జ్యోతి, రాజేశ్వరితో పాటు మండలంలోని అంగన్వాడీ టీచర్లు మినీ టీచర్లు హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం : అంగన్వాడీలు గత 9 రోజులుగా చేస్తున్న న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దిగివచ్చి పరిష్కరించకపోతే ఈ సమ్మెను ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి డి.వీరన్న ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా దశల వారి పోరాటాలకు పిలుపునిస్తూ దీక్షా శిబిరం వద్ద రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి వీరన్న పాల్గొని మాట్లాడారు. బుధవారం కొత్తగూడెం ఎమ్మెల్యే ఇంటి ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా 22, 23 తేదీలలో అన్ని జిల్లా కేంద్రాల్లో సామూహిక దీక్షలు చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సంఘం నాయకులు పద్మ, కళావతి, మాధవి, శైలజ, జుబేదా, నర్సం భాగ్య, సరోజ, రమ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ళపల్లి/గుండాల : అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వ పతనం తప్పదని సీఐటీయూ ఆశా వర్కర్ల యూనియన్, మధ్యాహ్న భోజన పథకం సంఘాల నాయకులు, ఎస్టీ హాస్టల్ డైలీ వేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ల నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు ఆళ్ళపల్లి, గుండాల మండల కేంద్రాల్లో అంగన్వాడీల సమ్మె శిబిరంలో వినాయక చవితి పండుగ రోజు కూడ పస్తులు ఉండాలా.. అని మూతికి గుడ్డ కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం పాయం సారమ్మ అధ్యక్షతన జరగగా సభలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఈసం వెంకటమ్మలు హాజరై, మాట్లాడారు. ఈ అంగన్వాడీల సమ్మెకు ఆళ్ళపల్లి, గుండాల మండలాల ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన సంఘం నాయకులు నజ్మా, నర్సమ్మ, ముత్యాలు, పొంబోయిన లక్ష్మీ, హాస్టల్ డైలీ వేజ్ నాయకులు కొట్టెం బాలయ్య పూర్తి మద్దతు తెలిపి, సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జవ్వాజి పద్మ, పూనెం సుజాత, జయశ్రీ, మమత, దనమ్మ, పూలమ్మ వెంకటమ్మ, కౌసల్య, నీలిమ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు ప్రజాపంథా సంపూర్ణ మద్దతు

గుండాల మండల కేంద్రంలో అంగన్వాడీ టీచర్లు, అంగన్వాడీ హెల్పర్లు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు మంగళవారం సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ సంపూర్ణ మద్దతును తెలియజేసింది. ఈ సందర్భంగా పాయం సారమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ శాసనసభ్యులు గుమ్మడి నర్సయ్య, హైకోర్టు న్యాయవాది గోవర్ధన్, ప్రజాపంథా రాష్ట్ర నాయకులు నాయిని రాజు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ టీచర్లు, అంగన్వాడీ హెల్పర్లు గత తొమ్మిది రోజులుగా సమ్మె కొనసాగిస్తున్నారని, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పూనుకోవాలని, లేనియెడల సమ్మెను ఉదతపరచడానికి మద్దతుగా నిలబడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అధికారి శర్మ, ప్రజాపంథా జిల్లా నాయకులు ఈసం శంకర్, బుర్ర వెంకన్న, బోస్, వాంకుడోత్ అజయ్, మండల కార్యదర్శి కొమరం శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు : బూర్గంపాడు మండల కేంద్రంలో అంగన్వాడి టీచర్లు, హెల్పర్ల జాయంట్ యాక్షన్ కమిటీ అధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారంకు 9 రోజులకు చేరుకుంది. సుప్రీం కోర్ట్ తీర్పు ప్రకారం అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేయాలని, చట్టపరమైన హక్కులు కల్పించాలని తదితర సమస్యలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జిలకర పద్మ, జిల్లా కాంగ్రెస్ పీసీసీ సభ్యులు డాక్టర్ చందా సంతోష్, తాళ్ళూరి చక్రవర్తి, బట్టా విజయ్ గాంధీ వాసుదేవరావు, నాగమణి, సుజాత, పులపెల్లి సుధాకర రెడ్డి, నాగరాజు, సాంబ సమ్మెకు మద్దతు తెలియజేశారు. సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు రాయల వెంకటేశ్వర్లు, రామనాథం, నాగేశ్వరావు, సిఐటీయూ మండల కన్వీనర్ బర్ల తిరుపతిరావులు, అంగన్వాడీల సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీల యూనియన్ నాయకులు డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని బత్తుల, విజయ్ గాంధీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో 150 మంది అంగన్వాడి టీచర్లు ,హెల్పర్లు పాల్గొన్నారు.

అశ్వారావుపేట : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం వెంటనే జీవో ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య డిమాండ్ చేసారు. మినీ అంగన్వాడీ కేంద్రాలకు హెల్పర్‌లను నియమిస్తూ నోటిఫికేషన్ ఇచ్చేలా ప్రభుత్వానికి కళ్ళు తెరిపించే విధంగా నిరసనలు చేపట్టాలని ఆయన మంగళవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, సిఐటియు నాయకులు పిట్టల అర్జున్, కాంగ్రెస్ నాయకులు ఆదినారాయణ, జూపల్లి రమేష్, సర్పంచ్ అట్టం రమ్య, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు నాయకులుతో పాటు మండలంలోని అంగన్వాడీ టీచర్లు, మినీ టీచర్లు హెల్పర్లు సంపూర్ణంగా సమ్మెలో పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, గ్రాడ్యుటి అమలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంపు మరియు ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షులు పులి సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 9వ రోజు దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి అంగన్వాడీలకు సంఘీభావం తెలిపి, మాట్లాడారు. తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు గత తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపో వడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు కమలాదేవి, గజలక్ష్మి, కృష్ణవేణి, సృజన, రమణ, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సమ్మెకు మద్దతు ప్రకటించిన అఖిల పక్ష పార్టీలు

ఇల్లందు : తహశీల్దార్ కార్యాలయం వద్ద గత 9 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు కోసం నిరవధిక సమ్మె చేస్తున్న క్రమంలో అఖిల పక్ష పార్టీలు మంగళవారం సందర్శించి సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. అంగన్వాడి టీచర్స్ కే.మరియ, నాగలక్ష్మిల అధ్యక్షతన జరిగిన సభలో ఏఐటియూసి దేవరకొండ శంకర్, సీపీఐ(ఎం) అబ్దుల్ నబి, సీపీఐ బంధం నాగయ్య సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ ఆవునూరి మధు, న్యూ డెమొక్రసీ జే.సీతా రామయ్యా, తుపాకుల నాగేశ్వర రావు, ఐఎఫ్టియు రాసుద్దిన్, జిల్లా కార్యదర్శి సారంగపాణి, యాకన్న, రమేష్, కాంగ్రెస్ డా.రవి, పులి సైదులు, గుడివాడ వీరభద్రం, కమల, బీఎస్ గోపాల్, టీడీపీ ముద్రగడ వంశీ, సీహెచ్ రమేష్, సీఐటీయూ కూకట్ల శంకర్, తదితరులు రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈసం వెంకటమ్మ, మమత, ఫాతిమా, రాంబాయి, అరుణ దేవేంద్ర కారం పద్మ సుజాత పాల్గొన్నారు.

అంగన్వాడీ సిబ్బంది సమ్మెకు ఏవీఎస్పీ మద్దతు

చర్ల : 9 రోజులుగా అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ టీచర్లు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ మంగళవారం సంపూర్ణ మద్దతు తెలియజేసింది. ఆ సంఘం రాష్ట్ర నాయకులు పొంద్రు హేమ చందర్, నూప నాగేశ్వరరావు, శ్రీను తదితరులు చర్ల అంబేద్కర్ సెంటర్లో గల అంగన్వాడీ సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతును తెలియజేసి, మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పుని తెలంగాణ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని టీచర్‌కు రూ.10 లక్షలు, హెల్పర్‌కు రూ.5లక్షలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు ఏవీఎస్పీతోపాటు ఇతర ఆదివాసి సంఘాల మద్దతును కూడా కూడగడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు శ్యామల వెంకటేశ్వర్లు, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షులు పాలెం నాగమణి, ఎం.విజయశీల, ప్రాజెక్టు కమిటీ నాయకులు పాల్గొన్నారు.

సమ్మె చేస్తున్న సంఘాలతోటి ప్రభుత్వం చర్చలు జరపాలి

గత తొమ్మిది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీ టీచర్లు మినీ టీచర్లు హెల్పర్ల సమస్యలపై సమ్మెకు నాయకత్వం వహిస్తున్న సంఘాలతోటి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని అంగన్వాడీ సమ్మెకు మద్దతుగా చర్ల సిఐటియు కార్యాలయంలో జరిగిన రాజకీయ పార్టీలు ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు చర్ల ప్రాజెక్టు కార్యదర్శి ఎం.విజయశీల అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కారం నరేష్, బహుజన సమాజ్వాది పార్టీ జిల్లా కార్యదర్శి తడికల శివకుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి, వ్యకాస మండల కార్యదర్శి బందెల చంటి, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ మండల కార్యదర్శి శ్యామల, సమ్మక్క, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మండల నాయకురాలు సుజాత, ఐకెపి వివోఏల సంఘం మండల నాయకులు పాయం రవి పాల్గొని మాట్లాడారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి సిఐటియు మండల కన్వీనర్ పాయం రాధాకుమారి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు శ్యామల వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు తాళ్లూరి కృష్ణ, నాయకులు సత్రంపల్లి సాంబశివరావు, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు చర్ల ప్రాజెక్టు కమిటీ నాయకురాలు పాలెం నాగమణి, స్వరూప, విజయలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలి

- కలెక్టర్ ప్రియాంక అలా



నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి కొలువై ఉన్న ప్రదేశానికి రాష్ట్రం నుంచి కాక ఇతర దేశాల నుంచి గణేష్ నిమజ్జనం చేయడానికి భక్తులు వస్తుంటారని వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవలసిన బాధ్యత మన పైన ఉందని కలెక్టర్ ప్రియాంక అలా అన్నారు. మంగళవారం గణేష్ నిమజ్జనం చేసే ప్రదేశాలను ఆమె ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండుగ అయిన మూడో రోజు నుంచి వినాయక ప్రతిమలు గోదావరిలో నిమజ్జనం చేయడానికి భక్తులు వస్తారని వారి కోసం ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. చివరి రోజు చాలామంది భక్తులు వస్తున్నందున నిమజ్జనం చేసే చోట భారీకేట్లు నిర్మించాలని అలాగే క్రేన్లు, గజ ఈత గాళ్లను సిద్ధం చేసుకోవాలని, గోదావరి బ్రిడ్జిపై నుంచి వచ్చే వాహనాలు అలాగే చర్ల, కూనవరం నుంచి వచ్చే వాహనాల కోసం ట్రాఫిక్ పోలీసు నియంత్రణ పాటించి ఎవరూ ఇబ్బందులు పడకుండా క్రమ పద్ధతిలో వాహనాలను పంపించాలన్నారు. భక్తులు ఎవరూ గోదావరిలో దిగకుండా చూసుకోవాలని అన్నారు. ముఖ్యంగా ప్రతిచోట లైటింగ్ శానిటేషన్ పరంగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అలాగే పబ్లిక్ అడ్రస్ సిస్టం ప్రకారము భక్తులందరికీ తెలియజేసే విధంగా సూచనలు ఇస్తూ ఉండాలని ఐటీసీ సింగరేణి వారు ఏర్పాటు చేసిన క్రేన్లను సిద్ధంగా ఉంచుకొని వచ్చిన వినాయక ప్రతిమలను భక్తులు రాకుండా వారే స్వయంగా గోదావరి నిమర్జనం చేసే విధంగా చూసుకోవాలన్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి శానిటేషన్ సిబ్బంది చెత్త ఏర్పడకుండా శుభ్రం చేస్తూ ఉండాలని అక్కడక్కడ డస్ట్ బీన్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. భక్తులకు స్వచ్ఛమైన మంచినీరు అందించాలని అవసరమైతే స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన శిబిరాలలో వారికి మంచినీళ్లతో పాటు అల్పాహారం అందే విధంగా సంబంధిత ఆర్డీవో చూసుకోవాలన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం జరిగిన సంబంధిత అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె అన్నారు. పోలీస్ శాఖ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసు, ఫైర్ శాఖ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి భద్రాచలం గోదావరిలో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేయడానికి వచ్చే భక్తులకు సహాయ సహకారాలు అందించి వారు నిమజ్జనం చేసిన తర్వాత శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకొని వారి గమ్య సురక్షితంగా వెళ్లే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మి, ఆర్డిఓ మంగీలాల్, పరితోజ్ పంకజ్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

28 నుండి మధ్యాహ్నం భోజన కార్మికుల రాష్ట్ర వ్యాప్త సమ్మె

- డీఈఓ సూపర్డెంట్ సమ్మె నోటీస్ అందజేత



నవతెలంగాణ-పాల్వంచ

తెలంగాణ మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ అనుబంధం సంఘం మధ్యాహ్నం భోజన కార్మికులకు పెంచిన వేతనాలు చెల్లింపుకు బడ్జెట్ ఇవ్వాలని, కొత్త మెనుకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, తదితర డిమాండ్ల పరిష్కారం కోసం సెప్టెంబర్ 28 నుండి రాష్ట్రవ్యాప్త సమ్మె చేస్తున్నామని డీఈఓ సూపర్డెంట్‌కు మంగళవారం సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.పద్మ, ఎస్‌డీ సుల్తానా మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం మధ్యాహ్నం భోజన కార్మికులకు 2022 ఫిబ్రవరి 22న వేతనాలు పెంచుతామని ప్రకటించి జీవో కాఫీ ఇచ్చి నేటికీ 18 నెలలు కావస్తున్నా అమలు చేయకపోవడం చాలా దుర్మార్గం అని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు అనేక కష్టాలకోర్చి మధ్యాహ్న భోజన నిర్వహణ చూస్తున్నారని ప్రభుత్వం నెలనెలా బిల్లులు ఇవ్వడం లేదన్నారు. కొత్త మెయిన్ సవరించాలని, పిల్లలకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని లేదా ప్రభుత్వమే అంగన్వాడీ కేంద్రాలకు వేసినట్టు సరఫరా చేయాలని కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, తదితర సమస్యలు నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్, మధ్యాహ్న భోజన కార్మికులు రామలక్ష్మి, వెంకట్ నర్సమ్మ, అరుణ, క్రాంతి, రాణి, పద్మ, మణమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం, నిరుద్యోగ సమస్యలపై పాలకుల నిర్లక్ష్యం

- ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి




నవతెలంగాణ-గుండాల

దేశం, రాష్ట్రంలో పాలకులు ఎన్నికల ముందు సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను ఊరించి ఓట్లు వేయించుకునే ఎత్తు గడలను అనుసరిస్తున్నారే తప్పా! విద్య, వైద్యం, నిరుద్యోగం, పేదరికం, తదితర సమస్యల పరిష్కారానికి కనీసం ప్రయత్నం చేయడం లేదని, ప్రభుత్వాల ఈ తప్పుడు విధానాలపై ప్రగతిశీల యువకులు, చైతన్యవంతంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఇల్లందు మాజీ శాసనసభ్యులు గుమ్మడి నర్సయ్య, పీవైఎల్ జిల్లా కార్యదర్శి వాంకుడోత్ అజయ్ పిలుపునిచ్చారు. సోమవారం గుండాల మండల పరిధిలోని కాచనపల్లి గ్రామంలో జరిగిన ఆ సంఘం ఇల్లందు డివిజన్ 8వ మహాసభలో వారు పాల్గొన్నారు. ముందుగా ప్రగతిశీల యువజన సంఘం బిగిపిడికిలి జెండాను ఆ సంఘం నాయకులు ఈసం కృష్ణ ఆవిష్కరించారు. అనంతరం పివైఎల్ నాయకులు ధరావత్ దేవా ఈసం కృష్ణ అధ్యక్షతన జరిగిన మహాసభలో పివైఎల్ అమరవీరులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం గుమ్మడి నర్సయ్య, అజయ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నీళ్లు, నిధులు, నియామకాలు ఉంటాయని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందని వాపోయారు.

అనంతరం 15 మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యదర్శిగా సనప కుమార్, అధ్యక్షులుగా ధారావత్ దేవాను నియమించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర నాయకులు యనగంటి గణేష్, సీపీఐ (ఎంఎల్) ప్రజాపందా ఇల్లందు డివిజన్ కార్యదర్శి నాయిని రాజు, పార్టీ జిల్లా నాయకులు ఈసం శంకర్, బుర్ర వెంకన్న, ఇల్లందు, గుండాల మండలాల కార్యదర్శులు పూనెం కుమార్, కొమరం శాంతయ్య, పార్టీ డివిజన్ నాయకులు బొర్ర వెంకన్న, అజ్మీర బిచ్చా తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ జాతీయ ప్రతినిధిగా షణ్ముఖ్



నవతెలంగాణ-సుజాతనగర్

తమిళనాడు రాష్ట్రంలోని నమ్మకల్ జిల్లాలో ఆదివాసి గిరిజన జాతీయ 4వ మహాసభలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సభలకు మండలానికి చెందిన గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కున్సోత్ షణ్ముఖ్ జాతీయ ప్రతినిధిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఆదివాసి గిరిజన హక్కులు ప్రమాదంలో పడ్డాయని గిరిజనులందరూ ఐక్యమై వారి హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | సెప్టెంబర్ 20, 2023 | www.navatelangana.com

బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు కృషి చేయాలి

నవతెలంగాణ-ఇల్లందు

2024-25 ఆర్థిక సంవత్సర లక్ష్య సాధన కమిటీ సమావేశం మంగళవారం స్థానిక వైసీఓఏ క్లబ్‌లో జీఎం జాన్ ఆనంద్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి జీఎం (సీపీపీ) జక్కం రమేష్, జీఎం (సర్వే) పీఎస్‌కే రవి, జీఎం (క్వాలిటీ) నారాయణరావు, ఇతర కార్పొరేట్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం ఎంసీపీపీ జక్కం రమేష్ మాట్లాడుతూ లక్ష్యసాధనలో ఇల్లందు ఏరియా ఎప్పుడు ముందు ఉంటుందని గత సంవత్సరంలో ఎలా అయితే లక్ష్యాలను సాధించారో రాబోవు 2024-25 సంవత్సరంలో కూడా సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని వారు కోరారు. ఈ సమావేశంలో యస్వోటు జీఎం మల్లారపు మల్లయ్య, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ పి.శ్రీనివాసు, కార్పొరేట్ అధికారులు ఏజీఎం (ఐఈడీ) బి.రవి, డీజీఎం (పీపీ) శ్యామసుందర్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలి

నవతెలంగాణ-ఇల్లందు

ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులకు జూలై నెల నుండి నూతన పిఆర్సీనీ అమలు చేయవలసి ఉన్నందున, ఆలస్యం చేయకుండా వెంటనే పీఆర్సి కమిషన్ను నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఎస్.పూర్ణచంద్రరావు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జేబీఎస్) ఇల్లందు, ఏజిహెచ్ఎస్ రాంపేడులో మంగళవారం జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో టిపిటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యల సేకరణలో భాగంగా పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి.భాగ్య రావు, జిల్లా కౌన్సిలర్స్ సిహెచ్.రమేష్, ఎస్.కె.నాగుల్ మీర, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.సమ్మయ్య, టీ.ఇమ్మానుయేల్, మండల కమిటీ సభ్యులు వెంకట్రాం, అశోక్ పాల్గొన్నారు.

ఫాస్ట్, జంక్ ఫుడ్‌లను తినే అలవాటు మానుకోవాలి

- గుండెబోయిన రామకృష్ణ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మండలంలోని ప్రజలు ముఖ్యంగా యువత, చిన్నారులు ఆయా హొటళ్ళ, సెంటర్‌లలో లభించే ఫాస్ట్, జంక్ ఫుడ్‌లను తినే అలవాటును మానుకోవాలని మండల కేంద్రానికి చెందిన సంఘసంస్కర్త గుండెబోయిన రామకృష్ణ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో నవతెలంగాణ ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ.. గతంలో నేనూ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడిపే వాడినని, సమాజ హితం కోసం దానిని మానేశానని చెప్పారు. ఒకరికి మంచి మాటలు చెప్పే ముందు మనం ఆ చెడు అలవాటును ముందుగా మానుకోవాలనే గాంధీజీ మాటలను గుర్తు చేశారు. మనిషి మనుగడకు గాలి, నీరుతో పాటు మంచి ఆహారం ప్రధానమైనదని, అది నేటి సమాజంలో కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. దానికి ఉదాహరణగా ప్రస్తుత రోజుల్లో ప్రజలు వివిధ కారణాలు చూపుతూ త్వరగా తయారయ్యే నూడిల్స్, ఫ్రైడ్ రైస్, పిజ్జాలు, బర్గలు, తదితర ఫాస్ట్, జంక్ ఫుడ్‌లను తినడానికి అలవాటు పడి, ఏరికోరి వ్యాధులు, రోగాల బారినపడి, ఆరోగ్య పరంగా, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని, కొన్ని సందర్భాల్లో ప్రాణాలు సైతం పోతున్న సంఘటనలు దేశంలో కోకొల్లలుగా చూస్తున్నామని చెప్పుకొచ్చారు. వీటిలో వాడే టేస్టింగ్ సాల్ట్ సైతం ఆరోగ్యానికి అత్యంత హానికరమని శాస్త్రవేత్తలు సైతం తేటతెల్లం చేశారన్నారు. మన ఏజెన్సీ ప్రాంతంలో అడవుల నుంచి లభించే ఫలాలు, పంటల నుంచి లభించే చిరుధాన్యాలు, పప్పు దినుసులు, మన ఇండ్లలో పెంచుకునే పండ్ల చెట్ల నుంచి లభించే స్వచ్ఛమైన ఆరోగ్యాన్ని ఇచ్చే సీజనల్ ఫలహారం తీసుకుని, అందరూ ఆరోగ్యంగా జీవించడానికి ప్రయత్నిద్దామని విజ్ఞప్తి చేశారు.

రుణమాఫీ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోండి

- గానుగపాడు సొసైటీ చైర్మెన్ చంద్రరావు

నవతెలంగాణ-చంద్రుగొండ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతులకు రుణమాఫీ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని గానుగపాడు సోసైటీ చైర్మన్ చెవులు చంద్రరావు అన్నారు. మంగళవారం స్థానిక డిసిసిబి బ్యాంకు నందు గానుగపాడు సోసైటి రైతులకు రుణమాఫీ నగదును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రుణాలతో వ్యవసాయ పెట్టుబడులను పెట్టి, సాగును సులభం చేసుకోవాలన్నారు. దశలవారీగా రుణమాఫీని ప్రభుత్వం రైతులకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబి మేనేజర్ రాగమయి, సోసైటీ సీఈఓ లంకా నరసింహారావు, బ్యాంకు సిబ్బంది, సోసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబు అక్రమ అరెస్టు ఖండిస్తూ భారీ ర్యాలీ

నవతెలంగాణ-మణుగూరు

మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ మంగళవారం మణుగూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. రాజకీయ పార్టీల కతీతంగా నందమూరి అభిమానులు, తెలుగుదేశం పార్టీ నాయకులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దుమ్ముగూడెం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం సీతారాంపురం గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షులు కొమరం దామోదర్‌రావు అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో కొడాలి లోకేష్ బాబు, యలమంచి వంశీకృష్ణ, కొడాలి శ్రీనివాస్, పాతూరి ప్రసాద్, లంకా శ్రీనివాసరావు(అబ్బులు), బొల్లోజు, వేణు, సత్యనారాయణమూర్తి, తోటమళ్ల సంగీతరావు, రామ్మోహన్, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



హరివిల్లు అపార్టుమెంటులో మట్టి గణపతికి పూజలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని కవిరాజ్‌నగర్ హరివిల్లు అపార్టుమెంటులో మట్టి గణపతికి మొదటి రోజు పూజలు చేశారు. బొంతు మాదవ్ రావు, సుధా, జక్కపూడి సుధాకర్, వరలక్ష్మి, పెంట్యాల అనిల్, మాధవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మట్టి గణపతి విగ్రహ దాత రాయల రాంబాబు, లక్ష్మణ్ వారి కుమారుడు రాయల నరేష్, అపార్టుమెంటు వాసులు పాల్గొన్నారు.

ముదిగొండ : మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక సమితి పండగ వేడుకలను ప్రజలు, గణేష్ భక్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి, గణేష్ భక్తులు ప్రజలు పాల్గొన్నారు.

23న ఖమ్మంలో డీవైఎఫ్ఐ సెమినార్

- డీవైఎఫ్ఐ యంగ్ ఉమెన్ రాష్ట్ర కన్వీనర్ రోష్నీఖాన్

నవతెలంగాణ-సత్తుపల్లి

ఈనెల 23న ఖమ్మంలోని మంచికంటి ఫంక్షన్‌హాలులో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో సెమినార్ జరుగుతుందని డీవైఎఫ్ఐ యంగ్ ఉమెన్ రాష్ట్ర కన్వీనర్ పఠాన్ రోష్నీఖాన్ తెలిపారు. మణిపూర్ మారణకాండ- దేశ రాజకీయ ముఖచిత్రం అంశంపై ఈ సెమినార్ జరుగుతుందన్నారు. ఉదయం 10గంటలకు సెమినార్ ప్రారంభమవుతుందని రోష్నీఖాన్ తెలిపారు. ప్రధాన వక్తలుగా తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, బిగ్‌టీవీ ఎడిటర్ ఇన్ చీఫ్ పీవీ శ్రీనివాసరావు, అతిథులుగా రైతుసంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, యూసీఎస్‌వో వ్యవస్థాపక అధ్యక్షుడు గుడిబండ్ల దీపక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, జిల్లా కార్యదర్శి షేక్ బషీర్ పాల్గొంటారని ఆమె తెలిపారు. యువజనులు, సీపీఐ(ఎం), అనుబంధ సంఘాల నాయకులు, వామపక్ష భావజాల అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని సెమినార్‌ను విజయవంతం చేయాలని రోష్నీఖాన్ కోరారు.

మండపాలలో కొలువుదీరిన గణనాథులు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

వినాయక నవరాత్రి మహెూత్సవాలలో సందర్భంగా మండల వ్యాప్తంగా గ్రామ గ్రామాన గణనాథుడు పచ్చని తోరణాలతో అలంకరించిన మండపాలలో వివిద రూపాల ప్రతిమలతో తయారు చేసిన ఆది దేవుడు గణ నాధుడు కొలువు తీరాడు. వినాయక మండపాలలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మంగళవారం రెండవ రోజు మండపాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల మట్టి వినాయకుల ప్రతిమలు ఏర్పాటు చేశారు. ఏది ఎమైనా మండల వ్యాప్తంగా వినాయక నవరాత్రులు భక్తి శ్రద్ధలతో ప్రారంభం అయ్యాయనే చెప్పవచ్చు.



వినాయకుడికి పీవో దంపతులు ప్రత్యేక పూజలు

భద్రాచలం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఆదివారం భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారికి సంప్రదాయ బద్ధ స్వాగతం పలికారు. పీవో దంపతులకు అర్చకులు వేద ఆశీర్వాదం అందజేశారు.

గుండాల గుండాల మండల కేంద్రంలోని సుభాష్ నగర్ వీధిలో సోమవారం వినాయక చవితి పండుగను పురస్కరించుకుని కాలనీలోని ఉత్సవ కమిటీ సభ్యులు నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడానికి మండపం ఏర్పరచి వినాయక విగ్రహం ప్రతిష్ఠించారు. అనంతరం విగ్రహ దాతలు ఆవుల శ్రీను దంపతులు, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కోడూరి శ్యామ్, వాసం సమ్మయ్య, తీగల సురేష్, వి.శీను, పాలకుర్తి శేఖర్, మొక్క నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ళపల్లి మండల కేంద్రంతో పాటు అనంతోగు, మర్కోడు, రామాంజిగూడెం, రాఘవాపురం, రాయిపాడు, తదితర గ్రామాల్లో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని నవరాత్రి ఉత్సవాలు జరపడానికి మండపాలు ఏర్పాటు చేసి, వినాయకుడి విగ్రహాలను ఆయా గ్రామాల ఉత్సవ కమిటీలు సోమవారం ప్రతిష్ఠించాయి. అందులో భాగంగా అనంతోగు గ్రామంలో మండపంలో ఉత్సవ కమిటీకి వినాయక విగ్రహాన్ని స్థానిక ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి-కిశోర్ బాబు దంపతులు కానుకగా ఇచ్చారు. సోమ, మంగళవారాలు భక్తులు వివిధ మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండో రోజు మంగళవారం ఆళ్ళపల్లి కిరాణా షాపు యజమాని గౌరిశెట్టి చంద్రశేఖర్-శ్రీదేవి దంపతులు రామాలయం గుడి వద్ద ఏర్పాటు చేసిన మండపం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

బీఎస్ఎస్ఎం చైర్మెన్ సామ్యులపై అక్రమ కేసులు పెట్టారు

- ఎస్పీ కార్యాలయం ముందు ఆందోళన



నవతెలంగాణ-కొత్తగూడెం

పోలీసులు ఉద్దేశపూర్వకంగానే (బిఎస్ఎస్ఎం) చైర్మన్ మంద్దిశెట్టి సామ్యులపై అక్రమ కేసులు పెట్టారని ములకలపల్లి ప్రాంత వాసులు మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. కార్యాలయం ముందు గ్రామస్తులు బైఠాయించి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనంతరం పలువురు నాయకులు ఎస్పీ వినీత్‌ని కలిసి మాట్లాడారు. చర్చల అనంతరం భారత సర్వ సమాజ్ మహాసంగ్రామ్ ఆఫ్ ఇండియా (బిఎస్ఎస్ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకులు సతీష్ మాదిగ మీడియాతో మాట్లాడారు. బిఎస్ఎస్ఎం సంస్థ తెలంగాణ చైర్మన్ మద్దిశెట్టి శామ్యూల్‌పై ఉద్దేశపూర్వకంగా పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. పోడు రైతులకు పట్టాలు ఇప్పిస్తానని మూడేండ్ల క్రితం రూ.9 లక్షల 80లు అక్రమంగా వసూళ్ల చేశాడని ముల్కలపల్లి మండలం, మావిళ్లగూడెంకు చెందిన మడివి చుక్కయ్య ఇచ్చిన ఫిర్యాదుపై సామ్యేల్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఇప్పటికే సామ్యూల్ హైకోర్టును ఆశ్రయించాడని, ఈ సమయంలో పోలీస్ వారు కేసులు పెట్టడం సరైనది కాదని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కేసులు నమోదు కాకుండా చూడాలని కోరినట్టు వారు మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత సర్వ సమాజ్ మహా సంఘ్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ చైర్మన్ పీటర్, వరంగల్ జిల్లా ఇన్‌చార్జీ ఐలయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు గుగులోతు లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నా భర్త మృతికి కారణమైన వారిని శిక్షించాలి



నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల పరిధిలోని అబ్బుగూడెం గ్రామంలో ఓ గిరిజనుడు హఠాత్ మరణంతో గ్రామం మొత్తం హాడల్ అయి పోయింది. అబ్బుగూడెం గ్రామానికి చెందిన బూరుగు శ్రీనివాసరావు (35) అలియాస్ లక్ష్మయ్య అదే గ్రామానికి చెందిన ఓ రైతు వరి పొలంలో విఘతి జీవిగా పడి పోయి ఉండటంతో గమనించిన కొందరు కూలీలు వెళ్లి చూడగా అప్పటికే మరణించడం ఉండటంతో కుటుంబ సభ్యులకు మరణ వార్త తెలియజేశారు. మృతుడు భార్య బూరుగు స్వప్న తెలిపిన వివరాల ప్రకారం... భర్త శ్రీనివాసరావు, సోదరుడు భీమినేని పోతురాజును గత 4 రోజులు క్రితం అదే గ్రామానికి చెందిన ఓ బీఆర్ఎస్ నాయుకుడు ఎదో పంచాయతీ ఉంది రమ్మని పిలిపించుకొని భర్తను, సోదరుడిని కొట్టి బూతులు తిట్టి అవమానించారని, అంతేగాక భర్త శ్రీనివాసరావు పై కేసు పెట్టి రాజకీయ పలుకుబడితో పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పిస్తు మానసికంగా బాధపెడుతున్నారు. నా భర్త అనేక సార్లు చెప్పి మానసికంగా బాధపడినాడు. అని ఇదే క్రమంలో సోమవారం అదే గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో పురుగు మందు స్ప్రే చేయలని తీసుకుపోయారు. మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో వరి పొలంలో మరణించడం అతన్ని చూసిన కొందరు గ్రామస్తులు మృతదేహంతో ఇంటికి రావడం చాలా బాధాకరంగా ఉందని అవమానాలు భరించలేక రాజకీయ వేధింపులు వలన శ్రీనివాసరావు అలియాస్ లక్ష్మయ్య చనిపోయాడని తెలియజేసింది. భర్త మరణానికి కారణమైన ముగ్గురు వ్యక్తులు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. రాజకీయ ఒత్తిడి వలన శ్రీనివాసరావు చనిపోయాడని మృతుడు బంధువులు బీఆఎస్ నాయుకుడు ఇంట్లో సోమవారం రాత్రి సమయంలో సుమారు రెండు గంటలు పాటు మృతదేహాన్ని పడుకోబెట్టి న్యాయం చేయలని డిమాండ్ చేశారు. దీనితో కొత్తగూడెం వన్ టౌన్, టు టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌లు కరుణాకర్, రమేష్, చంద్రుగొండ ఎస్సై రవి సంఘటన స్థలానికి చేరుకుని మృతుడు కుటుంబ సభ్యులకు, బంధువులుకు ఫిర్యాదు చేయండి విచారణ చేసి చట్టం ప్రకారం తగిన న్యాయం చేస్తామని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించాలని వారికి వివరించి మృతదేహాన్ని కొత్తగూడెం ప్రభుత్వ హాస్పటల్‌కి తరలించారు. భార్య స్వప్న ఫిర్యాదు మేరకు ఏఎస్సై అంజయ్య ముగ్గురు వ్యక్తులు పై కేసు నమోదు చేశామని తెలియజేశారు.

బాబుకు మేమున్నాం...

- చంద్రబాబుకు మద్దతుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిరసనలు
- ఆదివారం ఖమ్మంలో భారీ ప్రదర్శన..
- హాజరైన నందమూరి చైతన్య కృష్ణ బాబు బెయిల్‌పై తీర్పు రిజర్వ్ చేయడంతో అభిమానుల నైరాశ్యం
- బీజేపీతో కలిసి జగన్నాటకాలని విమర్శలు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడికి మద్దతుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. 'స్కిల్ డెవలప్‌మెంట్' కేసులో బాబు అరెస్టు అక్రమమంటూ ఖమ్మంలో ఆదివారం రాత్రి నిర్వహించిన నిరసన ప్రదర్శనకు పెద్ద ఎత్తున అభిమానులు తరలివచ్చారు. పార్టీలకతీతంగా నిర్వహించిన ఈ ర్యాలీలో అధికంగా టీడీపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనకు నందమూరి కృష్ణచైతన్య హాజరుకావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

బాబు బెయిల్ కోసం పూజలు...

బాబు బెయిల్ పిటిషన్‌పై మంగళవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఇరువర్గాల న్యాయవాదులు వాదనలు వినిపించారు. వాడీవేడి వాదనల అనంతరం హైకోర్టు తీర్పును రెండురోజులు రిజర్వ్ చేయడంతో బాబు అభిమానులు తీవ్ర నైరాశ్యానికి లోనయ్యారు. టీవీలు, ఇతరత్ర ప్రసారమాధ్యామాలు, ఫోన్‌ల ద్వారా ఎప్పటికప్పుడు బాబు బెయిల్ గురించి తెలుసుకున్నారు. బెయిల్ రావాలని వేడుకుంటూ వివిధ ఆలయాల్లో పూజలు చేయించారు. చివరికి తీర్పు రిజర్వ్‌లో ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బీజేపీతో కలిసి జగన్నాటకాలు ఆడుతున్నారంటూ మండిపడ్డారు.

కదంతొక్కిన అభిమానులు...

చంద్రబాబును విడుదల చేయాలంటూ అభిమానులు ఆదివారం రాత్రి కదంతొక్కారు. టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో పాటు కమ్యూనిస్టు పార్టీలు బాబు అరెస్టును ఖండించాయి. ఎన్టీఆర్ కూడలి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పెవిలియన్‌గ్రౌండ్ వరకు ఓ గంటపాటు కొనసాగింది. చంద్రబాబు అభిమానులు చేపట్టిన ఈ ర్యాలీలో ఎన్టీఆర్ మనువడు చైతన్య కృష్ణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బాబుతో నేను ప్లకార్డులు, నల్లజెండాలు చేబూని అభిమానులు ఈ ర్యాలీలో పాల్గన్నారు. బాబు అరెస్టును ఖండించిన వారిలో టీడీపీ పార్లమెంటరీ కమిటీ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీశ్, ఖమ్మం శాసనసభ నియోజకవర్గ ఇన్‌చార్జి కూరపాటి వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు మిక్కిలినేని మంజులు, మేడ ప్రశాంతలక్ష్మి, కొత్తపల్లి నీరజ, సరిపూడి రమాదేవి, చిరుమామిళ్ల లక్ష్మి, మోతారపు శ్రావణి, నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, నల్లమల వెంకటేశ్వర్లు, మద్దినేని బేబి స్వర్ణకుమారి, చింతనిప్పు కృష్ణచైతన్య, మందడపు రామకృష్ణ, మందనపు సుధాకర్, వల్లభనేని రామారావు, నల్లమల రంజిత్, వైద్యులు కూరపాటి ప్రదీప్, డాక్టర్ అసాధారణ్, యుగేందర్, కంభంపాటి నారాయణరావు తదితరులు ఉన్నారు.





కక్షసాధింపు సరికాదు : చింతనిప్పు కృష్ణచైతన్య, బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు

స్వర్ణాంధ్రప్రదేశ్ రూపకర్త, సైబరాబాద్ సృష్టికర్త, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి అరెస్టు ఆక్షేపణీయం. ఆయన్ను తక్షణం విడుదల చేయాలి. రాజకీయాల్లో కక్ష సాధింపు చర్యలు సరికాదు. గతంలో ఇలాంటివి ఉండేవి కాదు.



బాల కార్మికుల నిర్మూలనకు కృషి

- ప్రజ్వల యువజన సంఘం అధ్యక్షులు చింతమాల పాపయ్య

నవతెలంగాణ-ముదిగొండ

బాల కార్మికుల నిర్మూలనకు కృషి చేయాలని ప్రజ్వల యువజన సంఘం అధ్యక్షులు చింతమాల పాపయ్య అన్నారు. బాల కార్మికుల నిర్మూలనకై ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ, కైలాస్ సత్యార్థి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వల్లభి, బాణాపురంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయా హైస్కూల్లో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయరాదన్నారు. బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలన్నారు. పిల్లలపై సమస్యలు ఏమైనా ఉంటే స్వచ్ఛంద సంస్థ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. జిల్లాలో బాల,బాలికల సమస్యలపై స్వచ్ఛంద సంస్థ ప్రజ్వల యువజన సంఘం పనిచేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో బాణాపురం గ్రామసర్పంచ్ ఆవుల రమలక్ష్మారెడ్డి, ఉపసర్పంచ్ చింతకాయల రామారావు మాజీ ఎంపీటీసీ పచ్చా సీతారామయ్య, బాణాపురం హైస్కూల్ హెచ్ఎం ఇవి రామిరెడ్డి, వల్లబి ఇన్చార్జి హెచ్ఎం శోభ, ఎయిడ్ ప్రాజెక్టు కౌన్సిలర్ మాధవి, పంచాయతీ సెక్రటరీలు ఎస్కె ఇంతియాజ్, వేమూరి నాగమణి, వల్లభి పిహెచ్సి, పిహెచ్ఎన్ మంగతాయి, ఉపాధ్యాయులు,ఆశలు, పాల్గొన్నారు.

ఐ విత్ చంద్ర బాబు - ఉయ్ విత్ చంద్ర బాబు

- మారు మోగిన వైరా

నవతెలంగాణ-వైరా



తెలుగు దేశం అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ నియోజక వర్గ కేంద్రం వైరాలో భారీ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం సాయంత్రం కమ్మవారి కళ్యాణ మంటపం నుండి మెయిన్ రోడ్డు ఎంపిడిఓ కార్యాలయం వరకు స్త్రీ పురుషులు ఐ విత్ చంద్ర బాబు, ఉయ్ విత్ చంద్ర బాబు అన్న ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. వైరా క్రాస్ రోడ్డు కు చేరుకున్న అనంతరం జరిగిన సభలో తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాసిరెడ్డి రామనాథం, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, మాజీ ఎమ్మెల్యే బి చంద్రావతి, కాంగ్రెస్ పార్టీ వైరా నియోజక వర్గ ఇంచార్జి మాలోత్ రాందాస్ నాయక్ లు ప్రసంగించారు. చంద్ర బాబు అరెస్టు దేశ రాజకీయాలకే ప్రమాద హెచ్చరికని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో రాజకీయాల కతీతంగా అన్ని పార్టీలు, సంఘాలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నలుగురుకి తీవ్ర గాయాలు

సత్తుపల్లి రూరల్ : ఎదురుదురుగా వచ్చి రెండు బైకులు ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మెయిన్ రోడ్డు నందు మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. గాయపడ్డ వారిలో ఇద్దరు పరిస్థితి సీరియస్‌గా వుంది. 108లో స్థానిక ఏరియా ఆసుపత్రి కి తరలించారు.

మోడీ హామీలు నీటి మూటలే !

అన్నదాతలకు రెట్టింపు ఆదాయం ఎక్కడ?

- కనీస మద్దతు ధర సైతం కరువు
- వ్యవసాయం నుంచి దూరం చేయడమే లక్ష్యం
- కార్పొరేట్ సంస్థలకే అందలం
- దిక్కుతోచని రైతన్నదిక్కుతోచని రైతన్న



న్యూఢిల్లీ : 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో అన్నదాతలపై నరేంద్ర మోడీ, బీజేపీ వరాల జల్లు కురిపించాయి. ఉత్పత్తి వ్యయం కంటే కనీసం ఒకటిన్నర రెట్లు అదనంగా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) అందజేస్తామని నమ్మించారు. పాపం... రైతన్నలు అదంతా నిజమేనని నమ్మేశారు. మోడీ వరాల జల్లు చిలకరిస్తే వారు ఏకంగా ఓట్ల వర్షమే కురిపించారు. ఫలితంగా బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే అన్నదాతల ఆశలు ఆవిరి కావడానికి ఎంతో సమయం పట్టలేదు. తాను ప్రచార సమయంలో హామీ ఇచ్చిన విధంగా ఎంఎస్‌పీని నిర్ణయించడం సాధ్యం కాదని, ఒకవేళ ధర పెంచితే అది మార్కెట్‌ను తలకిందులు చేస్తుందని సుప్రీంకోర్టులో ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది.

2016 ఫిబ్రవరి 28న కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రధాని మోడీ మరో హామీ గుప్పించారు. భారత స్వాతంత్ర్య దినోత్సవ 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని నమ్మబలికారు. అన్నదాతలు నిజమేకాబోలని నమ్మారు. మరోవైపు ఎంఎస్‌పీ హామీ సంగతి ఏమైందంటూ 2017లో దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. దీనిపై మేలో అప్పటి బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఓ ప్రకటన చేస్తూ అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాలలోనే...అంటే 2017 నాటికే ఎంఎస్‌పీ హామీని దాదాపుగా నెరవేర్చామని పచ్చి అబద్ధం చెప్పారు. ధరను అంచనా వేసేటప్పుడు భూమి ధరను మినహాయిస్తే ఉత్పత్తి వ్యయం కంటే రైతుకు 43% అదనంగా ఎంఎస్‌పీ లభిస్తోందని తెలిపారు. భూమి ధరను పరిగణనలోకి తీసుకొని ఎంఎస్‌పీని నిర్ణయించడం అసాధ్యమని తేల్చేశారు.రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసే విషయంపై అధ్యయనం చేసేందుకు కేంద్రం 2016 ఏప్రిల్ 13న అశోక్ దల్వాయ్ కమిటీని ఏర్పాటు చేసింది. వ్యవసాయ ఆదాయం ఏటా 10.4% వృద్ధి సాధిస్తేనే రైతు ఆదాయాన్ని నిర్ధారిత సమయంలో రెట్టింపు చేయగలమని కమిటీ తెలిపింది. అయితే రైతులు పంట దిగుబడులను, ఆదాయాన్ని పెంచుకునేందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక మద్దతు ఇవ్వలేదు. అంతేకాక తీసుకోవాల్సిన చర్యలను సైతం సూచించలేదు.

లోపభూయిష్టంగా సర్వే

వ్యవసాయ కుటుంబాల పరిస్థితిని అంచనా వేసేందుకు 2021లో నిర్వహించిన సర్వే ప్రకారం 2018-19లో వ్యవసాయ కుటుంబం నెలసరి ఆదాయం రూ.10,218 మాత్రమే. ఇది లక్ష్యంగా నిర్దేశించుకున్న మొత్తానికి కనీసం దగ్గరగా కూడా లేదు. ఎందుకంటే 2022 నాటికి వ్యవసాయ కుటుంబ సగటు నెలసరి ఆదాయాన్ని రూ.22,610కి పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. అయితే ఎస్‌బీఐకి చెందిన ఆర్థిక పరిశోధనా విభాగం మాత్రం కొన్ని పంటలకు సంబంధించి 2018తో పోలిస్తే 2022లో రైతుల ఆదాయం రెట్టింపయిందని చెబుతోంది. మహారాష్ట్రలో సోయాబీన్స్, చెరకు, కర్నాటకలో వరి, రాజస్థాన్‌లో గోధుమ, గుజరాత్‌లో వేరుశనగ, పత్తి పంటలను పండిస్తున్న రైతులను ఇందుకు ఉదాహరణగా చూపింది. మిగిలిన పంటలు వేసిన రైతుల ఆదాయం కూడా 1.3-1.7 రెట్లు పెరిగిందని తెలిపింది. అయితే ఆ రాష్ట్రాలను మాత్రమే ఎందుకు ఎంచుకున్నారు? ఆదాయం లెక్కించడానికి తీసుకున్న ప్రాతిపదిక ఏమిటి? వంటి వివరాలను మాత్రం తెలపలేదు. ఈ సర్వేలో భూమి లేని కౌలుదారులను పట్టించుకోలేదు. పైగా ఆయా పంటల సేకరణ కూడా నామమాత్రంగానే జరిగింది. చెరకు పంట విషయానికి వస్తే అసలు ప్రభుత్వాలు దానిని కొనుగోలు చేయడం లేదు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే ఈ సర్వే పూర్తి లోపభూయిష్టంగా జరిగిందని అర్థమవుతోంది.

ఎంఎస్‌పీ నిర్ణయంలో మాయాజాలం

ఇప్పుడు కనీస మద్దతు ధరకు సంబంధించిన వాస్తవ చిత్రాన్ని పరిశీలిద్దాం. 2023-24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూన్ 7న ప్రకటించిన ఎంఎస్‌పీ సమంజసంగా లేదు. పండించిన పంటకు తగిన గిట్టుబాటు ధర లభించేలా కూడా ఎంఎస్‌పీని నిర్ణయించలేదు. విభిన్న పంటల సాగును ప్రోత్సహించే పేరుతో వ్యవసాయంలో పెట్టుబడి పెట్టేందుకే రైతులు వెనకడుగు వేసే పరిస్థితిని కల్పించారు. రైతుల ఆదాయం రెట్టింపు అవడం మాట అటుంచి పెట్టుబడి వ్యయం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. చిన్న, మధ్యతరహా రైతులు, కౌలుదారులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. పెట్టుబడి వ్యయాన్ని లెక్కించే సమయంలో అధికారులు కౌలు ధరను పరిగణనలోకి తీసుకోవడం లేదు. కొందరు రైతులు తమ వద్ద ఉన్న సొమ్మునే పెట్టుబడిగా పెడుతుంటారు. మరి ఆ డబ్బును బయట వడ్డీకి ఇస్తే ఎంత వస్తుందో ఆ మొత్తాన్ని కూడా సాగు వ్యయంగానే చూడాలి కదా. కానీ అధికారులు ఆ విషయాన్నే పట్టించుకోరు.

అంచనాలకు దూరంగా...

ధాన్యం ఉత్పత్తికి అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వాలు అంచనా వేస్తుంటాయి. అయితే కొన్ని రాష్ట్రాల అంచనాల కంటే వ్యవసాయ ఖర్చులు-ధరల కమిషన్ (సీఏసీపీ) అంచనాలు తక్కువగా ఉంటాయి. అంటే దీనర్థం వాస్తవ ఖర్చును ఈ కమిషన్ తగ్గించి చూపుతోంది. పెరుగుతున్న ఉత్పాదక వ్యయాలకు, ద్రవ్యోల్బణానికి సీఏసీపీ అంచనాలలో చోటు లేకుండా పోతోంది. కేంద్రంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం బీజేపీ పాలిత రాష్ట్రాల అభిప్రాయాలను కూడా పట్టించుకోవడం లేదు. కేరళలో ధాన్యం ఉత్పత్తి వ్యయం ఎక్కువ. దీనిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.800 బోనస్ ఇస్తూ రూ.2,850 రూపాయలకు కొనుగోలు చేస్తోంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇలాంటి చర్యలను నిరుత్సాహపరుస్తోంది. అదేమంటే మార్కెట్‌లో పరిస్థితులు దెబ్బతింటాయని అంటోంది. సీఏసీపీ అంచనాల ప్రకారమే క్వింటాలు ధాన్యం మద్దతు ధరను రూ.2,866గా నిర్ణయించాలి. కానీ ప్రకటించిన ఎంఎస్‌పీ రూ.2,183 మాత్రమే. అదే రాష్ట్రాల అంచనాల ప్రకారమైతే ఎంఎస్‌పీ రూ.3,208.5గా ఉండాలి. తెలంగాణలో పండిస్తున్న పత్తి పంట ధరనే చూద్దాం. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలు ధరను రూ.11,031గా అంచనా వేయగా సీఏసీపీ అంచనా కేవలం రూ.6,264 మాత్రమే. కేంద్రం మాత్రం ఎంఎస్‌పీగా క్వింటాలుకు రూ.6,620ని నిర్ణయించింది. హెక్టారుకు సగటున పదిహేను క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అనుకున్నా రైతు సుమారు రూ.31 వేలు నష్టపోతున్నాడు. దేశంలో రబ్బరు పండించే రైతులు కూడా కనీస మద్దతు ధర లభించక నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు.

వారు ఆడింది ఆట...పాడింది పాట

ఒక వైపు సాగు ఖర్చు పెరుగుతుంటే మరోవైపు కనీస మద్దతు ధర సైతం కరువై అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ విధానాల కారణంగా ధరల నిర్ణయంలో కంపెనీలదే పైచేయి అవుతోంది. వాటిపై ఎలాంటి నియంత్రణలు లేవు. ఎంఎస్‌పీని పెంచితే వినియోగదారులపై భారం పడుతుందన్న వాదనలో ఎలాంటి వాస్తవం లేదు. రైతులు, వినియోగదారుల జేబులకు చిల్లులు పెడుతూ కంపెనీలు సాగిస్తున్న దోపిడీని అరికట్టడానికి ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అగ్రి-బిజినెస్ గురించి పదేపదే ఊదరగొడుతున్న కార్పొరేట్ కంపెనీలు, అంతర్జాతీయ సంస్థలు, వ్యక్తులకే ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది.

సాగు నుంచి సాగనంపడానికే..

బీజేపీ ప్రభుత్వం కోరుకుంటున్నది... క్షేత్ర స్థాయిలో జరుగుతోంది ఒక్కటే. రైతులు అప్పుల విషవలయంలో చిక్కుకొని వ్యవసాయాన్ని వదిలేయడమే పాలకులకు కావాల్సింది. కార్పొరేట్ కంపెనీల లాభాలు గరిష్ట స్థాయికి చేరాలన్నదే వారి అభిమతం. సాగు చట్టాలు తెచ్చినా, విద్యుత్ బిల్లుకు సవరణలు ప్రతిపాదించినా ప్రభుత్వ లక్ష్యం రైతులను వ్యవసాయం నుండి దూరం చేయడమే. పెట్టుబడి వ్యయం పెరిగినా ఆశించిన దిగుబడి రాకపోవడం, వచ్చినా తగిన ధర లభించకపోవడంతో అన్నదాతలు వ్యవసాయ రంగం నుండి దూరమవుతున్నారు. ప్రభుత్వ హామీలు, తీపి కబుర్లు వారిని ఏ మాత్రం ఊరడించలేకపోతున్నాయి. గత దశాబ్ద కాలంలో దేశంలో నాలుగు లక్షల మంది రైతులు, వ్యవసాయ కార్మికులు, వలస కార్మికులు బలవన్మరణానికి పాల్పడ్డారు.రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడంలో కాదు... వారి కష్టాలను రెట్టింపు చేయడంలో బీజేపీ ప్రభుత్వం విజయం సాధించింది.మోడీ గ్యారంటీ ఇచ్చింది రైతుల ఆదాయానికి కాదు...కార్పొరేట్ సంస్థల లాభాలకు. ఇలాంటి పరిస్థితులలో రైతులకు మిగిలింది ఏమిటి? తీరని వ్యథ తప్ప...

బిజినెస్

ఎల్ఐసీ ఏజెంట్లకు గ్రాట్యూటీ పెంపు



- ఉద్యోగులకు 30శాతం కుటుంబ పెన్షన్

ఆర్థిక శాఖ నిర్ణయం

న్యూఢిల్లీ : దిగ్గజ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ (ఎల్ఐసీ)లో పని చేస్తున్న ఏజెంట్లకు ప్రస్తుతం అందిస్తున్న గ్రాట్యూటీ మొత్తాన్ని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతూ కేంద్ర ఆర్థిక శాఖ నిర్ణయం తీసుకుంది. అదే విధంగా ఎల్ఐసి ఉద్యోగుల కుటుంబాల సంక్షేమం కోసం అందరికీ ఒకే తరహాలో 30 శాతం ఫ్యామిలీ పెన్షన్ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. దీంతో 13 లక్షల మంది ఏజెంట్లకు, లక్ష మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనుందని ఆర్థిక శాఖ పేర్కొంది. తిరిగి అపాయింట్ అయిన ఏజెంట్లకూ రెన్యువల్ కమీషన్ పొందేందుకు అర్హత కల్పిస్తున్నట్లు వెల్లడించింది. ఏజెంట్లకు టర్మ్ ఇన్సూరెన్స్ కవరేజీని ప్రస్తుతమున్న రూ.3,000-10వేల మొత్తాన్ని ఇకపై రూ.25000-రూ.1.50 లక్షలకు పెంచుతున్నట్లు స్పష్టం చేసింది. దీంతో అకాల మరణం పొందిన ఏజెంట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంది. ఎల్ఐసీ ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి రూ.1831.09 కోట్ల డివిడెండ్‌ను ప్రకటించింది. 1956లో రూ.5 కోట్ల మూలధనంతో సంస్థ ప్రస్థానాన్ని ప్రారంభించింది. 2023 మార్చి ముగింపు నాటికి రూ.45,50,571.73 కోట్ల ఆస్తులకు చేరింది. గడిచిన రెండు దశాబ్దాల్లో అనేక ప్రయివేటు రంగ బీమా సంస్థలు వచ్చినప్పటికీ.. ఇప్పటికీ ఎల్ఐసీనే మార్కెట్ లీడర్‌గా ఉంది.

బీఓఎం వార్షికోత్సవ వేడుకలు



విజయవాడ : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) 89వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను విజయవాడ జోనల్ ఆఫీసులో నిర్వహించారు. ఇటీవల ఈ వేడుకను జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్, డిప్యూటీ జోనల్ మేనేజర్ రజిని కుమార్ లాంచనంగా ప్రారంభించారని బీఓఎం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా మిత్రా హాస్పిటల్స్, న్యూసిటీ బ్లడ్ బ్యాంక్‌తో కలిసి మెడికల్ చెకప్, రక్తదానం శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తమ బ్యాంక్ సిబ్బంది రక్తదానం చేశారు. వివిధ శాఖలకు చెందిన ఖాతాదారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఖాతాదారులే తమ బ్యాంక్‌ను ఉన్నత స్థానంలో నిలిపుతున్నారని జీఎస్‌డి ప్రసాద్ అన్నారు. మరింత మెరుగైన సేవలను అందించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ జోనల్ ఆఫీసు స్టాఫ్, నగరంలోని పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఒరైమా నుంచి కొత్త ఫ్రీపాడ్స్ లైట్ ఇయర్‌బడ్స్ విడుదల

హైదరాబాద్ : ఆడియో ఇన్నోవేషన్ ఉత్పత్తుల కంపెనీ ఒరైమో కొత్తగా 'ఫ్రీపోడ్స్ లైట్' ఇయర్‌బడ్స్‌ను విడుదల చేసింది. ఒకసారి ఛార్జింగ్ చేస్తే 40 గంటల పాటు వీడిని వాడుకోవచ్చని ఆ సంస్థ పేర్కొంది. కేవలం 10 నిమిషాలు ఛార్జింగ్ చేస్తే 120 నిమిషాల వరకు వినియో గించవచ్చని తెలిపింది. దీని ధర రూ.1000 దిగువన ఉంటుందని పేర్కొంది. తమ ఉత్పత్తులకు బాలీవుట్ నటీ మృణాల్ ఠాకూర్‌తో క్యాంపెయిన్ చేస్తోన్నట్లు తెలిపింది. ఫ్రీపోడ్స్ క్రిస్టల్ క్లియర్ ధ్వనీతో సంగీత ప్రియులకు మంచి అనుభూతిని అందిస్తుందని వెల్లడించింది.

త్వరలో ట్విట్టర్ వాత..!

- సబ్‌స్క్రిప్షన్ ఫీజు చెల్లించాల్సిందే

వాషింగ్టన్ : ప్రముఖ సామాజిక మీడియా దిగ్గజం ట్విట్టర్ (ఎక్స్) యూజర్లకు వాత పెట్టనుంది. ప్రతీ వినియోగదారుడు నెలకు సబ్‌స్క్రిప్షన్ ఫీజు చెల్లించాల్సి రానుంది. ఈ విషయాన్ని స్వయంగా ఎక్స్ అధినేత ఎలన్ మస్క్ వెల్లడించారు. మస్క్ సబ్‌స్క్రిప్షన్ ఫీజును అమలు చేయనున్నట్లు ఇజ్రాయిల్ ప్రధాని నేతన్యాహుతో జరిగిన భేటీలో మస్క్ తెలిపారు. ఎక్స్‌ను వాడే వారు ప్రతి నెలా ఎంతో కొంత చెల్లించాల్సి ఉంటుందన్నారు. అయితే ఎంత మొత్తమనేది ఆయన వెల్లడించలేదు. ఎక్స్‌లో ప్రస్తుతం 55 కోట్ల నెలవారి వినియోగదారులు ఉండగా.. రోజుకు సగటున 10-20 కోట్ల పోస్టులు పెడుతుంటారన్నారు. ప్రస్తుతం బ్లూటిక్ సబ్‌స్క్రిప్షన్ అయినా ఎక్స్ ప్రీమియం కోసం ప్రతీ నెలకు రూ.900 వసూలు చేస్తోంది.

త్వరలోనే ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ లేని వారి నుంచి కూడా ఛార్జ్ వసూలు చేయాలనేది ఎలన్ మస్క్ నిర్ణయంగా ఉంది. అదే జరిగితే ఎక్స్ వాడకం దారులు భారీగా తగ్గిపోయే ప్రమాదం ఉంది.

గీత కార్మికుల సమస్యల పరిష్కరించాల్సిందే..

- ఇచ్చిన హామీలు అమలు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం
- 22న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా
- విలేకర్ల సమావేశంలో సంఘం నేతలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదని కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లం కొండ వెంకటేశ్వర్లు విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటనరసయ్య, ఎం కృష్ణస్వామితో కలిసి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పలు సందర్భాల్లో గీత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామంటూ వాగ్దానాలు చేశారనీ, వాగ్దానాలను నిలుపుకోవటంలో విఫలమయ్యారని తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం 22న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైన ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి రూ. 500కోట్లు అవసరమైతే..రూ. 100 కోట్లు ఇస్తామని చెప్పి, చివరకు నామమాత్రంగా రూ. 30 కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. కేటాయించిన డబ్బుల్ని సైతం ఆరు నెల్లవుతున్నా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇంకెప్పుడు వాటిని ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. కల్లుగీత వృత్తిలో అనునిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. వీటి పట్ల ప్రభుత్వం పట్టీ పట్టనట్లు ఉంటున్నదని విమర్శించారు. ఏడాదికి సుమారు 550 మంది చెట్లుపై నుండి జారి పడుతున్నారనీ, కాళ్ళు, చేతులు విరిగి, అంగవైకల్యులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నడుములు పడిపోయి మంచానికి పరిమితమవుతున్నారని చెప్పారు. వీరిలో 180 మంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి ప్రమాద నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనీ, సేఫ్టీ మోకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మునుగోడు ఎన్నికల సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నిర్వహించిన గౌడ ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. గీత కార్మికులందరికీ మోటారు బైకులు ఇస్తామనీ, లిక్కర్ షాపులు సొసైటీలకు 15శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటూ నమ్మబలికారని గుర్తు చేశారు. కుల వృత్తులు చేసే వారికి రూ.లక్ష ఆర్థిక సహాయం ఏమైందని ప్రశ్నించారు. గీతన్న బీమా పథకం అమలు చేయాలనీ, ఎక్స్ గ్రేషియా యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ఏరియాలోని సొసైటీలను పునరుద్ధరించాలన్నారు. వారికి కూడా సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నీరా కేఫ్‌ను అన్ని జిల్లాలకు విస్తరింప చేయాలని డిమాండ్ చేశారు.

560 జీవో ప్రకారం ప్రతి సొసైటీకి 5 ఎకరాల భూమి ఇవ్వాలనీ, ప్రభుత్వ భూమి లేనట్లయితే కొనివ్వాలన్నారు. పెన్షన్ రూ.5 వేలకు, ఎక్స్‌గ్రేషియా రూ.10లక్షల పెంచాలని డిమాండ్ చేశారు.

హెచ్‌బీ ఆటోస్పాతో టర్టిల్ వాక్స్ ఇండియా

హైదరాబాద్ : చికాగో ఆధారిత కార్ కేర్ కంపెనీ టర్టిల్ వాక్స్ ఇంక్ తమ మరో కో-బ్రాండెడ్ కార్ కేర్ స్టూడియోని హైదరాబాద్‌లో హెచ్‌బి ఆటోస్పా భాగస్వామ్యంతో ప్రారంభించినట్లు తెలిపింది. మణికొండా సమీపంలో అత్యాధునిక టర్టిల్ వాక్స్ డిటైలింగ్ టెక్నాలజీలు, ఉత్పత్తుల విస్తృత శ్రేణీని అందిస్తున్నట్లు టర్టిల్ వాక్స్ కేర్ ఇండియా ఎండి సాజన్ మురళి పురవంగర తెలిపారు.

భూ నిర్వాసితులను బెదిరించి..

- ఎకౌంట్‌లో నగదు జమ చేయడం పద్ధతి కాదు
- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు



నవతెలంగాణ-బోనకల్

నాగపూర్ - అమరావతి గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించాలని, వెంటనే జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ రైతులతో చర్చించి ధర నిర్ణయించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు, నిర్వాసితుల ఉద్యమ కన్వీనర్ తకేళ్ళపాటి భద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం తూటికుంట్ల గ్రామంలో మంగళవారం నాగపూర్ - అమరావతి గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి భూ నిర్వాసితులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు రైతులతో చర్చలు జరిపి రైతులను సానుకూలంగా ఒప్పించాలే గానీ రైతులను బలవంతం చేయడం, కోర్టులో డబ్బులు డిపాజిట్ చేస్తామని, కోర్టులో నుంచి డబ్బులు తీసుకోవడం బహు కష్టం అని బెదిరించి ఎకౌంట్ పాస్ పుస్తకాలు నకళలు వసూలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. కలెక్టర్ ధర నిర్ణయం చేయాల్సి ఉంటుందని, అలా కాకుండా గ్రామానికొక ధర చెప్పి రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. భూ నిర్వాసితులు ధర నిర్ణయం జరిగే వరకు, ఇతర సమస్యలు పరిష్కారంపై హామీ ఇచ్చే వరకు ఐక్యంగా భూ నిర్వాసిత రైతులు ఉద్యమం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం మండల కార్యదర్శి తూళ్ళూరి రమేష్, సీపీఐ(ఎం) మధిర పట్టణ మాజీ కార్యదర్శి పాపినేని రామనర్సయ్య, భూ నిర్వాసిత రైతులు నాగండ్ల శ్రీధర్, మందడుపు రవీంద్ర, సాధినేని వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో.. తాపీ మేస్త్రి ఆత్మహత్య

నవతెలంగాణ - నార్సింగి

ఆరోగ్యం సహకరించక పనికి వెళ్లకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడి మనస్తాపంతో తాపీ మేస్త్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా నార్సింగిలో మంగళవారం జరిగింది. ఎస్ఐ అహ్మద్ మోహిద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగికి చెందిన రాకాసి విఠల్(52) వృత్తి రీత్యా తాపీ మేస్త్రీ. విఠల్, అరుణ దంపతులకు 18 ఏండ్ల వయసు గల కవల పిల్లలు అజయ్, అరుణ ఉన్నారు.

కాగా, నాలుగేండ్లుగా కాళ్ల నొప్పులతో బాధపడుతున్న విఠల్.. ఆరోగ్యం సహకరించకపోవడంతో పనులకు వెళ్లలేకపోతున్నాడు. ఒక రోజు పనికి వెళ్లినా చాలా రోజుల వరకు నొప్పులతో బాధపడేవాడు. దాంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. తన పనులు కూడా చేసుకోలేకపోవడం, పనికి వెళ్ల లేకపోవడంతో కలుగుతున్న ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెందాడు. దాంతో సోమవారం రాత్రి 10 గంటలకు పట్టణ శివారులోని సహకార సంఘం భవనం వద్ద నున్న బస్ స్టాండ్ పైకప్పులోని ఇనుప రాడ్డుకు నైలాన్ తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని రామాయంపేట ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించాడని వైద్యులు తెలిపారు. మృతుని భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి హామీ పథకంపై దాడులను నిరసిస్తూ అక్టోబరు 11న దేశవ్యాప్తంగా ఆందోళనలు

న్యూఢిల్లీ : గ్రామీణ నిరుపేదలకు, అత్యంత అణచివేతకు గురైన వర్గాలకు జీవనోపాధి కల్పించే మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఏ)ను మనుగడలో లేకుండా చేసేందుకు మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం గత తొమ్మిదేండ్లుగా కుట్రలు పన్నుతోంది. ఆ పథకంపై ప్రభుత్వం చేసే విధానపరమైన దాడులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అక్టోబరు 11న నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని రైతు, కార్మిక సంఘాలైన ఏఐకేఎస్, బీకేఎంయూ, ఏఐఏడబ్ల్యూయూ, ఏఐఏఆర్ఎల్ఏ, ఏఐఏకేఎస్ యూలు పిలుపిచ్చాయి. సాధారణంగా వ్యవసాయ కార్మికులు, గ్రామీణ కూలీల వేతనాలు క్షీణిస్తున్నా, చాలా ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద వేతనాలు మాత్రం స్థిరంగా వుంటున్నాయి, లేదా కాస్త పెరుగుదల నమోదు అవుతున్నది. వాస్తవాలు ఇలా వున్నప్పటికీ ఈ పథకాన్ని రూపుమాపేయాలని మోడీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. వరుసగా బడ్జెట్లలో తగినంతగా నిధులు కేటాయించకుండా మోడీ ప్రభుత్వం ప్రధానంగా దారుణమైన దెబ్బ తీస్తోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 91శాతం నిధులు కేటాయించినవి ఖర్చు పెట్టేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధి హామీ కార్మికులు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. పని ప్రదేశాల్లో ఆన్‌లైన్ హాజరు నమోదు చేయించుకోవడం, ఆధార్ ప్రాతిపదికన చెల్లింపులు ఇవన్నీ పెద్ద సమస్యలుగా మారాయి. పార్లమెంట్‌లో అందచేసిన సమాచారం ప్రకారం, ఈ ఏడాది 51891168 జాబ్ కార్డులను నిరాధారణమైన కారణాలతో తొలగించారు. ఇటీవలే గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరిగే పనుల పర్యవేక్షణకు డ్రోన్‌లను ఉపయోగించాలని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఒక కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. దానికోసం కొత్తగా కేటాయింపులేవీ జరపకపోయినా, డ్రోన్ సాంకేతికతను ఉపయోగించుకోవడంలో నైపుణ్యత కలిగిన సంస్థల సేవలను అద్దెకు తీసుకోవాల్సిందిగా రాష్ట్రాలను కోరారు. ప్రతిరోజూ ఉపాధి కార్మికులకు కొత్త సమస్యలు సృష్టించేందుకు ఇవన్నీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఎత్తుగడలు. పథకం పట్ల ఆసక్తిని కనబరచనీయకుండా కార్మికులను నిరుత్సాహానికి గురి చేసే కుట్రలే ఇవన్నీ.

నవతెలంగాణ మానవి 11
www.navatelangana.com
బుధవారం ఖమ్మం
20 సెప్టెంబర్ 2023



చుండ్రు సమస్యకు...

ఈ రోజుల్లో పది మందిలో ఆరుగురు ఎదుర్కొనే సమస్య చుండ్రు... ఇందుకు ప్రధాన కారణం జుట్టుకు సరైన పోషణ లేకపోవడం.. నూనె సరిగా అప్లై చేయకపోవడం వల్ల మాడుపై ఎండినట్లు అయి ఫంగస్ ఏర్పడుతుంది. దీంతో చుండ్రు మస్యలు మొదలవుతాయి. దీనికి కొన్ని చిట్కాలు క్రమం తప్పకుండా పాటిస్తే సమస్యను పరిష్కరించుకోవచ్చు. అవేంటంటే...

○ నాలుగు చెంచాల హెన్నా పౌడర్, నిమ్మకాయ ఒకటి, పెరుగు తీసుకోవాలి. హెన్నా పౌడర్‌లో పెరుగు, నిమ్మరసం వేసి ఉండలు లేకుండా కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడుకు అప్లై చేసుకోవాలి. అరగంట తర్వాత షాంపూతో తలస్నానం చేయాలి. తల పూర్తిగా ఆరిన.. తర్వాత కండిషనర్ రాసుకోవాలి. నిమ్మరసం వల్ల ఈ ప్యాక్ వేసుకొన్నప్పుడు కాస్త మంట పెట్టే అవకాశం ఉంది. అయినప్పటికీ చుండ్రు సమస్యకు ఇది చక్కటి పరిష్కారం.

○ హెన్నా పౌడర్ నాలుగు చెంచాలు, కుంకుడుకాయల పొడి రెండు చెంచాలు, పెరుగు రెండు చెంచాలు తీసుకోవాలి. ఓ గిన్నెలో హెన్నా పౌడర్, కుంకుడు కాయల పొడి కలిపి మిశ్రమంగా చేయాలి. దీనిలో పెరుగు కూడా వేసి బాగా కలపాలి. ఈ ప్యాక్ తలకు అప్లై చేసి అరగంట తర్వాత మైల్డ్ షాంపూతో తలస్నానం చేయాలి. ఈ ప్యాక్ వారానికోసారి అప్లై చేసుకుంటే చుండ్రు తగ్గిపోతుంది. ఈ ప్యాక్‌లో ఉపయోగించిన కుంకుడు కాయలు.. మాడును మొత్తం శుభ్రం చేసి చుండ్రు రావడానికి కారణమైన ఫంగస్‌ను నాశనం చేస్తుంది.

○ హెన్నా నాలుగు చెంచాలు, నిమ్మరసం చెంచా, ఆలివ్ నూనె చెంచా, వైట్ వెనిగర్ చెంచా, మెంతుల పొడి చెంచా, పెరుగు రెండు చెంచాలు తీసుకోవాలి. శుభ్రమైన గిన్నెలో అన్నీ వేసి ఉండలు కట్టకుండా బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని 12 గంటల పాటు పక్కన పెట్టి ఉంచేయాలి. దీనిని రాత్రి సమయంలో నానబెట్టుకొని ఉదయం ఉపయోగిస్తే మంచి ఫలితం ఉంటుంది. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి రెండు నుంచి మూడు గంటల తర్వాత మైల్డ్ షాంపూతో తలస్నానం చేయాలి. డ్రై హెయిర్ కలిగిన వాళ్ల తలస్నానం తర్వాత కండిషనర్ రాసుకోవాల్సి ఉంటుంది. వారానికి ఒకసారి ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల చుండ్రు సమస్య తగ్గుముఖం పడుతుంది.

○ హెన్నా మూడు చెంచాలు, ఆలివ్ నూనె చెంచా, ఎగ్ వైట్ రెండు చెంచాలు, నీరు తీసుకోవాలి. ఓ గిన్నెలో హెన్నా, ఆలివ్ నూనె, ఎగ్ వైట్ వేసి తగినంత నీరు పోసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకు అప్లై చేసి అరగంట నుంచి 45 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత మైల్డ్ షాంపూతో తలస్నానం చేయాలి. వారానికోసారి ఈ హెయిర్ ప్యాక్ వేసుకోవడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుంది. పైగా కోడిగుడ్డులో ఉండే ప్రొటీన్ వల్ల జుట్టు బలంగా తయారవుతుంది.

సవాళ్ళను ధైర్యంగా స్వీకరిస్తేనే...

ఏ తల్లైనా మొదటగా కోరుకునేది ఏమిటి? తన పిల్లలకు ఆరోగ్యకరమైన, శుచి, రుచికరమైన ఆహారం అందించాలనే కదా! కానీ నేటి బిజీ జీవితం వల్ల ఇంటా, బయటా పనులతో క్షణం తీరిక ఉండడం లేదు. చాలా మంది ఇంట్లో వండే ఓపిక లేక కృత్రిమ రంగులు, రసాయనాలతో కూడిన ప్యాకేజ్డ్ ఫుడ్‌లను ఆశ్రయిస్తున్నారు. లేదంటే హోటల్ ఫుడ్‌తోనో, పూట భోజనంతో గడిపేస్తున్నారు. రుచి, శుచి లేని ఆ ఆహారం వల్ల సంపాదనలో సగం ఆసుపత్రి బిల్లులకు సమర్పిస్తున్నారు. అందుకే అన్నీ కల్తీమయమైన ఈ రోజుల్లో రసాయనాలు కలపని రుచికరమైన పోషకాహారాన్ని అందించే వ్యాపారం ప్రారంభించారు శిల్పిసింగ్. అసలు ఈ ఆలోచన ఆమెకు ఎలా వచ్చిందో తెలుసుకుందాం...



జంక్ ఫుడ్‌తో కలుగును జబ్బులు.. అధిక కొవ్వు అనారోగ్య హేతువు! గింజ పైపొరలో పోషకాలు.. శరీరపుష్టికి నెలవులు చిరుధాన్యాలు.. మానవులకు ఆయురారోగ్య ములనిచ్చు వరములు.. శరీరపుష్టిని కలిగించు తృణధాన్యాలు... తాతముత్తాతల కాలం నాటివని.. తృణప్రాయమని తృణీకరించకుమా తృణ ధాన్యాలు.. ఆరోగ్యభాగ్యమునకవే మేటి నిలువలు... అని చాటిచెప్పేలా 2019లో మొదలుపెట్టిన తన వ్యాపార విస్తరణలో మైలురాళ్లను దాటుతూ, సానుకూల దృక్పథంతో లక్ష్యాన్ని చేరే ప్రయత్నం నిరంతరం చేస్తూనే ఉన్నారు శిల్పి సింగ్.

చదివిన చదువుకు సార్థకత

ఉత్తరప్రదేశ్‌లో జన్మించి ఐ. ఐ. టి.రూర్కీలో బి.టెక్, లోవా స్టేట్ యూనివర్సిటీలో ఎం.ఎస్ పూర్తి చేసిన ఈ ఉన్నత విద్యావంతురాలు హైద్రాబాద్ ఐఎస్‌బిలో ఎం.బి.ఎ. కూడా చేసారు. పద్నాలుగేండ్ల పాటు వివిధ కంపెనీలకు వృత్తిపరంగా తన సేవలనం దించారు. తన చదువుకు సార్థకత చేకూరేలా ఆరోగ్యానికి రుచికరమైన పోషకాహారం అని అర్థం వచ్చేలా FittR Bitesను ప్రారంభించారు.

మధుమేహులకు సైతం

చిరుధాన్యాలంటే వంటకు ఎక్కువ సమయం పడుతుంది, రుచిగా ఉండవు వంటి అపోహలు కరోనా తర్వాత ప్రజల్లో తొలగిపోయాయి. అందరికీ వీటి పట్ల పెరిగిన మక్కువ, ఆరోగ్య స్పృహను ఆమె గమనించారు. ఏడాదిన్నరపాటు వీటిపై పరిశోధన చేశారు. అన్ని వయసుల వారికీ ఆరోగ్యాన్నిచ్చే ఉత్పత్తులపై దృష్టి పెట్టారు. ఏ కృత్రిమ రసాయనాలను, రంగులను వాడకుండా సహజంగా లభించే చిరుధాన్యాలతో తిండి పదార్థాల ఉత్పత్తి ప్రారంభించారు. వాటిలో గోధుమపిండి, బెల్లం, పల్లీలు మొదలైనవి కలిపి చేసే మిల్లెట్ కిచిడీ, దోసె, ఓట్స్ ఇడ్లీ, జొన్న ఉప్మా, నూడుల్స్, రెడీ టు మిక్స్‌లు, చిక్కీలు, కుకీస్ వంటివి ఎన్నో వున్నాయి. అంతేకాక రోగనిరోధకశక్తిని పెంచే పానీయాలు, సత్తు మిక్స్‌లు కూడా ఉన్నాయి. ప్రస్తుతం హైద్రాబాద్, విజయవాడ, వైజాగ్, తిరుపతి నగరాల్లో 400 పైగా స్టోర్స్‌లో ఇవి అందుబాటులో ఉన్నాయి.

నిపుణుల పర్యవేక్షణలో

తయారీలో పరిశుభ్రత, నాణ్యత పాటిస్తూ సుమారు ఆరునెలల పాటు నిల్వ ఉండే పోషకాహార పదార్థాలను శిల్పిసింగ్ ఉత్పత్తి చేయిస్తున్నారు. ఇవి మధుమేహులు కూడా నిర్భయంగా తీసుకోవచ్చు. అమెజాన్,ఫ్లిప్ కార్ట్, బిగ్ బాస్కెట్ వంటి ఆన్లైన్ సోర్స్‌లోనూ లభిస్తున్నాయి. వారి ఉత్పత్తులు FSSAI ఆమోదముద్రను కూడా పొందాయి. ఇదంతా అంత సులభంగా జరగలేదు. కొత్త బ్రాండ్ కనుక మొదట్లో డిస్ట్రిబ్యూటర్ దొరకలేదు. దాంతో వినియోగ దారులకు ఉత్పత్తులు ఆమే స్వయంగా అందించేవారు. అంతేకాక తాను సొంతంగా పొదుపు చేసిన డబ్బునే మొదట పెట్టుబడిగా పెట్టారు. తర్వాత కుటుంబం, మిత్రుల సహాయంతో వ్యాపారాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేసారు. 'సాధించాలనే సంకల్పం దృఢంగా ఉంటే సాకారం కానిదేముంది. అందులోనూ అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్న నేటి మహిళలకు అసాధ్యమన్నది ఏమున్నది' అంటారు ఆమె.

రిస్క్‌లను కిస్ చేయడం తన నైజం

'ఇంత చదువు చదివి పెద్ద జీతమొచ్చే ఉన్నతోద్యోగం వదులుకొని వ్యాపారం చేస్తావా' అంటూ చాలామంది మిత్రులు, బంధువులు యథాప్రకారంగా వెనుకకు లాగే ప్రయత్నం చేశారు. కానీ అవేమీ పట్టించుకోలేదు. సహజంగా తనకున్న ఆరోగ్యస్పృహ, శ్రద్ధ, సొంతవ్యాపారంపై గల మక్కువతో తప్పకుండా అనుకున్నది సాధించగలననే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి విజయాన్ని సాధించారు శిల్పి. కాల్షియం నిల్వల ఖజానా అయిన రాగి చిక్కీలు తనకు చాలా ఇష్టమని చెప్పే శిల్పి వృత్తిగతంగా, వ్యక్తిగతంగా ఎన్నో సవాళ్ళను ఎదుర్కొన్నారు.



రిస్క్‌లను కిస్ చేయడం తన నైజం అంటారు.

మహిళలకు సహాయ సహకారాలు

pharmaseuticles రంగంలో పనిచేసే తన భర్త, కుటుంబం అండదండలు ఆమెకు మెండుగా వున్నాయి. అలాగే శిక్షణ, రిటైల్ స్టోర్స్‌కి తమ ఉత్పత్తుల అనుసంధానం చేయడం, ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు, ఇలా చాలా అంశాల్లో వి హబ్ వారి సహాయ సహకారాలు, మార్గదర్శకత్వం లభించాయి. స్టాండర్డ్ పార్క్ సీడ్ ప్రోగ్రాంకు కూడా ఎంపికయ్యారు. 'ప్రతి మహిళా వృత్తిగత, వ్యక్తిగత పనులను బేరీజు వేసుకోవాలి. పనులకు తగిన సమయం కేటాయించుకోవాలి. అన్నింటినీ సమన్వయం చేసుకుంటూ, ఎత్తుపల్లాలను, సవాళ్ళను ధైర్యంగా స్వీకరించాలి. అప్పుడే మహిళలు అన్ని రంగాల్లో విజయం సాధించగలరు' అంటారు ఆమె. సాటి మహిళలకు సహాయ సహకారాలు అందించడం తనకు తృప్తినిస్తుందని అంటారు. అంతేకాక వర్కింగ్ మదర్ పిల్లల కెరీర్‌పై సానుకూల ప్రభావం చూపగలదని, అది తన స్వీయానుభవం అంటారు ఆమె. భవిష్యత్‌లో అన్ని మెట్రో నగరాల్లో తమ ఉత్పత్తులు అందుబాటులోకి రావాలని, విదేశాలకు తమ నాణ్యమైన ఉత్పత్తులు ఎగుమతి చేయాలనే ప్రయత్నంలో ఆమె ఉన్నారు.

- చంద్రకళ. దీకొండ, 9381361384



చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ ...

అమరావతి: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో వాదనలు ముగిశాయి. మంగళవారం మధ్యాహ్నం 12గంటల నుంచి దాదాపు ఐదు గంటల పాటు వాదనలు హెూరాహెూరీగా కొనసాగాయి. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ఉన్నత న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది.

ఈ కేసులో ఇరు పక్షాల తరఫున మొత్తం ఐదుగురు న్యాయవాదులు వాదనలు వినిపించారు. సుదీర్ఘంగా కొనసాగిన వాదనల్లో పలు కీలక అంశాలను న్యాయవాదులు కోర్టులో ప్రస్తావించారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ, అసలు ఈ కేసులో అవకతవకలు జరిగాయా? లేదా? డబ్బులు పోయాయని ఒకవైపు సీఐడీ ఆరోపిస్తున్నప్పటికీ.. అసలు ఆ డబ్బు ఎక్కడికి వెళ్లిందో ఆధారాలు చూపకపోవడం, నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఇప్పటికీ తెరిచే ఉండటం, వాటిలో యువతకు శిక్షణ సైతం కొనసాగుతున్న పరిస్థితులను కోర్టుకు వివరించారు.

ఎన్నికల వేళ కుట్రపూరితంగా...

ఎన్నికల వేళ కావాలనే కుట్రపూరితంగా ఈ కేసులో చంద్రబాబును ఇరికించారని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులో ఫిర్యాదే ఓ అభూత కల్పన అని, ఎఫ్ఐఆర్ చట్టవిరుద్ధంగా ఉందంటూ చంద్రబాబు తరఫు న్యాయవాదులు హరీశ్ సాల్వే, సిద్ధార్థ్ లూథ్రా హైకోర్టు ధర్మాసనం ముందు తమ వాదనలు వినిపించారు. మరోవైపు, అటు ప్రభుత్వం తరఫు న్యాయవాదులు ప్రధానంగా షెల్ కంపెనీల ద్వారా నగదు వెళ్లిందని.. ఆ డబ్బంతా ఎక్కడికి వెళ్లిందో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాల్సి ఉందని బెంచ్ ముందు వాదనలు వినిపించారు. ఈ దశలో కోర్టులు కలుగజేసుకోరాదన్నారు. ఈ కేసులో చంద్రబాబుకు 17ఎ వర్తించదని వాదించారు. కార్పొరేషన్ సంబంధించి న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేయాలని.. వాళ్లను సైతం చేర్చుకొనేందుకు మరో వారం రోజులు గడువు ఇవ్వాలని కోరారు. అన్ని వాదనలు ఈరోజే పూర్తిచేయాలని ఒక దశలో బెంచ్ అనడంతో కౌంటర్ వాదనలు ఈరోజే వినిపించడంతో ఇరువైపుల వాదనలు ముగిశాయి. దీంతో చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది.

ఏసీబీ కోర్టులో పిటిషన్లపై విచారణ 21కి వాయిదా

చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో తీర్పు రిజర్వులో ఉన్నందున అటు ఏసీబీ న్యాయస్థానంలో సీఐడీ దాఖలు చేసిన చంద్రబాబు కస్టడీ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. చంద్రబాబు బెయిల్, మధ్యంతర బెయిల్ పిటిషన్లపైనా విచారణ వాయిదా పడింది. పిటిషన్లపై విచారణను ఈ నెల 21కు ఏసీబీ కోర్టు వాయిదా వేసింది. హైకోర్టులో చంద్రబాబు క్వాష్ పిటిషన్ విచారణ దృష్ట్యా విచారణ వాయిదా పడింది.

ఏకీకృత సిద్ధాంతం దేశానికి ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

ఆదానీ లాంటి కార్పొరేట్లకు కట్టబెడుతూ అటవీ సంరక్షణ నియమాల చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. కామన్ సివిల్ కోడ్ పేరుతో వివిధ తెగలు, జాతులు,మతాల ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు ప్రయత్నిస్తున్నాయని విమ ర్శించారు. ఇది అత్యంత ప్రమాద కరమనీ, దీనికి వ్యతిరేకంగా ఐక్యఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరముందన్నారు. అందుకనుగు ణంగా మహాసభల్లో నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. బాబురావు మాట్లాడుతూ మణిపూర్ హింసకు బీజేపీయే బాధ్యత వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని విమర్శించారు. పేదలు మత ఉన్మాదంలో కాలిపోతుంటే.. ఆ మంటలతో ఆ పార్టీ చలికాచుకుంటున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో గిరిజన తెగల ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్న బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా గిరిజన తెగలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

మహాసభలో సంఘం జాతీయ కన్వీనర్ జతిన్ చౌదరి, బృందాకారత్, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, దళిత సోషల్ ముక్తి మంచ్ జాతీయ నాయకులు సామ్యేల్‌రాజ్, ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు సుమతి, మాజీ ఎంపీ పులిన్ బస్కి, త్రిపుర మాజీ మంత్రి జమాతియ, తెలంగాణ టీజీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్,ఏటీజీఎస్ ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, తొడసం భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.

ఖలిస్థానీ చిచ్చు ..

న్యూఢిల్లీ : భారత్-కెనడా దేశాల మధ్య ఖలిస్థానీ చిచ్చు తీవ్ర ఉద్రిక్తమయ్యింది. ప్రముఖ ఖలిస్థానీ నాయకుడు హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత ప్రభుత్వ పాత్ర ఉందని ఆరోపిస్తూ కెనడా ప్రభుత్వం భారత సీనియర్ దౌత్యవేత్తను బహిష్కరించింది. కెనడా ఆరోపణలను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. అలాగే కెనడా చర్యకు ప్రతి చర్యగా ఆ దేశానికి చెందిన సీనియర్ దౌత్యవేత్తను కేంద్రం బహిష్కరించింది. ఐదు రోజుల్లోగా దేశం విడిచివెళ్లాలని మంగళవారం ఆదేశించింది. ఖలిస్థానీ అనుకూల నాయకుడు హర్‌దీప్ సింగ్ నిజ్జర్‌ను జూన్ నెలలో కెనడాలోని సర్రే ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. నిజ్జర్ హత్య గురించి సోమవారం హౌస్ ఆఫ్ కామన్స్‌లో కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో మాట్లాడుతూ ఈ హత్య వెనుక భారత దేశం ఉందని ఆరోపించారు. ఈ సంఘటను ఆమోదయోగ్యం కాని ఉల్లంఘనగా అభివర్ణించారు. అలాగే, కెనడాలోని భారత దౌత్యకార్యాలయంలోని రీసెర్చ్ అండ్ ఎనాలసిస్ వింగ్ అధికారి పవన్ కుమార్ రాయ్‌ను దేశం నుంచి బహిష్కరించినట్టు కెనడా విదేశాంగ మంత్రి మెలానీ జోలి పార్లమెంట్‌కు తెలియచేశారు.

ట్రూడో ప్రభుత్వం ఆరోపణలను, భారత దౌత్యవేత్త బహిష్కరణను కేంద్రం తీవ్రంగా పరిగణించింది. భారత్‌లోని కెనడా హైకమిషనర్ అయిన కామెరూన్ మెక్‌కేకు కేంద్ర విదేశాంగ శాఖ మంగళవారం సమన్లు జారీ చేసింది. దీంతో ఉదయం న్యూఢిల్లీలోని సౌత్‌బ్లాక్‌లో గల విదేశాంగ శాఖ ప్రధాన కార్యాలయానికి మెక్‌కే చేరుకున్నారు. మెక్‌కేకు భారత్‌లోని సీనియర్ కెనడియన్ దౌత్యవేత్తను బహిష్కరిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని విదేశాంగ తెలిపింది. ఐదు రోజుల్లోగా ఆ దౌత్యవేత్త దేశాన్ని వీడి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. 'మన అంతర్గత వ్యవహారాల్లో కెనడా దౌత్యవేత్తల జోక్యం, భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కారణంగా ఆ దౌత్యవేత్తను బహిష్కరించాం' అని విదేశాంగ శాఖ వెల్లడించింది.

మరోవైపు, విదేశాంగ కార్యాలయానికి వచ్చిన కెనడా హైకమిషనర్ కామెరూన్.. మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు. ఆఫీసు నుంచి బయటకు వచ్చిన ఆయన్ను విలేకరులు ప్రశ్నించేందుకు ప్రయత్నించగా కామెరూన్ వారిని పట్టించుకోకుండా వేగంగా వెళ్లిపోయారు.

ద్వేషం కాదు దేశం ముఖ్యం

(మొదటిపేజీ తరువాయి)

సాక్షిగా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పట్ల ప్రధాని పదే పదే అక్కసును వెళ్లగక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది మంది ప్రజల మనోభావాలతో ముడిపడిన చారిత్రక అంశాల పట్ల సున్నితంగా వ్యవహరించడం నేర్చుకోవాలని ప్రధానికి సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సంబరాలు జరగలేదనడం...ప్రధాని అహంకారానికి, అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు.

రాష్ట్రం ఏర్పడిన నాడు ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు అంబరాన్నంటిన సంబరాలు కంటి కనబడలేదా? అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించే ఉద్దేశంతో కోట్లాది మంది ప్రజల మనోభావాలని గాయపరిచేలా గతంలోనూ తల్లిని చంపి బిడ్డను తీశారని మోడీ వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. గాంధేయ మార్గంలో కొనసాగిన తెలంగాణ ఉద్యమంలో రక్తపాతం జరిగిందని అనడం అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి నిధుల మూటలివ్వడం లేదు..కనీసం మాటల్లోనైనా మర్యాద చూపించాలని సూచించారు.

ఏడు మండలాలను లాక్కొని లోయర్ సీలేరు ప్రాజెక్టులో కలుపుకుని తొలి ద్రోహం చేశారని మండిపడ్డారు. నిటిఅయోగ్ సూచించిన మిషన్ కాకతీయ, మిషన్ భగీరథలకు బీజేపీ సర్కార్ నిధులివ్వడానికి నిరాకరించిందని గుర్తుచేశారు.కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని గుజరాత్ కు తరలించుకుపోయారనీ, 157 మెడికల్ కాలేజీల్లో తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదనీ, అప్పర్ భద్ర, పోలవరంకు జాతీయ హెూదా ఇచ్చి మధ్యలో తెలంగాణకు మొండి చేయి చూపించారని విమర్శించారు. ఏపీ విభజన హామీలనూ నెరవేర్చలేదని తెలిపారు. డబుల్ ఇంజిన్ నినాదంతో ఊదరగొట్టిన డబుల్ డిజిట్ సీట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. డిపాజిట్లు పోగొట్టుకోవడంలో బీజేపీ మళ్లీ సెంచరీ కొట్టడం పక్కా అని తెలిపారు. తెలంగాణ పుట్టుకనే అవమానించిన బీజేపీకి పుట్టగతులుండవని విమర్శించారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

- అదనపు ఎన్నికల ప్రధానాధికారి

ఎల్. లోకేష్ కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రానున్న శాసనసభ ఎన్నికల సన్నాహక చర్యల్లో భాగంగా ఎన్నికల విధులు నిర్వర్తించే ఈవీఎం నోడల్ అధికారులకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సిబ్బందికి మంగళవారం ఎన్నికల ప్రధాన కార్యాలయంలో శిక్షణా శిబిరాన్ని నిర్వహించినట్టు అదనపు ఎన్నికల ప్రధానాధికారి ఎల్. లోకేష్ కుమార్ తెలిపారు.ఈవీఎంలు, వీవీపాట్ యంత్రాల నిర్వహణ, సాంకేతిక విషయాలు, ఓటింగుకు ముందు, ఓటింగ్ సమయంలో, ఓటింగ్ పూర్తి అయిన తరువాత వాటిని నిర్వహించే పద్ధతులు, ప్రక్రియలపై సీనియర్ అధికారులతోపాటు, ఓటింగ్ యంత్రాల తయారీ సంస్థ అయిన ఈసీఐఎల్ కు చెందిన ఇంజనీర్లు సుకంఠ కుమార్ భోళా, కె. నితిన్ కుమార్ లు సిబ్బందికి అవగాహన కల్పించారని పేర్కొన్నారు. సీలు తీసే సమయంలో, వేసిన తరువాత ఓటింగ్ యంత్రాల నిర్వహణ, భద్రత, కౌంటింగ్ లపై కూడా సిబ్బందికి ఆచరణాత్మకంగా వివరించినట్టు తెలిపారు.

బీఆర్ఎస్‌కు కౌంట్‌డౌన్

(మొదటిపేజీ తరువాయి)

మాజీ ఎమ్మెల్యే నందికంటి శ్రీధర్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. నీళ్ళు, నిధులు, నియామకాలు అనేవి తెలంగాణ ప్రజల నినాదాలు కాదనీ, అవి కేసీఆర్ నినాదాలని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలు కోరుకున్నది స్వేచ్ఛ, ఆత్మ గౌరవమని వివరించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చింతకు ఉరేసుకొని సచ్చినా ధరణి రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ధరణి కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలాగా మారిందన్నారు. రాష్ట్రంలో భూసమస్య ప్రధానమైనదన్నారు. భూమి కోసమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందన్నారు. దేశంలో అత్యధిక ఆదాయం ఉన్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. దేశం గురించి బీజేపీకేం తెలుసని ప్రశ్నించారు. మత విద్వేషాలతో రాజకీయాలు చేసే బీజేపీకి భరతమాత గురించి మాట్లాడే నైతిక అర్హత ఉందా? అని ప్రశ్నించారు. ఉద్యమకారులకు భూమి ఇవ్వడమంటే వారిని గుర్తించి గౌరవించడమేనన్నారు. బండి సంజయ్, రాజ్‌గోపాల్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి లేవనెత్తిన అంశాలపై బీజేపీ అధ్యక్షులు కిషన్ రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం తథ్యమని ఆదివారం నాటి విజయభేరి సభలో తేల్చి చెప్పిందన్నారు. కాంగ్రెస్ గ్యారంటీలతో బీఆర్ఎస్ నేతలు కకావి కలమవుతున్నారని ఎద్దేవా చేశారు. మేం ప్రజలకు ఏం చేస్తామో చెబుతూ వారివద్దకు వెళతామన్నారు. గతంలో ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ నెరవేర్చిందన్నారు. ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, అర్హులకు పోడు భూముల పట్టాలు, ఆరోగ్యశ్రీ పథకాలు అమలు చేసి చూపించామని గుర్తు చేశారు. 'నల్లధనం తెస్తామనీ, ఉద్యోగాలు ఇస్తామని మోడీ మోసం చేశారు. దళిత సీఎం, దళితులకు మూడెకరాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు అంటూ కేసీఆర్ మోసం చేశారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ ఇచ్చిన హామీలపై చర్చ పెట్టండి. ఎవరు మాట తప్పారో? ఎవరు అమలు చేశారో? తెలుస్తుంది' అని సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం, ప్రజల అవసరాలకనుగుణం గానే తమ పార్టీ కార్యాచరణ ఉంటుందన్నారు. కాంగ్రెస్ వస్తే జాతీయ స్థాయిలో నిర్ణయాలు తీసుకోవాలంటూ మంత్రి హరీశ్‌రావు మొండి వాదనలు చేస్తున్నారని విమర్శించారు. సీడబ్ల్యూసీ సమావేశాలను విజయవంతం చేసిన జాతీయ, రాష్ట్ర నాయకులకు రేవంత్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఏపీ విభజన సరిగా జరగలేదు

(మొదటిపేజీ తరువాయి)

జరిగిందని, రక్తం చిందించాల్సి వచ్చిందని, నూతన రాష్ట్రం ఏర్పడినా తెలంగాణ వేడుకలు జరుపుకోలేకపోయిందని మోడీ పేర్కొన్నారు. ఈ పార్లమెంట్‌లోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని, అయితే ఉత్తరాఖండ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ మాదిరిగా ఏపీ, తెలంగాణ విభజన జరగలేదంటూ పరోక్షంగా కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. వాజ్‌పేయీ ప్రధానిగా ఉన్నప్పుడు కూడా రాష్ట్రాల విభజన జరిగిందని, ఎంతో ప్రణాళికబద్ధంగా మూడు కొత్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని ప్రధాని మోడీ అన్నారు. ఆ మూడు రాష్ట్రాల విభజన టైంలో అవి సంబరాలు జరుపుకున్నాయని, కానీ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు మాత్రం అలా సంబరాలు జరుపుకోలేకపోయాని అన్నారు. ప్రధాని మోడీ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ మండిపడ్డారు. తెలంగాణపై ప్రధాని మోడీ చేసిన ప్రసంగం.. రాష్ట్రాన్ని అవమానపరచడం లాంటిదని ధ్వజమెత్తారు. "తెలంగాణ అమరులను, వారి త్యాగాలను అవహేళన చేస్తూ.. ప్రధాని మోడీ మాట్లాడటం తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని అవమానించడమే" అంటూ మంగళవారం ట్విటర్ (ఎక్స్ ప్లాట్‌ఫామ్) మాధ్యమంగా రాహుల్ పోస్ట్ చేశారు. ఇందుకు ప్రధాని మోడీ తెలంగాణ రాష్ట్రానికి క్షమాపణలు చెప్పాల్సిందేనని హ్యాష్‌ట్యాగ్ జత చేశారు.

నేటినుంచి ఎడ్‌సెట్, పీఈసెట్ కౌన్సెలింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్, డీపీఈడీ, బీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీఈసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఎడ్‌సెట్ ప్రవేశాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, పరిశీలన, ఫీజు చెల్లింపునకు సంబంధించిన వివరాలను బుధవారం నుంచి ఈనెల 30 నమోదు చేయాలి. ధ్రువపత్రాల పరిశీలనకు స్కాన్ చేసిన వాటిని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఎన్‌సీసీ, సీఏపీ, వికలాంగులు, క్రీడల అభ్యర్థులకు సంబంధించి భౌతికంగా ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 25 నుంచి 29 వరకు నిర్వహిస్తారు. వచ్చేనెల మూడు నుంచి ఐదు వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలి. ఆరున వెబ్ ఆప్షన్ల సవరణకు అవకాశముంటుంది. తొమ్మిదిన మొదటి విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. వచ్చేనెల పది నుంచి 13 వరకు కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు రిపోర్టు చేయాలి. వచ్చేనెల 30న బీఎడ్ అభ్యర్థులకు తరగతులు ప్రారంభమవుతాయి. పీఈసెట్ ప్రవేశాలకు సంబంధించి ఈనెల 20 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, పరిశీలన, ఫీజు చెల్లింపు వివరాలు అందుబాటులో ఉంటాయి. 24, 25 తేదీల్లో ఎన్‌సీసీ, సీఏపీ, వికలాంగులు, క్రీడల అభ్యర్థులకు భౌతికంగా ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. 28, 29 తేదీల్లో వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలి. 30న ఆప్షన్ల సవరణకు అవకాశముంటుంది. వచ్చేనెల మూడున మొదటి విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. సీట్లు పొందిన అభ్యర్థులు నాలుగు నుంచి ఏడు వరకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలి. వచ్చేనెల 30 నుంచి డీపీఈడీ, బీపీఈడీ తరగతులు ప్రారంభమవుతాయి.

బీజేపీకి లాభం చేకూర్చడానికే ఎంఐఎం థర్డ్ ఫ్రంట్

(మొదటిపేజీ తరువాయి)

ఎంఐఎం వ్యవహారశైలి కూడా మత రాజకీయాలు బలపడే విధంగా ఉండటం దేశానికి హాని కలిగిస్తున్నదని తెలిపారు. అందువల్ల మైనార్టీలపై జరుగుతున్న దాడులను ప్రోత్సహించే బీజేపీకి వత్తాసు పలికే విధంగా ఎంఐఎం వ్యవహరించడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

స్వాగతిస్తున్నాం... : కాసాని

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పార్లమెంటులో మహిళలకు 33శాతం రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టడాన్ని తెలుగుదేశం తెలంగాణ శాఖ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ స్వాగతించారు. అసెంబ్లీ, పార్లమెంటులో మహిళలకు రిజర్వేషనతి కల్పించటం ఆహ్వానించదగ్గ పరిణామని తెలిపారు. ఈ రిజర్వేషన్లను వాయిదా వేయకుండా... వచ్చే ఎన్నికల నుంచే అమలుచేయాలని కోరారు.

అశ్విన్‌కు పిలుపు

- కెఎల్ రాహుల్‌కు కెప్టెన్సీ పగ్గాలు
- ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు భారత జట్టు

2023 వన్డే వరల్డ్‌కప్ ముంగిట టీమ్ ఇండియా చివరి ద్వైపాక్షిక సిరీస్‌కు సెలక్షన్ కమిటీ ఊహించని నిర్ణయాలు తీసుకుంది. 15 మందితో కూడిన ప్రపంచకప్ జట్టుకు పూర్తి స్థాయి ప్రపంచ కప్ వేట సన్నద్ధతకు కంగారూలతో సిరీస్ వేదిక కానుందని భావించినా.. అందుకు భిన్నంగా బెంచ్, ఫామ్‌లోని ఆటగాళ్లకు అవకాశం కల్పించేందుకు సెలక్షన్ కమిటీ నిర్ణయించింది. భారత్, ఆస్ట్రేలియా వన్డే సిరీస్ ఈ నెల 22 నుంచి ఆరంభం కానుంది.



నవతెలంగాణ-ముంబయి

స్వదేశంలో 2023 వన్డే వరల్డ్‌కప్ ముంగిట ఆఖరు క్షణాల్లో సైతం సీనియర్ సెలక్షన్ కమిటీ, జట్టు మేనేజ్‌మెంట్ ప్రయోగాలకు తెరదించలేదు. ఆసియా కప్ విజేతగా నిలిచిన టీమ్ ఇండియా.. సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో ఆడాల్సి ఉంది. అక్టోబర్ 5న ఆరంభం కానున్న ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌కు ముందు.. భారత్ ఆడబోయే చివరి ద్వైపాక్షిక సిరీస్ ఇదే. దీంతో సహజంగానే ఈ సిరీస్‌లో ప్రపంచకప్ తమ ప్రణాళికలను అమలు చేసేందుకు ప్రయోగ వేదికగా చేసుకుంటుందనే అంచనాలు కనిపించాయి. ప్రయోగాలకే పెద్ద పీట వేసిన అజిత్ అగర్కార్ సారథ్యంలోని బీసీసీఐ ఆల్ ఇండియా సీనియర్ సెలక్షన్ కమిటీ.. మూడు మ్యాచుల వన్డే సిరీస్‌కు రెండు జట్లను ఎంపిక చేసింది. తొలి రెండు వన్డేలకు బెంచ్ ఆటగాళ్లు, ఫామ్‌లో లేని క్రికెటర్లు ఎంపిక కాగా.. చివరి వన్డేకు మాత్రం వరల్డ్‌కప్ జట్టు బరిలోకి దిగుతుంది. భారత్, ఆస్ట్రేలియా వన్డే సిరీస్ సెప్టెంబర్ 22న తొలి వన్డేతో షురూ అవుతుంది.



> 'అశ్విన్ మా ప్రణాళికల్లో ఉన్నాడు. అతడి విషయంలో మ్యాచ్ ప్రాక్టీస్ పెద్ద విషయం కాదు. ఆసీస్‌తో సిరీస్‌లో అశ్విన్‌పై ఓ అవగాహన వస్తాం. ప్రపంచకప్‌లో అశ్విన్ విశేష అనుభవం జట్టుకు ఉపయుక్తంగా ఉంటుంది. ఫిజికల్ ఫిట్‌నెస్ కంటే మెంటల్ ఫిట్‌నెస్ అత్యంత కీలకం'
>
> - రోహిత్ శర్మ, భారత కెప్టెన్

అశ్విన్ వచ్చాడు

సీనియర్ ఆఫ్ స్పిన్నర్, 37 ఏండ్ల రవిచంద్రన్ అశ్విన్‌కు ఎట్టకేలకు వన్డే జట్టుకు పిలుపు అందింది. చివరగా 2022 జనవరిలో వన్డే మ్యాచ్ ఆడిన అశ్విన్.. ఏకంగా ప్రపంచకప్ ప్రణాళికల్లో భాగంగా జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నాడు. వరల్డ్‌కప్ జట్టులో జడేజా, అక్షర్ పటేల్ లెఫ్టార్మ్ స్పిన్నర్లు. కుల్దీప్ యాదవ్ మణికట్టు మాయగాడు. సంప్రదాయ, నాణ్యమైన ఆఫ్ స్పిన్నర్ భారత జట్టులో కరువయ్యాడు. దీంతో అశ్విన్ సహా వాషింగ్టన్ సుందర్‌ను ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ఎంపిక చేశారు. అక్షర్ పటేల్ తొడ కండరాల గాయం బారిన పడగా ఆసియా కప్ ఫైనల్లోనూ ఆడిన వాషింగ్టన్ సుందర్.. వరల్డ్‌కప్ బ్యాకప్ బృందంలో చోటు సాధించాడు. ఇక వన్డే ఫార్మాట్‌లో మిడిల్ ఆర్డర్‌లో కీలక పాత్ర పోషించగల బ్యాటర్, సమయోచిత పార్ట్ టైమ్ స్పిన్నర్‌గా క్రికెట్ పండింతుల కితాబు అందుకున్న తెలుగు తేజం తిలక్ వర్మకు సైతం ప్రపంచకప్ తలుపులు ఇంకా తెరిచే ఉన్నాయి!. ఆసియా కప్‌లో తిలక్ వర్మకు అవకాశం దక్కినా.. బంగ్లాదేశ్‌పై రాణించలేకపోయాడు. బలమైన ఆస్ట్రేలియాతో తొలి రెండు వన్డేల్లో తిలక్ వర్మ మెప్పిస్తే.. ప్రపంచకప్ సమయంలో తెలుగు తేజాన్ని జట్టులోకి ఎంచుకునే అవకాశం లేకపోలేదు.

రాహుల్‌కు పగ్గాలు

ఇప్పుడిప్పుడే ఫిట్‌నెస్ సాధించి జట్టులోకి వచ్చిన కెఎల్ రాహుల్.. ఆస్ట్రేలియాతో తొలి రెండు వన్డేలకు సారథ్య పగ్గాలు దక్కించుకున్నాడు. రోహిత్ శర్మతో పాటు హార్దిక్ పాండ్యకు సైతం విశ్రాంతి లభించటంతో రాహుల్‌ను కెప్టెన్సీ అవకాశం వరించింది. రవీంద్ర



జడేజా వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. బౌలింగ్ విభాగంలో కుల్దీప్ యాదవ్‌కు మాత్రమే విశ్రాంతి లభించింది. అక్షర్ పటేల్ గాయంతో దూరమయ్యాడు. బుమ్రా, సిరాజ్, షమి, శార్దుల్ ఠాకూర్, ప్రసిద్ కృష్ణలు జట్టులో నిలిచారు. ఆసియా కప్‌కు ఎంపికైనా మెప్పించని.. సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్‌లు ఆసీస్‌తో సిరీస్‌లో ఫామ్ సాధించటంపై దృష్టి సారించనున్నారు. ఆసియా క్రీడల భారత జట్టు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ తొలి రెండు వన్డేలకు జట్టులోకి వచ్చాడు. సెప్టెంబర్ 24న ఇండోర్‌లో రెండో వన్డే అనంతరం.. బెంగళూర్‌లోని ఆసియా క్రీడల జట్టుతో రుతురాజ్ కలువనున్నాడు. సెప్టెంబర్ 27న భారత జట్టు ఆసియా క్రీడల వేదిక హాంగ్జౌకు బయల్దేరనుంది.

ఇదిలా ఉండగా, ఆస్ట్రేలియాతో మూడో వన్డేకు టీమ్ ఇండియా పూర్తి స్థాయి జట్టు అందుబాటులో ఉండనుంది. వరల్డ్‌కప్ జట్టులోని 15 మందికి అదనంగా అశ్విన్, వాషింగ్టన్ సుందర్‌లు జట్టులో కొనసాగనున్నారు.

> 'ఆసియా కప్‌లో విలువైన క్రికెట్ ఆడారు. లేదంటే, ఈ సిరీస్ మరో కోణంలో ఉండేది. ప్రపంచకప్ ముంగిట కీలక ఆటగాళ్లకు ఫిజికల్ కంటే మెంటల్‌గా విరామం ఇవ్వాలని అనుకున్నాం. మూడో వన్డేకు అందరూ అందుబాటులో ఉంటారు. ఆసీస్ సిరీస్‌లో జట్టుకు దూరంగా ఉన్న ఆటగాళ్లకు అవకాశం కల్పిస్తుంది'
>
> - అజిత్ అగర్కార్, చీఫ్ సెలక్టర్

భారత వన్డే జట్టు

తొలి రెండు వన్డేలకు	మూడో వన్డేకు
కెఎల్ రాహుల్ (కెప్టెన్), రవీంద్ర జడేజా (వైస్ కెప్టెన్), శుభ్‌మన్ గిల్, రుతురాజ్ గైక్వాడ్, శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, శార్దుల్ ఠాకూర్, జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమి, తిలక్ వర్మ, ప్రసిద్ కృష్ణ, రవిచంద్రన్ అశ్విన్, వాషింగ్టన్ సుందర్.	రోహిత్ శర్మ (కెప్టెన్), హార్దిక్ పాండ్య (వైస్ కెప్టెన్), శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, రవీంద్ర జడేజా, శార్దుల్ ఠాకూర్, జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమి, విరాట్ కోహ్లి, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, రవిచంద్రన్ అశ్విన్, వాషింగ్టన్ సుందర్.

అస్త్ర పరీక్షకు ఇదే ఆఖరుమారు!

2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ సమీపిస్తున్న వేళ టైటిల్ రేసులో నిలిచిన ఇతర జట్లు రేసు గుర్రాలతో గెలుపు సమీకరణాలను సరి చూసుకుంటుండగా.. మరోవైపు మాజీ చాంపియన్ టీమ్ ఇండియా ఇంకా రేసు గుర్రాలను ఎంపిక చేసుకునే పనిలోనే నిమగ్నమైంది!. ప్రపంచకప్ జట్టునే ఆసియా కప్‌కు పంపించి.. సమర సన్నద్ధతకు శంఖం పూరించింది సెలక్షన్ కమిటీ. కానీ ప్రపంచకప్ ముంగిట భారత జట్టు ఆడబోయే చివరి ద్వైపాక్షిక వన్డే సిరీస్‌కు కొత్త ముఖాలకు అవకాశం కల్పించారు. వరల్డ్‌కప్ ముంగిట అగ్ర జట్టు, టైటిల్ ఫేవరేట్లలో ఒకటి ఆస్ట్రేలియా. దీంతో సహజంగానే ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో రోహిత్‌సేన పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగుతుందని ఆశించగా.. సెలక్షన్ కమిటీ అభిమానులకు ఝలక్ ఇచ్చింది.



ఆసియా కప్ విజేతగా నిలిచిన భారత్.. శ్రీలంకలో ఎన్నో ప్రశ్నలకు సమాధానం దొరకబట్టింది. అయినా, కొన్ని కీలక ప్రశ్నలు అలాగే మిగిలి ఉన్నాయి. పరుగుల వేటలో జోరందుకునే క్రమంలో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యలకు విశ్రాంతి కల్పించటం తెలివైన నిర్ణయంగా అనిపించటం లేదు. నెమ్మదిగా స్పందించే పిచ్‌లపై పరుగుల వేట టీమ్ ఇండియాకు ఇప్పటికీ ఓ మిస్టరీగా మిగిలింది. ఆసియా కప్ ఉత్సాహంలో ఉన్న ప్రపంచకప్ జట్టును ఆస్ట్రేలియాపై ప్రయోగించకుండా.. మళ్లీ కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. 2022 జనవరి నుంచి వన్డేల్లో కనిపించిన అశ్విన్.. ఇప్పుడు ప్రపంచకప్ ముందు ఎందుకు జట్టు ప్రణాళికల్లోకి వచ్చాడు అనేది తర్కానికి అందటం లేదు. 2019 ప్రపంచకప్ జట్టు ఎంపికలోనూ ఇటువంటి చారిత్రక తప్పిదాలతో టీమ్ ఇండియా భారీ మూల్యం చెల్లించింది. 2023 వరల్డ్‌కప్ వేట ముంగిట అస్త్ర పరీక్షకు టీమ్ ఇండియాకు ఇదే ఆఖరు అవకాశం. కనీసం చివరి వన్డేలోనైనా ప్రపంచకప్ జట్టుతో బరిలోకి దిగి అసలు సమరానికి సై అంటుందేమో చూడాలి.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

- 35వ సబ్ జూనియర్ జాతీయ చాంపియన్‌షిప్స్



విజేతలతో మంత్రి శ్రీనివాస్ గౌడ్, బ్యాడ్మింటన్ లెజెండ్ గుత్తా జ్వాల

నవతెలంగాణ, హైదరాబాద్ : 35వ జాతీయ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్ మంగళవారం హైదరాబాద్‌లోని గుత్తా జ్వాల అకాడమీలో ఘనంగా ముగిశాయి. సెప్టెంబర్ 14న మొదలైన జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల క్రీడాకారులు పోటీపడ్డారు. మంగళవారం అన్ని విభాగాల్లో ఫైనల్స్ జరుగగా.. అండర్-15, అండర్-17 (బాలురు, బాలికలు) విభాగాల్లో విజేతలుగా నిలిచిన షట్లర్లకు రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి భారత బ్యాడ్మింటన్ దిగ్గజం గుత్తా జ్వాల ట్రోఫీ, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ' హైదరాబాద్‌లో అధునాతన సదుపాయాలు, సౌకర్యాలతో అతిపెద్ద బ్యాడ్మింటన్ అకాడమీ నెలకొల్పి, వర్ధమాన క్రీడాకారులను తీర్చిదిద్దుతున్న గుత్తా జ్వాలకు అభినందనలు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం చక్కటి ప్రోత్సాహం అందిస్తుంది. టోర్నీలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు శుభాకాంక్షలు' అని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. టోర్నీ ముగింపు కార్యక్రమంలో గుత్తా జ్వాల తండ్రి క్రాంతి గుత్తా, ఆదాయపన్ను కమిషనర్ రాజేంద్ర కుమార్, మహా సిమెంట్ చీఫ్ కర్ణాకర్ రావు సహా తదితరులు పాల్గొన్నారు.

అభిమానులకు నో ఎంట్రీ!

పాక్, కివీస్ వార్మప్‌పై కీలక నిర్ణయం




హైదరాబాద్ : పాకిస్థాన్, న్యూజిలాండ్ వార్మప్ మ్యాచ్‌కు అభిమానులకు ప్రవేశం ఉండబోదు!. ఇప్పటికే ఈ వార్మప్ మ్యాచ్‌కు టికెట్లు బుక్ చేసుకున్న అభిమానులకు డబ్బు తిరిగి చెల్లించాలని బుక్‌మైషోకు బీసీసీఐ సూచించనుంది. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో సెప్టెంబర్ 29న పాకిస్థాన్, న్యూజిలాండ్ వార్మప్ మ్యాచ్ షెడ్యూల్ చేశారు. ఇటీవల రీ షెడ్యూల్‌లో భాగంగా వార్మప్ మ్యాచ్‌ల తేదిలు సైతం మారాయి. సెప్టెంబర్ 28న గణేశ్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబి పండుగల భద్రత ఏర్పాట్లతో తీరిక లేకుండా గడుపనున్న పోలీసులకు.. ఆ మరుసటి రోజే పాక్, కివీస్ వార్మప్‌కు భద్రత కల్పించటం కష్టంగా మారింది. ఇదే విషయాన్ని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఉన్నతాధికారులకు పోలీసులు తెలియజేశారు. అక్టోబర్ 9, 10న వరుసగా రెండు మ్యాచులకు భద్రత కల్పించేందుకు సుముఖత వ్యక్తం చేసిన హైదరాబాద్ పోలీసులు.. వార్మప్ మ్యాచ్‌కు సాధ్యం కాదని తేల్చిచెప్పారు. పాక్, కివీస్ వార్మప్ మ్యాచ్‌కు టికెట్లు బుక్ చేసుకున్న అభిమానులకు బీసీసీఐ రీఫండ్ చేయనుంది. దీంతో ఈ వార్మప్ అభిమానులు లేకుండానే ఖాళీ స్టేడియంలో జరుగనుంది. అక్టోబర్ 3న పాకిస్థాన్, ఆస్ట్రేలియా వార్మప్ మ్యాచ్ మాత్రం అభిమానుల నడుమ జరుగుతుంది.

నవచిత్రం

వెండితెరపై భారతీయ సినిమా జీవితం

ఇప్పటివరకు వెండితెరపై ఎన్నో బయోపిక్‌లను చూశాం. సినిమా జీవితాన్నే బయోపిక్‌గా తీస్తే పైగా భారతీయ సినిమా జీవితాన్ని వెండితెరపై ఆవిష్కరిస్తే, ఆ అద్భుతం ఎలా ఉంటుందో వేరే చెప్పక్కర్లేదు. భారతీయ సినిమాకు పునాది ఎక్కడ పడింది? ఆ తర్వాత ఏ విధంగా ఎదిగింది వంటి విషయాలతోపాటు భారతీయ సినిమాకు నివాళిగా 'మేడ్ ఇన్ ఇండియా'ను తెరకెక్కించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. భారతీయ సినిమా చరిత్రలో ఎప్పటికీ గుర్తుంచుకునే విధంగా దర్శకుడు రాజమౌళి దీనికి శ్రీకారం చుట్టారు. ఆయన సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రానికి జాతీయ పురస్కార గ్రహీత నితిన్ కక్కర్ దర్శకత్వం వహించనున్నారు. మాక్స్ స్టూడియోస్, షోయింగ్ బిజినెస్ పతాకాలపై వరుణ్ గుప్తా, ఎస్-ఎస్ కార్తికేయ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. మరాఠీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.



రాజమౌళి

నిజంగానే మాయ.. చేస్తోంది

కళ్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'డెవిల్'. 'బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' అనేది ట్యాగ్ లైన్. నవంబర్ 24న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా నుంచి 'మాయే చేశావే..' అంటూ సాగే తొలి పాటను మేకర్స్ విడుదల చేశారు. "ఐకాన్ మ్యూజిక్ రిలీజ్ చేసిన ఈ అద్భుతమైన మెలోడీ సాంగ్ అందర్నీ మెస్మరైజ్ చేస్తోంది. స్టార్ సింగర్ సిద్ శ్రీరామ్ ఈ పాటను పాడటం హైలైట్.. బృంద మాస్టర్ కొరియోగ్రఫీ, హర్షవర్ధన్ రామేశ్వర్ సూపర్బ్ రెట్రో ట్రాక్, కళ్యాణ్ రామ్, సంయుక్త మధ్య కుదిరిన కెమిస్ట్రీతో మేకర్స్ ఓ ఎగ్జైటింగ్ మ్యూజికల్ జర్నీని స్టార్ట్ చేసి ప్రేక్షకుల హృదయాలను ఆకట్టుకున్నారు. స్వాతంత్ర్యం రాక ముందు ఉన్న బ్యాక్‌డ్రాప్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు. అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తూ, నిర్మిస్తున్నారు.



కళ్యాణ్‌రామ్, సంయుక్త

మెప్పించే క్లాసిక్ లవ్‌స్టోరీ

కన్నడలో ఘన విజయం సాధించిన 'సప్త సాగర దాచే ఎల్లో' చిత్రాన్ని 'సప్త సాగరాలు దాటి' పేరుతో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తెలుగు ప్రేక్షకులకు అందిస్తోంది. రక్షిత్ శెట్టి హీరోగా నటిస్తూ, నిర్మించిన చిత్రమిది. హేమంత్ ఎం రావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించారు. ఈనెల 22న ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది.



రుక్మిణీ వసంత్, రక్షిత్ శెట్టి

ఈ నేపథ్యంలో నిర్వహించిన రిలీజ్ ప్రెస్‌మీట్‌లో హీరో రక్షిత్‌శెట్టి మాట్లాడుతూ, 'నా 'చార్లీ' సినిమాని ఆదరించి, ఇక్కడ 'సప్త సాగర దాచే ఎల్లో' విడుదలకు బాటలు వేసిన తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు. దర్శకుడు హేమంత్ పూర్తి స్థాయి దర్శకత్వ ప్రతిభను తెలిపే చిత్రమిది' అని అన్నారు. దర్శకుడు హేమంత్ ఎం రావు మాట్లాడుతూ, "కన్నడలో మాదిరిగానే ఇక్కడ కూడా ఈ సినిమా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు. 'మేం తెలుగులో రిలీజ్ చేసిన టీజర్‌కి సోషల్ మీడియాలో అనూహ్య స్పందన వచ్చింది. ఇక్కడ కూడా ఈ సినిమాకి ఎందరో అభిమానులు ఉన్నారని అర్థమైంది. ఈ చిత్రం తెలుగులో కూడా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని సహ నిర్మాత వివేక్ కూచిభొట్ల చెప్పారు.
ఈ చిత్ర ట్రైలర్‌ని సోషల్ మీడియా వేదికగా హీరో నాని విడుదల చేసి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. కన్నడలో సూపర్ హిట్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం తెలుగులోనూ సక్సెస్ అవుతుందనే ఆశాభావాన్ని నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ వ్యక్తం చేశారు.

కథ, కథనాలే హైలెట్



మనోజ్‌కుమార్ అగర్వాల్, బాబా పి.ఆర్

ఎం.కె.ఎ.కె.ఎ ఫిలిం ప్రొడక్షన్ సమర్పణలో బాబా పి.ఆర్. దర్శకత్వంలో మనోజ్‌కుమార్ అగర్వాల్ నిర్మించిన చిత్రం 'అష్టదిగ్బంధనం'. సూర్య, విషిక జంటగా నటించిన ఈ చిత్రం ఈనెల 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు బాబా పి.ఆర్. మాట్లాడుతూ, 'అష్టదిగ్బంధనం' అనే పవర్‌ఫుల్ టైటిల్‌కి తగ్గట్టు దాన్ని జస్టిఫై చేసేలా ప్రతి అంశంలో జాగ్రత్తలు తీసుకున్నాం. అలాగే ఇందులోని ప్రతి క్యారెక్టర్ అవతలి వారిని అష్టదిగ్బంధనం చేయాలని చూస్తుంటారు. ఇలా పలువురు వ్యక్తుల స్వార్థంతో కూడిన జీవితాలకు సంబంధించినదే ఈ కథ. ఇది యాక్షన్, థ్రిలర్స్‌ను ఎక్కువగా ఇష్టపడే వారికి బాగా కనెక్ట్ అవుతుంది' అని అన్నారు.
'ఇది స్క్రీన్‌ప్లే బేస్డ్ సినిమా. ఈ కథ వినగానే చాలా ఎగ్జైట్ ఫీలయ్యా. ఇలాంటి కథతో నిర్మాతగా మారుతున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. ప్రేక్షకులను 'అష్టదిగ్బంధనం' చేసే కథ, కథనాలే ఈ సినిమాకి హైలెట్. మా సినిమాకి బిజినెస్ సైడ్ నుంచి రెస్పాన్స్ చాలా బాగుంది. ఆంధ్ర, తెలంగాణల్లో దాదాపు 150 నుంచి 200 థియేటర్స్‌లో విడుదల చేస్తున్నాం. ప్రస్తుతం మా బ్యానర్‌లో ఒక సినిమా సెట్స్ మీద ఉంది. త్వరలో దాని వివరాలు తెలియజేస్తాం' అని నిర్మాత మనోజ్‌కుమార్ అగర్వాల్ చెప్పారు.

మహిళల ఆత్మ గౌరవంతో..


ఏనుగంటి ఫిలిం జోన్ బ్యానర్ పై దర్శక-నిర్మాత లక్ష్మణ్ చిన్నా ప్రధాన పాత్ర పోషిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'నచ్చినవాడు'. ఈ నెల 22న ఈ సినిమా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటకలో కూడా విడుదలకు రెడీగా ఉంది. ఈ సందర్భంగా దర్శకుడు లక్ష్మణ్ చిన్నా మాట్లాడుతూ,' స్త్రీ ఆత్మ గౌరవం ప్రధాన ఇతివృత్తంగా దీన్ని తెరకెక్కించాను. మిజో జోసెఫ్ అందించిన సంగీతం, హర్షవర్ధన్ రెడ్డి అందించిన సాహిత్యం, జావేద్ అలీ, యాజిన్ నిజార్, సైనోరా పాడిన పాటలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. ఆదిత్య మ్యూజిక్ ద్వారా రిలీజైన మా ఆల్బమ్ యూట్యూబ్‌లో విశేష ప్రేక్షకాదరణ పొంది, సూపర్‌హిట్ అయ్యింది. కొత్త తరం నటీనటులను ప్రోత్సహించాలనే సంకల్పంతో తెలుగు, కన్నడ నటీనటులకు ఇందులో అవకాశం ఇచ్చాను. కర్ణాటక, పాండిచ్చేరి, గోవా వంటి తదితర ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. నేటి యువతరానికి, ఫ్యామిలీ ఆడియన్స్‌కి నచ్చే విధంగా ఈ చిత్రం ఉంటుంది' అని చెప్పారు.



లక్ష్మణ్ చిన్నా

తెలుగులో పా..పా..

తమిళంలో విశేష ప్రేక్షకాదరణ పొందిన చిత్రం 'దా...దా...'. ఈ చిత్రాన్ని కన్నడలో ఒలింపియా మూవీస్ సంస్థ ఎస్.అంబేత్ కుమార్ సమర్పించగా తెలుగులో నీరజ సమర్పిస్తున్నారు. పాన్ ఇండియా మూవీస్, జె కె ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా ఎమ్మెస్ రెడ్డి నిర్మాతగా శ్రీకాంత్ నూనెపల్లి, శశాంక్ చెన్నూరు సహ నిర్మాతలుగా దీన్ని 'పా...పా...'గా మన ముందుకు తీసుకొస్తున్నారు.
ఈ సందర్భంగా నిర్మాత ఎం.ఎస్.రెడ్డి మాట్లాడుతూ, 'తమిళంలో మంచి యూత్‌ఫుల్, లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా నిలిచి కోట్ల రూపాయలు వసూళ్లు చేసిన 'దా...దా...'ని 'పా...పా...'గా తెలుగులో తీసుకొస్తున్నాం. అతి త్వరలో గ్రాండ్‌గా ట్రైలర్ లాంచ్ చేస్తాం' అని తెలిపారు.



నా లైఫ్‌లో ఫస్ట్ టైమ్..



వేణు

వేణు తొట్టెంపూడి, అవంతిక మిశ్రా లీడ్ రోల్స్‌లో నటించిన వెబ్ సిరీస్ 'అతిథి'. రాండమ్ ఫ్రేమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై దర్శకుడు భరత్ వైజీ రూపొందించారు. దర్శకుడు ప్రవీణ్ సత్తారు షో రన్నర్‌గా వ్యవహరించిన ఈ సిరీస్ డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో నేటి నుంచి స్ట్రీమింగ్ అవుతోంది.
ఈ సందర్భంగా హీరో వేణు మాట్లాడుతూ, 'కొందరు క్లాసీగా ఉందని, మరికొందరు మాస్ ఎలిమెంట్స్ ఉన్నాయని అంటున్నారు. నన్ను అడిగితే ఇదొక కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ మూవీ లాంటిది. ఇందులో కామెడీ, సస్పెన్స్, డ్రామా, సెంటిమెంట్ అన్నీ ఉన్నాయి. హర్రర్ ఎలిమెంట్స్ తక్కువ. అందుకే ఫ్యామిలీ ఆడియెన్స్ అంతా కలిసి హాయిగా చూడొచ్చు. నా కెరీర్‌లో ఫస్ట్ టైమ్ హర్రర్ కంటెంట్‌లో నటించాను. నా పర్‌ఫార్మెన్స్‌కు మంచి పేరొస్తుందంటే ఆ క్రెడిట్ దర్శకుడు భరత్‌కే ఇవ్వాలి. ప్రవీణ్ సత్తారు ఈ సిరీస్ కోసం మంచి ఎఫర్ట్ పెట్టారు' అని చెప్పారు.

ఎవరూ చూపించని అంశాలు

సీనియర్ నటి జయలలిత సమర్పకులుగా వ్యవహరిస్తూ ఓ కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'రుద్రంకోట'. ఏఆర్ కె విజువల్స్ పతాకంపై రాము కోన దర్శకత్వంలో అనిల్ ఆర్కా కండవల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రుద్ర, శక్తి, విభీష హీరో, హీరోయిన్లుగా నటించారు. ఈ సినిమా ఈనెల 22న స్క్రీన్ మాక్స్ సంస్థ ద్వారా గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు రాముకోన మీడియాతో మాట్లాడుతూ, 'ఇప్పటి వరకు అన్ని మేజర్ టీవీ ఛానల్స్‌లో దాదాపు ఐదు వేలకు పైగా ఎపిసోడ్స్ డైరెక్ట్ చేశాను. జీ తెలుగు, మాటీవీకి సీరియల్ ప్రొడక్షన్ కూడా చేశాను. ఆ సమయంలోనే ఈ సినిమాకి డైరెక్ట్ చేసే ఛాన్స్ వచ్చింది. రుద్రం కోట దగ్గర జరిగిన కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా ఈ చిత్రం చేశాం. శ్మశాన వాటికలో పెరిగి, పెద్దైన ఓ యువకుడి ప్రేమకథా చిత్రమిది. ఇప్పటి వరకు ఎవరూ చూపించని అంశాలను చూపిస్తున్నాం. అలాగే అండర్ కరెంట్‌గా మంచి సందేశం కూడా అందిస్తున్నాం. కోటమ్మ పాత్రలో జయలలిత అద్భుతంగా నటించారు. ఇందులో ప్రతి పాత్ర సినిమాకు కీలకంగా ఉంటుంది. దీనికి సుభాష్ ఆనంద్, నిరంజన్ ఇద్దరు సంగీత దర్శకులు. ఇందులో 5 పాటలు ఉన్నాయి. ఇటీవల టిప్స్ ఆడియో కంపెనీ ద్వారా పాటలు విడుదలై, మంచి వ్యూస్‌తో దూసుకెళ్తున్నాయి. దర్శకుడిగా నాకు రాజమౌళి ఆదర్శం' అని తెలిపారు.



రాము కోన

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886